www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
12
సోమవారం 28 ఆగస్టు, 2017



కొత్తపట్నం సముద్రతీరంలో భారీ వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న ప్రజలు



బై..బై.. గణేశా..

వినాయక నిమజ్జన వేడుకలు చవితి మూడో రోజైన ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణనాథులను ట్రాక్టర్లపై ఊరేగింపుగా .. సముద్ర తీరప్రాంతాలైన కె.పల్లెపాలెం, ఈతముక్కల., మడనూరు ., కొత్తపట్నంకు చేర్చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలు భక్త జనసందోహంతో కిటకిటలాడాయి. ఉండ్రాలయ్యా.. దండాలయ్యా..., జై...జై. గణేశా... బై..బై. గణేశా.. అంటూ విగ్రహాలను తీరంలో నిమజ్జనం చేశారు.

వివరాలు 2లో..

అపశ్రుతి

వినాయక నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటు చేసుకుంది. తొలిరోజే నాలుగు కుటుంబాలలో చీకటి అలముకొంది. కొత్తపట్నం మండలం ఈతముక్కల సమీపంలో వేగంగా ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు బైక్‌లు ఢీకొని నలుగురు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు ఒంగోలు వడ్డెపాలెం,టంగుటూరు మండలం కందులూరుకు చెందిన వారుగా గుర్తించారు.

వివరాలు 3లో..



బైకులు ఢీకొనడంతో మృతిచెందిన అశోక్


కొనసాగుతున్న ఉత్కంఠ

- అందుబాటులోకి రాని డీసీసీబీ చైర్మన్ మోహన్
- అధికారులకు చేరని రాజీనామా లేఖ
- కదులుతున్న డైరెక్టర్లు, సింగిల్ విండో అధ్యక్షులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఒంగోలు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఈదర మోహన్‌బాబు రాజీనామా వ్యవహారంపై ఉత్కంఠ కొనసాగుతోంది. రాజీనామా అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిన మోహన్ ఆదివారం సాయంత్రానికి కూడా ఎవరికీ అందుబాటులోకి రాలేదు. ఆయన రాజీనామా లేఖ లు మంత్రులకు చేరినప్పటికీ, రెండ్రోజుల నుంచి సెలవులు

మిగతా 11వ పేజీలో...



డీసీసీబీ చైర్మన్ ఈదర మోహన్



- ఒంగోలులో జోరుగా నంబర్లాట
- ఫ్యాన్సీ నంబర్ మోజులో యువత
- నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఏజెంట్ల బుకింగ్
- రోజుకు రూ. 5 నుంచి 6 లక్షల వరకు బెట్టింగ్
- వడ్డీలకు తీసుకుని కట్టలేక కాపురాలు గుల్ల
- కూలీలు సైతం చేతులు కాల్చుకుంటున్న వైనం

మాయా జూదం

ఒంగోలు క్రైం : ఒంగోలు నగరంలో ఫ్యాన్సీ నంబర్ల ఆట జోరుగా సాగుతోంది. ఈ మోజులో పడి మహిళలు, యువకులు జోగాడుతున్నారు. రోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. గ్రామాల నుంచి పనుల కోసం వచ్చే కూలీలు సైతం పనులు మానేసి నంబర్ల ఆట వద్ద తిష్ఠ వేస్తున్నారు. చేతిలో డబ్బులు లేకుంటే పది రూపాయలకు వడ్డీకి తీసుకొని నంబర్ గేమ్‌లో చేతులు కాల్చుకుంటున్నారు. ఇలా ఆటో డ్రైవర్లు,వెల్డింగ్ పనులు చేసే వారికి ఎర వేసి ఆశ చూపి కొందరు ఏజెంట్లు లక్షలు దండుకుంటున్నారు.

నంబర్ల ఆట ఇలా...

నంబర్ గేమ్ ఏజెంట్లు ఉదయం ఎనిమిది గంటల

మిగతా 11వ పేజీలో...



ఇందిరమ్మ లబ్ధిదారులకు శుభవార్త

ఒంగోలులో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లు (ఫైల్)



11 లో

- ఆగిన ఇళ్లకు అదనపు సహాయం
- నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాలో పదివేల మందికి ప్రయోజనం



12 లో

డెంగ్యూ పంజా

- జిల్లాలో పెరుగుతున్న పాజిటివ్ కేసులు
- ఈ ఏడాది ఇప్పటికే 162 నమోదు
- పడకేసిన ప్రభుత్వ వైద్యం



బై బై గణేశా...!



కొత్తపట్నం తీరంలో నిమజ్జనం సందడి



గిద్దలూరులోని రామన్నకత్తువలో క్రేన్ సహాయంతో నిమజ్జనం



ఉలవపాడు మండలం కొల్లూరుపాడులో వినాయక విగ్రహాన్ని అందంగా అలంకరించిన ఎడ్ల బండిపై నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



కొత్తపట్నంలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న వినాయక విగ్రహం



త్రిపురాంతకంలో నిమజ్జనం సందర్భంగా యువత కోలాహలం

ఘనంగా వినాయక నిమజ్జనాలు

కోలాహలంగా సముద్ర తీరం

ఒంగోలునగరం : వినాయక చవితి పర్వదినం మూడో రోజైన ఆదివారం సముద్రతీరాల్లో విగ్రహ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చారు. జిల్లాలో కొత్తపట్నం మండలం కె. పల్లెపాలెం, ఈతముక్కల, మడనూరు సముద్రతీరాలు కిటకిటలాడాయి. జై గణేషా.. అంటూ విగ్రహాలను సముద్ర తీరానికి తెచ్చి నిమజ్జనం చేశారు. మూడో రోజుకావటంతో పాటు ఆదివారం రావటంతో ఎక్కువ సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కొత్తపట్నం పల్లెపాలెం తీరంలో ఎక్కువ వాహనాలు ఒకేసారి రావటంతో పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాల్సి వచ్చింది. కొత్తపట్నం- ఒంగోలు మార్గంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. యువత పెద్ద సంఖ్యలో తరలిరావటం, ద్విచక్ర వాహనాలతో యువకులు పోటీ పడి వేగంగా రావటంతో తోటి భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పోలీసు లకు సైతం వీరిని నియంత్రించడం తలనొప్పిగా మారింది. కొత్తప ట్నం- ఒంగోలు రహదారి, ఒంగోలు-ఈతముక్కల రహదారిలో ద్విచక్ర వాహనాల స్పీడుకు ఇతర భక్తులు భీతిల్లిపోయారు. యువత ట్రాఫిక్ రూల్స్ కు విరుద్ధంగా రావటం, మద్యం సేవించి వాహనాలు అదుపు చేయలేనంతగా నడపటం వంటి చర్యలు తోటి భక్తులకు భయంకొలిపాయి. ఈ క్రమంలో ఒంగోలు - ఈతముక్కల రహదారిలో ఎదురెదురు వేగంగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు యువకులు మృతి చెందారు. పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుని ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చూడాల్సిన అవసరముంది.



కొత్తపట్నం తీరంలో వినాయకునికి హారతి ఇస్తున్న మహిళ



వేలంలో దక్కించుకున్న లడ్డును బాషా నెత్తిన పెడుతూ అభినందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వినాయక లడ్డును వేలంలో కొన్న ముస్లిం

- వర్షాలు పడాలని పూజ

- అభినందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు : అతను ముస్లిం. భావభేదం లేదు. ఇతర మతాలనూ గౌరవిస్తారు. ఆదరిస్తాడు. వినాయక లడ్డును వేలం పాడి హిందూ, ముస్లిం బాయ్‌బాయ్ అని నిరూపించారు. పట్టణంలోని రేడియో బావి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డును షేక్ అహమ్మద్ బాష అనే పండ్ల వ్యాపారి రూ.30 వేలకు వేలంలో చేజిక్కించుకున్నారు. గిద్దలూరు ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురవాలంటూ స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి పాదాల చెంత ఆ లడ్డును ఉంచి ప్రార్థించారు. వర్షాలు కురవాలనేగాక, కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలన్న బాషా ఆకాంక్షను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభినందించారు.



పర్చూరులో నిమజ్జనం సందర్భంగా....



మార్కాపురంలో యువత ఉత్సాహం


ఆలూరి రాంబాబు మృతదేహం


బొబ్బాల కృష్ణమూర్తి


బత్తుల పవన్ మృతదేహం


తీవ్ర గాయాలైన శివశంకర్

మోటారు సైకిళ్లు ఢీ - నలుగురి దుర్మరణం

- ఒకరికి తీవ్ర గాయాలు
- వినాయక నిమజ్జనంలో విషాదం
- ఘొల్లుమన్న కందులూరు

ఒంగోలు క్రైం : వినాయ నిమజ్జనం తొలిరోజే నాలుగు కుటుంబాలలో విషాదం నింపింది. కొత్తపట్నం మండలం ఈతముక్కల సమీపంలో గల బకింగ్‌హామ్ కాలువవద్ద రెండు మోటారు సైకిళ్ళు ఢీకొని నలుగురు మృతి చెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఒంగోలు వడ్డెపాలెంకు చెందిన మందపల్లి అశోక్(25), బత్తుల పవన్(14) మృతిచెందారు. కుట్టుబోయిన శివశంకర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. టంగుటూరు మండలం కందులూరుకు చెందిన ఆలూరి రాంబాబు(40), బొబ్బాల క్రిష్ణమూర్తి(25) ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఒంగోలుకు చెందిన మందపల్లి ఆశోక్, కుట్టుబోయిన శివశంకర్, బత్తుల పవన్‌లు వినాయక నిమజ్జనం అనంతరం మోటారుసైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తున్నారు. కందులూరుకు చెందిన ఆలూరి రాంబాబు, బొబ్బాల కృష్ణమూర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం కోసం మోటారు సైకిల్‌పై ఈతముక్కల వెళ్తున్నారు. రెండు మోటారు సైకిళ్ళు వంద కిలో మీటర్లకు మించి వేగంగా నడుపుతూ ఎదురుగా ఢీకొట్టడం తో రెండు వాహనాలు నజ్జునుజ్జయ్యాయి. మందపల్లి అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా కందులూరుకు చెందిన ఆలూరి రాంబాబు మృతి చెందాడు. బొబ్బాల కృష్ణమూర్తి, బత్తుల పవన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. రిమ్స్‌కు తీసు కెళ్లగా అక్కడ మృతి చెందారు. సంఘటనాస్థలాన్ని ఒంగోలు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, కొత్తపట్నం ఎస్సై ఆంజనేయులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

రిమ్స్‌లో మిన్నంటిన రోదనలు

రిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే రామ చంద్రరావు ఆయన భార్య 14 ఏళ్ళ కుమారుడు పవన్ మృతి చెందిన వార్త విని గుండెలవిసేలా రోదిస్తున్నారు. బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న కందులూరు కృష్ణమూర్తి ఇక లేడని తెలిసి తండ్రి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. చేతికందిన బిడ్డను కోల్పోయానని కృష్ణమూర్తి తండ్రి, ఆడుకొనే వయస్సులోనే అనంతలోకాలకు చేరుకున్నాడని పవన్ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పోలీసు యంత్రాంగం ప్రత్యేకచర్యలు

వినాయక నిమజ్జనం తొలిరోజే నలుగురు మృతి చెందడంతో పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎస్పీ సత్యఏసుబాబు ఆదేశాలతో నిమజ్జనానికి వెళ్ళే వారి భద్రత కోసం నిరంతరం గస్తీ ఉండేలా ప్రత్యేక వాహనాలను కొత్తపట్నం, ఈతముక్కల రహదారుల్లో ఏర్పాటు చేశారు.

కందులూరులో విషాదఛాయలు



అల్లూరి రాంబాబు, బొబ్బాల క్రిష్ణమూర్తి(ఫైల్ ఫొటోలు)

కందులూరు(టంగుటూరు): మండలంలోని కందులూరులో విషాదఛాయలు అలముకున్నాయి. ఆదివారం వినాయక విగ్రహ నిమజ్జనం కోసం ఈత ముక్కల వెళ్తుండగా అల్లూరి రాంబాబు(38), బొబ్బా ల క్రిష్ణమూర్తి(25) ఇద్దరూ ఒకే మోటారు సైకిల్‌పై వెళ్తూ మృతిచెందారు. వారి మృతిని మిత్రులు, గ్రామ స్తులు జీర్ణించుకోలేకపోయారు. వారంతా తల్లడిల్లారు. అప్పటి వరకు వారిలో ఉన్న ఆనందం ఒక్కసారిగా చెల్లాచెదరయింది. విషయం తెలియగానే కందులూరు అంతా ఘొల్లుమంది. ఊరంతా విషాదంలో మునిగింది. రాంబాబు ప్రైవేట్ కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తు న్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద దిక్కు పోవడంతో కుటుంబ సభ్యులంతా కన్నీరు మున్నీరవుతున్నారు. తండ్రిని పోగొట్టుకున్న ఇద్దరు బిడ్డలు అల్లాడిపోతున్నారు. క్రిష్ణమూర్తి ఇంజనీరింగ్ పట్టభద్రుడు. అతను ఉద్యోగ వేటలో ఉన్నాడు. తల్లి మృతితో అతను తన సోదరునితో కలసి తండ్రి సంరక్షణలోనే ఉన్నాడు. తాను ఉద్యోగం చేసి తమ్ముడిని పెద్ద చదువు చదివించాలని, తండ్రిని బాగా చూసుకోవాలని ఆశించేవాడు. బిడ్డ ఉద్యోగం చేసి అండగా ఉంటాడని తండ్రి,అన్న అన్నింటా తోడుగా ఉంటాడని తమ్ముడు ఆశించారు. రాంబాబు, క్రిష్ణమూర్తి మృతి ఆ రెండు కుటుంబాలను దుఖంలో ముంచింది. ఆకుటుంబాలకు జరిగిన అన్యాయం చూసిన బంధువులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు రిమ్స్‌లో ఉన్న ఇద్దరి మృతదేహాలు పోస్టు మార్టం అయ్యాక సోమవారం గ్రామానికి తీసుకురానున్నట్లు తెలిసింది.


నీటికుంటలో మునిగి మృతిచెందిన దుగ్గినేని వెంకటసాయి(10)

ఈతకు వెళ్ళి నీటికుంటలో మునిగి విద్యార్థి మృతి

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం మండలం బోయలపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం దుగ్గినేని వెంకటసాయి(10) తోటి విద్యార్థులు మరోముగ్గురుతో కలసి గ్రామం పక్కనే ఉన్న ఎర్రవాగులో ఉన్న నీటికుంటలో ఈతకు వెళ్ళారు. లోతు ఎక్కువగా ఉండడంతో పాటు ఈత రాక పోవడంతో నీటిలో మునిగి వెంక టసాయి మృతిచెందారని గ్రామస్తులు తెలిపారు. వెంకటసాయితో కలసి వెళ్ళిన విద్యార్థులు గట్టు మీద ఉండగానే వెంకటసాయి నీటిలో దూకిపైకి రాలేక పోయాడని తెలిపారు. వెంకటసాయి మునిగి పోవడంతో మిగిలిన ముగ్గురు విద్యార్థులు ఊరిలోకి వచ్చి జరిగినవిషయం చెప్పకుండ చెట్లపొదలలో దాక్కొన్నట్లు తెలిపారు. పశువుల కాపరులు చూసి గ్రామంలో చెప్పడంతో గ్రామస్తులు మృతదేహాన్ని బయటికి తీశారు. వెంకటసాయి మృతి చెందడంతో తల్లిదండ్రులు ఆంజనేయులు, సరోజిని రోదిస్తున్నారు. వారికి ఒక కొడుకు, ఒక కుమార్తె సంతానం కావడంతో కొడుకు లేనిలోటు జీర్ణించుకోలేక కన్నీరు మున్నీరవుతున్నారు. చూపరులను సైతం కన్నీరు పెట్టించింది.

సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో సైకో వీరంగం

- అరగంటకు పైగా నిలిచిన హౌరా ఎక్స్‌ప్రెస్


సైకోను తాళ్లతో కట్టేస్తున్న ప్రయాణికులు

సింగరాయకొండ రూరల్: పట్టణంలోని స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆదివా రం 22ఏళ్ల సైకో సాత్వికా విలియం వీరంగం సృష్టించాడు. ప్రయాణి కు లపై దాడి చేసి అదుపు చేయబోయిన పోలీసులపై కూడా దాడి చేశాడు. ఒక కానిస్టేబుల్ ఎంబి షాకీర్‌కి గాయాలయ్యాయి. హౌరా రైల్వే ప్రయాణికులపై దాడిచేసి సుమారు 30 నిమిషాల పాటు సింగరాయకొండ స్టేషన్‌లో నిలిపివేశారు. స్టేషన్‌లోని స్టాల్స్‌పై, రైల్వే బోగీల్లో సమోసాలు అమ్ముకునే వారిపై కారం చల్లగా ప్రయాణికులందరూ కలిసి అతనిని అదుపు చేసి కాళ్ళను కట్టివేసి రైల్వే పోలీసులకు అప్పగించారు. ఒంగోలు ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్‌కు ఆ సైకోను తరలించారు. ఆర్‌పిఎఫ్ ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం సైకో సాత్వికా విలియం అతని భార్య వదిలి వెళ్లడంతో మతిస్థిమితం కోల్పోయాడని, చెన్నై మెంటల్ హాస్పటల్ నుంచి తప్పించుకొచ్చాడని తెలిపారు. మరలా అదే ఆసుపత్రికి తరలిస్తామని చెప్పారు.

కుటుంబ కలహాలతో అత్తపై కోడలు దాడి

చీరాలటౌన్: కుటుంబకలహాల నేపథ్యంలో అత్తపై కోడలు దాడికి పాల్పడిన సంఘటన చీరాల మండలం తోటవారిపాలెం వీవర్స్‌కాలనీలో ఆదివారం సాయంత్రం జరిగింది. చీరాల అవుట్‌పోస్ట్ పోలీసులకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తోటవారిపాలెం వీవర్స్‌కాలనీకి చెందిన బి.లీలావతి కుమారుడు సాంబశివరావుతో చినగంజాంకు చెందిన లక్ష్మీతో 6సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో లక్ష్మి పుట్టింటిలోనే నివసిస్తోంది. ఆదివారం తన మేనమామ చనిపోవడంతో చూడటానికి లక్ష్మి తన తల్లితో కలిసి తోటవారిపాలెం వచ్చింది. ఈ సందర్భంగా అత్త కోడళ్ళ మధ్య వాగ్వాదం జరగడంతో లక్ష్మి అత్మ లీలావతిని జుట్టుపట్టుకుని లాగి దాడి చేసింది. చికిత్స నిమిత్తంచీరాల ఏరియా వైద్యశాలలో చేరిన బాధితురాలి నుండి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి


పొలం వద్ద సుబ్బారెడ్డి మృతదేహం

పొదిలి : విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతిచెందిన సంఘటన మల్లవరం గ్రామ సమీప శివార్లలో ఆదివారం వెలుగుచూసింది. కుంచేపల్లి గ్రామంకు చెందిన రైతు పేరం సుబ్బారెడ్డి(34) మల్లవరం గ్రామంలో 6ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. శనివారం సాయంత్రం తన పొలానికి నీరు పెట్టుకునేందుకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ మోటర్ పనిచేయకపోవటంతో మరమ్మతులు చేస్తుండగా షాక్ కు గురై అక్కడిక్కడే మృతిచెందాడు. పొలం వెళ్లిన సుబ్బారెడ్డి ఇంటికి రాకపోవటంతో ఆందోళనలు చెందిన కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి చూశారు. సుబ్బారెడ్డి విగతజీవుడై పడి ఉండడాన్ని చూసి బోరున విలపించారు. వీఆర్వో సామ్యేల్ పోలీస్, విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు పరిశీలించారు. మృతదేహంను పోస్టు పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు సుబ్బారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎస్సై ఎస్.సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొన్నలూరు: మండలంలోని బాలిరెడ్డిపాలెంలో రైతు సంగన రమణారెడ్డి(47) మోటారు వేయబోయి షాక్‌తో మృతి చెందాడు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బోరుకు సరఫరా జరిగి షాక్‌కు గురైనట్లు తెలిసింది. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

రెండు లారీల మధ్య నలిగి డ్రైవర్ మృతి


మహమ్మద్ బిలాల్ మృతదేహం

ఉప్పుగుండూరు (నాగులుప్పలపాడు) : ప్రమాద వశాత్తు రెండు లారీల మధ్య నలిగి డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఉప్పు గుండూరులో ఒక శనగల గోదాంవద్ద జరిగింది. పోలీసుల కధనం మేరకు హర్యానాకు చెందిన లారీ శనగల లోడు దింపేందుకు ఉప్పు గుండూరులోని ఒమ్మెవరం రోడ్డులోని శనగల గోదాంవద్దకు శని వారం రాత్రి చేరింది. లోడు దించిన తరువాత డ్రైవర్ మహమద్ బిలాల్(23) లారీ ముందు అద్దాలు తుడుచుకుంటున్నాడు. ఆదే గోదాం నుంచి మరో లారీ రివర్స్‌లో వస్తుండగా బిలాల్‌ను ఢీకొట్టింది. రెండులారీల మధ్య నలిగి గాయాల పాలైన బిలాల్‌ను ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. నాగులుప్పలపాడు ఎఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

గిద్దలూరు : గిద్దలూరు - నంద్యాల ఘాట్ రోడ్డులో దిగువమెట్ట సమీపంలో రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం కూలి అడ్డంగా పడిపోయింది. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు జరుగగా రోడ్డుపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎస్సై కె.మల్లికార్జున హుటాహుటిన గిద్దలూరు నుంచి ప్రొక్లయినర్ తీసుకుని వెళ్లి చెట్టును పక్కకు తొలగించడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి. సుమారు 4 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. చిమ్మచీకటిలో, అడవి మధ్యలో వాహనచోదకులు, బస్సుల్లోని ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ గడిపారు.

ఉత్సాహంగా గణనాథుల నిమజ్జనాలు

- పలు మండపాల వద్ద అన్నదానాలు, లడ్డూల వేలం
- ప్రత్యేక చర్యలు తీసుకున్న పోలీసులు

గిద్దలూరు : నియోజకవర్గంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. పట్టణంలోని వస్త్రగణపతి నిమజ్జనం సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన ర్యాలీలో ఎమ్మెల్యే, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పాండురంగారెడ్డి నగర్‌లో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీలు చేపట్టి, విజేతలకు బహుమతులు అందజేశారు. అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నిమజ్జన కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు మునగనూరి సుబ్బారావు, సభ్యులు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని సుమారు 40 ప్రాంతాల్లో నెలకొల్పిన విగ్రహాలను మూడు రోజులుగా పూజించి ఆదివారం నిమజ్జనానికి తరలించారు. చిన్న, పెద్ద, పురుష, స్త్రీలు అనే బేధం లేకుండా రంగులు చల్లుకుంటూ భక్తిభావంతో ఉత్సాహంగా నిమజ్జన ర్యాలీలో పాల్గొనడం కనిపించింది. రాచర్ల మండలం చినగానిపల్లె సమీపంలోని రామన్నకతువలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ట్రాక్టర్లు, లారీలపై తరలించారు. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు మండపాల్లో లడ్డు వేలం పాటలు నిర్వహించారు. వేలంపాటలో లడ్డూను కొనుగోలు చేసిన భక్తులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.


తిమ్మాపురంలో నిమజ్జనానికి తరలుతున్న విగ్రహాలు


గిద్దలూరులో నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రాచర్ల : మండలంలోని పలుగుంటిపల్లి, ఓబులరెడ్డిపల్లి, రాచర్ల, ఆకవీడు గ్రామాల్లో గణనాథులను పెద్ద ఎత్తున ఊరేగింపుగా తీసుకెళ్లి రామన్నకతువలో నిమజ్జనం చేశారు. తురిమెళ్ళ, కంభం, రాచర్ల మండలాల నుంచి ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి గణనాథులను రామన్నకతువకు తరలించారు. ఈ సందర్భంగా పలుగుంటిపల్లి గ్రామంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ టి.వెంకటేశ్వర్‌రెడ్డి 95,200 రూపాయలకు వేలంపాటలో లడ్డూను దక్కించుకున్నారు. ఓబులరెడ్డిపల్లె గ్రామంలో మండల జన్మభూమి కమిటీ సభ్యుడు సూరా పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విగ్రహాలను నిమజ్జనం చేశారు. రామన్నకతువ వద్ద ముందు జాగ్రత్తగా ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ఎస్సై యు.నాగశ్రీను బందోబస్తు నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి వచ్చిన విగ్రహాలను క్రేన్‌ల సహాయంతో పోలీసు సిబ్బంది నిమజ్జనం చేపట్టారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి భక్తులకు భోజన తాగునీటి సౌకర్యం కల్పించారు.

కార్యక్రమాలను టీడీపీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగుల పోలురాజు, సీనియర్ నాయకుడు సూరా స్వామిరంగారెడ్డి, ఆకవీడు సర్పంచ్ సూరా మల్లమ్మ, వైస్ ఎంపీపీ షేక్ నాయబ్‌రసూల్, పేర్ల పరమేశ్వరరెడ్డి, వెనుతుర్ల రామకృష్ణారెడ్డి, బిజ్జం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణేష్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. కంభం చెరువు, కోన, రామన్న కత్వ వద్ద నిమజ్జనం పూర్తి చేశారు.

కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలి

గిద్దలూరు : కుల మతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఐవీరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని వస్త్ర వ్యాపారులు ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ చేరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శీలం బాలంకిరెడ్డి, పీరయ్య, వైసీపీ నాయకులు రెడ్డి భాస్కర్‌రెడ్డి, పల్లె ప్రతాప్, చక్కెర బాల నాగిరెడ్డి, చల్లా అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిమజ్జన కార్యక్రమంలో ఐవీరెడ్డి తదితరులు

కొమరోలు : మండలంలోని 32 విగ్రహాలు నిమజ్జనానికి బయలుదేరాయి. కొమరోలు పట్టణంలో 7 విగ్రహాలను చెక్‌పోస్టు ఆవరణ నుంచి పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలసిన వినాయకుని దేవాలయ మండపంలో ఉన్న వినాయకుని లడ్డూను చలిచీమల శ్రీనివాసచౌదరి, మానుకొండ రమణయ్య, రాము, వెంకటేశ్వర్లు, కిట్టయ్య బృందం 35 వేల లడ్డును వేలంపాటలో వరుసగా 3వ సంవత్సరం దక్కించుకున్నారు. అనంతరం దామెర్లచెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు

రాచర్ల : మండలంలోని చోళ్ళవీడు గ్రామసమీపాన ఇటీవల కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నెమలిగుండం నుంచి నీరు ప్రవాహం కొనసాగడంతో గుండ్లకమ్మకు భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో అటు ఆకవీడు, ఇటు గిద్దలూరు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం తగ్గుముఖం పట్టడంతో గుండ్లకమ్మ వాగులో ప్రవాహం మందగించింది. ముందు జాగ్రత్తగా ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ఎస్సై యు.నాగశ్రీను, సర్పంచ్ ముత్యాల మధు, ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ప్రజ్వాల్‌రెడ్డికి ట్రిపుల్ ఐటీలో సీటు

బేస్తవారపేట : మండలంలోని పూసలపాడు గ్రామానికి చెందిన మద్దుల ప్రజ్వాల్‌రెడ్డి ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడు. బేస్తవారపేటలోని యశ్వంత్ స్కూల్‌లో 10వతరగతి పూర్తిచేశాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రజ్వాల్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

రక్తదానం

గిద్దలూరు టౌన్ : ఐవీరెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఆదివారం మహిళకు రక్తదానం చేసి ఆదుకున్నారు. కడప జిల్లా కలసపాడు మండలం ముద్దిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మీదేవి అనే మహిళ స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో రక్తహీనతతో బాధపడుతుండగా ఐవీరెడ్డి యువసేన సభ్యుడు దాసరి బాబు ఒ-నెగటివ్ రక్తాన్ని దానం చేసినట్లు సభ్యులు పల్లె సుధాకర్‌రెడ్డి, సుందర్‌రాజు అర్జున్ తెలిపారు.

నివాళులు

గిద్దలూరు : పట్టణంలోని వాసవి కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు బల్లాని వెంకటేశ్వర్లు (70) మృతిచెందగా రిటైర్డ్ ఉద్యోగుల, ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్రమణ్యం, పలువురు సంఘ ప్రతినిధులు ఆదివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబీకులకు సానుభూతి తెలియచేశారు. కాగా రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.బుగ్గారెడ్డి (86) మృతిచెందగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు నివాళులు అర్పించారు.

కంభం చెరువుకు చేరిన నీరు

- తాగునీటి అవసరాలు తీరుతాయని ప్రజల ఆశాభావం

కంభం : చారిత్రాత్మకమైన కంభం చెరువుకు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొద్దిపాటి నీరు చేరింది. దీంతో తాగునీటి అవసరాల కొరత తీరుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావం వల్ల నల్లమల అడవిలో పడిన వర్షానికి గుండ్లకమ్మ, జంపలేరు వాగుల నుంచి కంభం చెరువుకు నకలగండి చానల్ ద్వారా పెద్ద కంభం తూము వరకు మోస్తారు నీరు చేరింది. ఈ నీటిని వృథాగా పోనివ్వకుండా అలాగే నిల్వ ఉంచితే భూగర్భజలమట్టం పెరిగి బోర్ల ద్వారా తాగునీటి అవసరాలు తీరుతాయని ప్రజలు భావిస్తున్నారు. రాష్ట్రం, జిల్లాలో భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, వాగులు నిండి పొంగిపొర్లినా కంభం చెరువుకు ఒక అడుగు నీరు కూడా చేరకపోవటంతో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కంభం చెరువుకు చేరిన వర్షపు నీరు

రూ. 30,500 పలికిన లడ్డు

గిద్దలూరు : వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని శర్మ వీధిలోని జువ్విళ్ళబావి వినాయక స్వామి దేవస్థానంలో ఆదివారం లడ్డు వేలం పాట నిర్వహించారు. పిండిమిషన్ యజమాని బోగాని గురువయ్య, ఆయన కుమారుడు హరికృష్ణ 30,500 రూపాయలకు లడ్డును దక్కించుకున్నారు.


వేలంలో లడ్డూను కొనుగోలు చేసిన గురువయ్య కుటుంబీకులు

చెక్‌డ్యాంలకు జలకళ

రాచర్ల : ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెక్‌డ్యాంలకు నీరు వచ్చి చేరింది. శుక్రవారం నుంచి పడుతున్న వర్షాలకు చెరువులకు కొద్దిపాటి నీరు రాగా చెక్‌డ్యాంలకు పూర్తిస్థాయిలో వచ్చింది. ఇటీవల మండలంలో 30 చెక్‌డ్యాంలు నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే ఈ నిర్మాణాలు 80 శాతం మేర జరిగాయి. భూగర్భజలాలు పెంపొందించేందుకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఇరిగేషన్ డీఈ ఆర్.వెంకటేశ్వర్లు ఎక్కడా రాజీపడకుండా నిర్మాణాలను నాణ్యతతో చేపట్టారు. దీంతో ఇప్పుడు పడుతున్న వర్షాలకు చెక్‌డ్యాంలలో పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నీటితో కళకళలాడుతున్న చెక్‌డ్యాం

పూరిగుడిసెకు రూ.45923 విద్యుత్ బిల్లు

బేస్తవారపేట : మండలంలోని శింగరపల్లె గ్రామంలో ఒక పూరి గుడిసెలో ఒక బల్బు మాత్రమే ఉంది. ప్రతి నెలా వందలోపు కరెంటు బిల్లు వస్తుండేది. కానీ ఈ నెల మాత్రం ఏకంగా రూ.45923 బిల్లు రావడంతో యజమాని దేవపత్తి పీరమ్మ ఆశ్చర్యపోయింది. పూరి గుడిసెకు ఇంత బిల్లు రావడం ఏంటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు బిల్లును పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు పీరమ్మ కోరుతోంది.


← అధికారులు ఇచ్చిన కరెంటు బిల్లు ఇదే

సినిమాలు •
గిద్దలూరు

కృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
శ్రీనివాస	- వివేకం
వెంకటేశ్వర	- అర్జున్ రెడ్డి
నటరాజ్	- జయ జానకి నాయక

జాతీయ ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు విద్య : జాతీయ స్థాయి ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో బి. విజయభాస్కర్ తెలిపారు. జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేక ఇతర పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. బీఎస్ఈఏపీ.ఓఆర్‌జీలో చూడవచ్చని తెలిపారు. జనరల్, బీసీ విద్యార్థులు పరీక్ష ఫీజు రూ. 100, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులకు రూ. 50 వచ్చేనెల 20లోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు స్కూలు డైస్ కోడ్‌ను పాస్‌వర్డుగా టైప్ చేసి దరఖాస్తు పొందవచన్నారు పరీక్ష ఫీజు స్టేట్ బ్యాంకు ఆఫ్ఇండియా ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

29, 30తేదీల్లో టీచర్ల పని సర్దుబాటు కౌన్సెలింగ్

ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్
పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు

ఒంగోలు విద్య : జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె. సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కౌన్సెలింగ్ కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించి ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. బదిలీలు పూర్తయిన తర్వాత కొన్ని వివాదాంశాల వల్ల డీఈవో పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులందరికీ స్థానాలు కేటాయించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండి ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలలను గుర్తించి అవసరమైన మేరకు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ఇటీవల నిర్వహించి సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో భర్తీ కాకుండా మిగిలిపోయిన పోస్టులు, అనధికారికంగా పాఠశాలలకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుల ఖాళీలు, దీర్ఘకాలంగా సెలవులో ఉన్న ఉపాధ్యాయుల ఖాళీలు, డైట్, డీఈడీ కళాశాలలు, సర్వశిక్షా అభిమాన్, ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ, డీసీఈబీ, వయోజన విద్యాశాఖల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఖాళీలను గుర్తించి మిగిలి ఉన్న టీచర్లను వాటిలో సర్దుబాటు చేయాలన్నారు. తప్పని సరిగా బదిలీ కావాల్సి ఉండి బదిలీ అయి రిలీవర్ రాని కారణంగా బాధ్యతల నుంచి విడుదలకాకుండా అదే పాఠశాలలో కొనసాగుతున్న టీచర్ల వివరాలను జిల్లా అధికారులు కమిషనర్‌కు నివేదించారు. కమిషనర్ ఉత్తర్వులు మేరకు పని సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించి అవసరం ఉన్న స్థానాలకు టీచర్లను కేటాయిస్తారు.



డీఈవో పూల్‌లో 35 మంది ఉపాధ్యాయులు

జిల్లాలో ప్రస్తుతం డీఈవో పూల్‌లో 35 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు 16 మందికి కోరుకునేందుకు స్థానాలు లేకపోవడంతో వారు డీఈవో పూల్‌లోనే మిగిలిపోయారు. ఇటీవల వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయించారు. అయితే తాజాగా డీఈవో పూల్‌లోని టీచర్లందరికీ 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేయడంతో వీరికి కూడా కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. రేషనలైజేషన్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఆరుగురు మిగిలిపోయారు. పాఠశాలలో వీరు కోరుకునేందుకు ఖాళీలు లేవు. దీంతో ఆరుగురిని స్కూల్ అసిస్టెంట్ గణితం పోస్టుల్లో నియమించనున్నారు. ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్లు ఐదుగురు డీఈవో పూల్‌లో ఉండగా వీరిలో ఇద్దరు కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారు. మిగిలిన ముగ్గురులో ఇద్దరు ఎన్‌సీసీ స్థానాల వివాదం వల్ల గాలిలో ఉండగా ఒకరికి రేషన్‌లైజేషన్‌లో పోయిన పోస్టు అరేంజింగ్ వెకెన్సీ రావడంతో డీఈవో పూల్‌లో మిగిలిపోయారు. ఈ ఐదుగురికి కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉంది. సెకండరీ గ్రేడ్‌లో ఇద్దరు కౌన్సెలింగ్‌కు గైర్హాజరై, మరో ఇద్దరు, బయాలజికల్ సైన్స్‌లో ఇద్దరు టీచర్లు, ఉర్దు బాషాపండితులు గ్రేడ్-2 ఇద్దరు డీఈవో పూల్‌లో ఉన్నారు. వీరందరికీ 29, 30తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయిస్తారు. ఖాళీ స్థానాలను ఇప్పటికే డీఈవో కార్యాలయం అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు.

ఎస్‌ఏలకు డైట్, జేఎల్‌గా ఉద్యోగోన్నతులు ఇవ్వాలి

- స్కూల్ అసిస్టెంట్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయి విజ్ఞప్తి

ఒంగోలు విద్య : స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే మండల విద్యాధికారులు, డైట్ అధ్యాపకులు, జూనియర్ లెక్చరర్‌లుగా ఉద్యోగోన్నతలు కల్పించేలా సర్వీసు రూల్స్ రూపొందించాలని స్కూల్ అసిస్టెంట్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.ఆర్. సాయి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అప్ గ్రేడ్ హైస్కూళ్లకు స్కూలు అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గానికి ఉప విద్యాధికారి, మండలానికి ఇద్దరు ఎంఈవోలు, యూపీ స్కూళ్లకు ప్రధానోపాధ్యాయుడి పోస్టు, ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు. వచ్చే నెల 1న చేపట్టనున్న సీపీఎస్ మిలీనియం మార్చ్‌కు సమావేశం మద్దతు ప్రకటించింది. సంఘ జిల్లా అధ్యక్షుడు చింతల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. శరత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి. రమణకుమార్, రాష్ట్ర కార్యదర్శి బి. తిరుపతి, జిల్లా నాయకులు సి.హెచ్. సుబ్బారావు, వాసుదేవమూర్తి, ప్రసాద్, నారాయణరావు, శేషగిరి, ఓబులు, వెంకటేశ్వర్లు, కృపాచంద్రుడు, యల్లయ్య, బుచ్చిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్కూల్ అసిస్టెంట్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయి

ఎన్‌టీఎస్ఈ పరీక్షకు 18లోపు దరఖాస్తులు

ఒంగోలు విద్య : జిల్లాలో అన్ని యాజమాన్యాలలోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ (ఎన్‌టీఎస్ఈ) మొదటి దశ పరీక్షకు వచ్చే నెల 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.విజయభాస్కర్ తెలిపారు. నంబరు 5న ఒంగోలులో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన విద్యా సంస్థలు, కేంద్రీయ విద్యాలయాలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈలనుంచి గుర్తింపు విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులందరూ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. పరీక్షఫీజు రూ. 200 చలానా రూపంలో వచ్చే నెల 20లోపు పరీక్ష పీజు చెల్లించాలన్నారు. పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలో కానీ, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయ వెబ్ సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. బీఎస్ఈఏపీ.ఓఆర్‌జీలో కానీ సంప్రదించాలన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు కోసం ఎస్ఎస్‌సీ స్కూల్ కోడ్‌ను పాస్‌వర్డుగా ఉపయోగించాలని సూచించారు.

అన్‌ట్రైన్డ్ టీచర్లు వివరాలు నమోదు చేయాలి

ఒంగోలు విద్య : జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పనిచేస్తున్న అన్‌ట్రైన్డ్ టీచర్లందరూ తమ వివరాలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐవోఎస్) వెబ్ సైట్‌లో నమోదు చేయాలని డీఈవో విజయభాస్కర్ తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో ప్రొఫార్మా -1లో ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, గిరిజన, సాంఘిక సంక్షేమం, ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నవారు వివరాలను పొందుపర్చాలన్నారు. ప్రొఫార్మా-2లో ఎయిడెడ్ విద్యా సంస్థలు, ప్రైవేటు విద్యా సంస్థలలో పనిచేస్తున్న అన్‌ట్రెయిన్డ్ టీచర్లు వివరాలను నమోదు చేయాలని సూచించారు.

యాచకుడి మృతి

ఒంగోలు క్రైం : నగరంలోని జయప్రకాష్ కాలనీ వద్ద గుర్తు తెలియని యాచకుడు ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్సై ప్రసాదు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వయసు 40 ఏళ్లు ఉంటుందని నిర్ధారించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440627122, 9441012974 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రసాదు కోరారు.

టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3. Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.

ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!



'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోష పడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.



- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?

మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.

లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.


బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన

జంతర్‌మంతర్ :

1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ▶ ....
2. వియోనిగం ▶ ....
3. భాతంసుప్ర ▶ ....
4. చాపంయతి ▶ ....

చుక్కలు కలపండి



కొమ్మమూరు ఆయకట్టులో

వరినాట్లు షురూ..!



నిండుగా పారుతున్న కొమ్మమూరు కాలువ

- ప్రస్తుతం కాలువలో ప్రవహిస్తున్న 5 అడుగుల నీరు
- వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం

చీరాల : కొమ్మమూరు ఆయకట్టు పరిధిలో మాగాణి సాగు మొదలైంది. ఆయకట్టు పరిధిలోని పలు చోట్ల నాట్లు మొదలయ్యాయి. చీరాల-కారంచేడు మధ్య రెండు సంవత్సరాల క్రితం సాగునీరు సక్రమంగా అందక సుమారు 500ఎకరాలు బీడుగా వదిలేశారు. కారంచేడు మండలంలో కొన్ని ఎత్తిపోతల పథకాల కింద ఇదే పరిస్థితి నెలకొంది. అయితే ఈ ఏడాది ఎగువన కురిసిన వర్షాలతో పాటు ఈ ప్రాంతంలో కూడా వర్షాలు అధికమొత్తంలో కురిశాయి. గత రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటి వరకు కురిసిన వర్షపాతం ఎక్కువ. మాగాణితోపాటు మెట్టపైర్లకు ప్రధానంగా ఖరీఫ్‌లో సాగు చేసిన పైర్లకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతోంది. ప్రధానంగా చీరాల, చినగంజాం, సంతరావూరు, తిమ్మసముద్రం తదితర ప్రాంతాలలో ఇప్పటికే ఏతకు వచ్చిన నార్లను పీకి నాట్లు ప్రారంభించారు. ప్రస్తుతం కారంచేడు బ్రిడ్జి వద్ద ఐదు అడుగుల నీటిమట్టం ఉంది. రెండు, మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు చేలల్లో కూడా నీరు నిలిచింది. చీరాల-కారంచేడు మధ్య పొలాల్లో పూర్తిస్థాయిలో నాటుకు అనుకూలంగా ఉండటంతో ఆదివారం నుంచి రైతులు నాట్లు ప్రారంభించారు. గత రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది మాగాణికి అనుకూలంగా ఉండేలా వాతావరణం ఉందని రైతులు భావిస్తున్నారు. అయితే కొమ్మమూరు ఆధునికీకరణకు సంబంధించి పనులు పూర్తిస్థాయిలో నిలిచాయి. ఈ నేపథ్యంలో కొన్ని చోట్ల కాలువ కరకట్టలు బలహీనంగా ఉండి వర్షాలకు కాలువలో వరద నీరు ఉధృతంగా పారితే కట్టలకు గండ్లు పడే ప్రమాదంఉందని ఆందోళన చెందుతున్నారు. గతంలో 72 చోట్ల కొమ్మమూరు కాలువకు గండ్లు పడ్డాయి. ఆ సమయంలో రైతులు ఇబ్బందిపడకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకునేందుకు అధికారులు నీటిసంఘాల ప్రతినిధులు ఎంతో కష్టపడ్డారు. ఆ తరువాత ఆ స్థాయిలో తుఫాను ప్రభావం లేకపోవడంతో ఇప్పటి వరకు నష్టం జరగలేదు. అయితే ఈ ఏడాది వరుస అల్పపీడనాలతో వాతావరణ పరిస్థితి మారి వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. ఒక వేళ తుఫాన్ల తాకిడికి వరద ఉధృతి పెరిగితే ఎలాంటి పరిస్థితులు ఉంటాయోనని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. దీన్నిదృష్టిలో ఉంచుకుని అధికారులు ముందు జాగ్రత్త చర్యగా కరకట్టలు బలహీనంగా ఉన్న చోట మరమ్మతులు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఏపుగా పెరిగిన నారు మడి



చీరాల, కారంచేడు మధ్య నాట్లు వేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ పిల్లలకు ఆధార్‌కార్డులు

నేటి నుంచి వివరాల సేకరణ ● బోగస్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు

జిల్లాలో 25 వేల మంది చిన్నారుల వేలిముద్రలు, ఐరిష్‌ల సేకరణ

ఒంగోలు నగరం: అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు కూడా ఇక నుంచి ఆధార్ కార్డులు అందుబాటులోకి ఇప్పటి వరకు ఆధార్ కార్డులు లేని వారికి ప్రభుత్వం అందజేయనుంది. కేంద్ర ప్రభుత్వం దేశంలోని అందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇచ్చేందుకు ఆధార్ వివరాలను సేకరించింది. వాటి ప్రకారం ప్రతి ఒక్కరికి 12 నంబర్లు కలిగిన విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించింది. ఈ నంబర్‌తో వారి అడ్రస్‌ను ముద్రించి ప్రతి ఒక్కరికీ ఆధార్‌కార్డును అందజేసింది. అయితే ఇప్పటి వరకు దేశంలో ఐదేళ్లు నిండిన వారికి మాత్రమే ప్రభుత్వం ఆధార్ వివరాలను సేకరించి కార్డులను పంపిణీ చేసింది. ఐదేళ్లలోపు వారికి మాత్రం ఇప్పటి వరకు ఆధార్ వివరాలు సేకరించలేదు. ఇక నుంచి ఐదేళ్లలోపు వారికి కూడా ఈ వివరాలను సేకరించి కార్డులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆధార్ వివరాల సేకరణ కార్యక్రమాన్ని జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. ముందుగా 0-5 పిల్లలు ఎక్కువగా ఉండే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ అధికారులు సోమవారం ఈ కార్యక్రమాన్ని ఒంగోలు నగరం రామ్‌నగర్ 10వ లైనులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ప్రారంభించనున్నారు. ఆధార్ వివరాల కోసం చిన్నారుల నుంచి వేలిముద్రలు, కంటి పాపల ఫొటోలను ఐరిష్ మిషన్ ద్వారా సేకరించనున్నారు.

ఈ వివరాల ప్రకారం త్వరలోనే వీరికి కూడా ఆధార్ కార్డులు అందుబాటులోకి రానున్నారు. జిల్లాలో ఉన్న 21 ఐసీ డీఎస్ ప్రాజెక్టుల్లో 0-5 సంవత్సరాల పిల్లలు మొత్తం 25 వేల మంది ఉన్నారు. వీరందరి నుంచి ఆధార్ వివరాలను సేకరించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టనున్నారు.

దోస ధరలు ఢమాల్ !

- గత నెలలో టిక్కీ రూ.1000.. ఈ నెలలో రూ.100
- కూలి ఖర్చులు కూడా రాని వైనం
- రైతుల లబోదిబో



హైదరాబాద్ తరలించేందుకు సిద్ధంగా ఉన్న దోసకాయల టిక్కీలు



బల్లికురవలో ధరలు లేక పారబోసిన దోసకాయలు

బల్లికురవ: దోసకాయ ధరలు ధరలు ఒక్కసారిగా దిగాజారాయి. నిన్నటి వరకు మంట మండిన ధరలు ఇప్పుడు తగ్గడంతో దోసకాయల రైతులు ధరలు కుదేలయ్యారు. బల్లికురవ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సాగు కంది మాగాణి భూముల్లో కంది పంటలో అంతర్ పంటగా దోససాగు చేపట్టారు. ఎక్కువమంది రైతులు దోస సాగు చేపట్టడంతో ధరలు కూడా దిగజారాయి. గత నెలలో 50 కేజిల టిక్కీ దోసకాయలు రూ.1000 పలుకగా ఈ నెలలో అదే టిక్కీ రూ.100లకు కూడా అమ్మడం లేదని రైతులు వాపోతున్నారు. ధరలు తగ్గడంతో కోత కూలి కూడా రావడం లేదని వారు లబోదిబోమంటున్నారు. కొందరు రైతులు పండి పోయిన కాయలను కోసి పారబోస్తుండగా కొందరు హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. హైదరాబాద్ మార్కెట్‌లో కూడా టిక్కీ దోసకాయలు రూ.150లకు మించి పలకడం లేదని, ఖర్చులు కూడా అధికంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

దోస ధరలతో పాటు బెండ, వంగ, సొరకాయల ధరలు కూడా తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుండ్లకమ్మ నదిలో కొనసాగిన వరద ప్రవాహం

- జాలర్లకు చేపల పంట

అద్దంకి: గుండ్లకమ్మ నదిలో రెండో రోజు ఆదివారం కూడా వరద ప్రవాహం కొంతమేర కొనసాగింది. శనివారం ఉధృతంగా ప్రవహించినప్పటికి ఆదివారం ఉదయానికి సగానికి తగ్గిపోయింది. నదిలో వర్షపు నీటి ప్రవాహంతో గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీటి నిల్వ పెరిగింది. రిజర్వాయర్ నీరు మణికేశ్వరం సమీపం వరకు నిలిచింది. కాగా వర్షపునీరు గుండ్లకమ్మ నదిలో గుండా రిజర్వాయర్‌లోకి చేరడంతో చేపలు నీటికి ఎదురీదుతూ వస్తున్నాయి. దీంతో నది ప్రవాహం వెంబడి జాలర్లు పెద్దఎత్తున చేపల వేట సాగిస్తున్నారు. ఇప్పటి వరకు అద్దంకి ప్రాంతంలో చేపలు అందుబాటులో లేక జాలర్లు వేట సాగించడం లేదు. ప్రస్తుతం చేపల వేట ప్రారంభం కావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గుండ్లకమ్మ నదిలో ప్రవాహం ఉండటంతో గణేష్ విగ్రహాల నిమజ్జనాలకు కూడా ఇబ్బందులు లేకుండా పోయాయి. అదే సమయంలో అద్దంకి పట్టణానికి కూడా మంచినీటి ఇక్కట్లు కూడా తొలగిపోయాయి.





గుండ్లకమ్మ నదిలో ప్రవహిస్తున్న వరద నీరు, అద్దంకి సమీపంలో చేపల వేట సాగిస్తున్న జాలర్లు

ఉపరాష్ట్రపతికి ఎమ్మెల్సీ మాగుంట సత్కారం

భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును ఆదివారం ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఘనంగా సత్కరించారు. చెన్నయ్‌లోని రాజ్‌భవన్‌లో బాలాజీ గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ మాగుంట సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఉపరాష్ట్రపతిని కలిసి బొకే ఇచ్చి అభినందించారు.

- ఒంగోలు కలెక్టరేట్



దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్త్రతులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్నేహితులే షన్ల లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.



మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.



సింహరాశి: (జూలై24-ఆగస్టు23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.



కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

త్వరితగతిన పార్శిల్ సర్వీసులు చేర్చాలి

- **ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఆదాం సాహెబ్**
- **ఇక నుంచి ఏఎన్ఎల్ సర్వీసులు సంస్థ నిర్వహణ**

ఒంగోలు వ్యవసాయం: వినియోగదారులకు తక్కువ ధరకు, తక్కువ సమయంలో, సురక్షితంగా వస్తువులను, కవర్లను అందజేసేందుకు ఆర్టీసి పార్శిల్ సర్వీసును ప్రారంభించిందని రీజనల్ మేనేజర్ కె.ఆదాం సాహెబ్ తెలిపారు. స్థానిక ఆర్టీసి బస్టాండ్ ఆవరణలోని ఏఎన్ఎల్ పార్శిల్ సర్వీసు పాయింట్ వద్ద అధికారులు, సిబ్బంది, హమాలీలతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఆర్టీసీ డిపోల ద్వారా నడుస్తున్న ఏఎన్ఎల్ సర్వీసుకు అగ్రిమెంట్ ఈ నెల 26వ తేదీతో ముగిసిందని ఆయన పేర్కొన్నారు. ఇకనుంచి ఆ సేవలనన్నింటినీ ఆర్టీసి చేపడుతుందన్నారు. ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది జూన్ నెలల్లో లాజిస్టిక్ బిజినెస్‌ను ప్రారంభించిందన్నారు. ఈ సర్వీసుద్వారా వినియోగదారులు ఇచ్చిన కవర్లు, లగేజిలను చేరాల్సిన గమ్యస్థానాలకు అదే రోజుగానీ, లేదా గరిష్ఠంగా 24గంటల్లోగా ఆర్టీసీ అందజేస్తుందన్నారు. పార్శిల్ సర్వీసులో కీలకపాత్ర సిబ్బందిదేనన్నారు. ఎక్కడ నుంచి ఎక్కడకు కవర్ వచ్చిన తిరస్కరించకుండా తీసుకుని, ఆయా డిపోల్లో చేర్చాల్సిన బాధ్యత సిబ్బంది పైనే ఉందన్నారు. అన్ని మండల కేంద్రాల్లోని ఆర్టీసి బస్టాండ్లతో పాటుగా ప్రధాన కేంద్రాలకు కూడా కవర్లు, పార్శిల్స్ తీసుకుని వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని పిలుపునిచ్చారు. తద్వారా ఆర్టీసికి ప్రజలకు సేవలందించడంతో పాటుగా, ఆదాయం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వినియోగదారులు ఆర్టీసి పార్శిల్ సర్వీసు ద్వారా పంపించే వస్తువులకు బీమా సౌకర్యం ఉందన్నారు. అంతేగాక త్వరలో ట్రాన్స్‌పోర్టు విధానాన్ని ఆన్‌లైన్ చేసి ట్రాకింగ్ పద్ధతిని ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిపో మేనేజర్ మారెళ్ల శ్రీనివాసరావు, ఏటిఎం కమర్షియల్ బి.శ్రీమన్నారాయణ, పర్సనల్ ఆఫీసరు సుధాకరన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్, వేదికపై నూర్‌బాషా సంఘం నాయకులు

సమాజంలో సమానత్వం రావాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి

- **ఎమ్మెల్యే రవికుమార్**

అద్దంకి: సమాజంలో సమానత్వం రావాలంటే ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల బిసి ముస్లిం సంక్షేమ సంఘం అద్దంకి నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాత తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న షాదీఖానాలో నూర్‌బాషా ప్రతిభ ప్రోత్సాహక అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్ డిఆర్‌వో నూర్‌బాషా ఖాశిం అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఎంత కష్టపడి అయినా తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలన్నారు. నూర్‌బాషాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అద్దంకిలో నూర్ బాషాల కమ్యూనిటి భవనం నిర్మాణం, స్థలం కేటాయింపునకు కృషి చేస్తామన్నారు. మూడు సార్లు తన గెలుపునకు నూర్ బాషాలు అందించిన సహకారం జీవితాంతం మరువలేనిది అన్నారు. రాష్ట్ర నూర బాషా సంఘం అధ్యక్షులు, ఏపి పోలీసు హౌసింగ్ బోర్డు ఛైర్మన్ కె.నాగూల్ మీరా మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు దూదేకుల ముస్లింలకు రాజకీయాలలో అవకాశాలు కల్పించాలన్నారు. రాజకీయంగా ప్రాతినిధ్యం లభించినప్పుడే దూదేకుల అభివృద్ధి సాధ్యమన్నారు. దూదేకుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. చట్ట సభలలో నాలుగు శాతం రిజర్వేషన్ సాధించేవరకు పోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్య క్రమంలో రిటైర్డ్ డిఆర్‌వో నాగూర్ మీరా, రాష్ట్ర నూర బాషా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పీర్ మహ్మద్, షేక్ సుభాని, బాబులాల్, నాగూర్‌బాబు, జిల్లా శాఖ గౌరవాధ్యక్షులు షేక్ మీరా మొహిద్దీన్, జిల్లా అధ్యక్షులు మస్తాన్‌వలి, ఖాశిం సాహెబ్, షేక్ మీరావలి, షేక్ మా బాషా, మట్టిపీటి బాషా, కరి పరమేష్, సందిరెడ్డి రమేష్, షేక్ సైదులు, షేక్ ఖాశిం, పి.బాషా, షేక్ మస్తాన్‌వలి, షేక్ లాల్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ

ఒంగోలు కల్చరల్: బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో గాయత్రి విద్యా పథకం కింద పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకారవేతన పంపిణీ కార్యక్రమం ఆదివారం ఉదయం సమితి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా 79 మంది విద్యార్థులకు రూ.1,10,000 ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. చదువుకు పేదరికం అడ్డంకాకూడదని ఆర్థికంగా సహాయపడాలనే ఉద్దేశంతో ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు సి.వి.యల్.సుబ్రహ్మణ్యం, దేనువకొండ వెంకట సుబ్బారావులు తెలియజేశారు. ఈ సందర్భంగా చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున సమితి ఉపాధ్యక్షుడు యం.వి.కృపాసాగర్, మద్దులూరి హరిప్రేమ్‌నాథ్, గంజాం శ్రీరంగనాథ్‌లు అందజేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మునిపల్లె వెంకట సాయిచైతన్య గాయత్రి విద్యా పథకానికి 10వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు శనగవరపు శివకుమార్, సముద్రాల భీమశంకరశాస్త్రి, చుండి బాలాజి, లక్కరాజు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వదిలివెళ్లిన శిశువుకు రిమ్స్‌లో చికిత్స

ఒంగోలు నగరం: మార్కాపురం ఆసుపత్రిలో తల్లి వదిలి వెళ్ళిన శిశువును ఐసీడీఎస్ అధికారులు ఒంగోలు రిమ్స్‌లో చేర్చి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. పుట్టిన వెంటనే తల్లి బిడ్డను వదిలి వెళ్లింది. రిమ్స్ వైద్యులు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీదుర్గ ఆదివారం శిశువు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

మానవతా వాదాన్ని నిర్మాణాత్మకంగా అమలు చేయాలి

మానవతావాది బాబు గోగినేని

చీరాలఅర్బన్ : భారతరాజ్యాంగంలోని ప్రధాన అంశాలలో ఒక టైన మానవతావాదాన్ని ప్రభుత్వాలు నిర్మాణాత్మకంగా అమలు చేయాలని ప్రముఖ మానవతావాది బాబు గోగినేని అన్నారు. బాబుగోగినేని ఫేస్‌బుక్‌గ్రూప్, ఇండియన్ హ్యూమనిస్టులు సంయుక్తంగా కల్సి కొత్తపేట వివేకావిద్యాలయంలోని ఎం.ఎస్. రాయ్‌హాల్‌లో నిర్వహించిన మూడురోజుల శిక్షణా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ముగింపురోజు బాబుగోగినేని మాట్లాడుతూ మనిషికోసం చేసుకున్న వాదం మానవతావాదమన్నారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాల విష వలయంలో చిక్కుకున్న సమాజాన్ని, కాపాడే సత్తా యువతకు మాత్రమే ఉందన్నారు. ఫెడరేషన్‌ఆఫ్ ఇండియన్ రేషనలిస్ట్ అసోసియేషన్ (అఖిలభారత హేతువాదసంఘాల సమాఖ్య)అధ్యక్షులు ప్రొఫెసర్ నరేంద్రనాయక్ మాట్లాడుతూ శాస్త్రీయ వైద్యవిధానం కాని హోమియోపతి వంటి సూడోసైన్స్‌ని కేంద్రమంత్రిత్వశాఖ ప్రోత్సహించడం తప్పన్నారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రజల్లో మూఢవిశ్వాసాలను అడ్డం పెట్టుకుని మోసగిస్తో, దొంగబాబాలు, గురువుల ఆటకట్టించాలంటే మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ తూర్పుగోదావరిజిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ సోషల్‌మీడియా భావోద్వేగాల్ని నియంత్రించుకుని ఉపయోకరమైన చర్చ చేయటంలో తోడ్పడుతుందన్నారు. హెల్త్‌కేర్ ఇండస్ట్రీ నిపుణులు విశ్వనాథ్‌జయంతి మాట్లాడుతూ విద్య, వైద్యం ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. సాఫ్ట్‌వేర్ నిపుణుడు శరత్ తేజసోమిన మాట్లాడుతూ ప్రఖ్యాతశాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐనస్టీన్ గురించి ఎన్నో అబద్ధాలు సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేయటం సరికాదన్నారు. కార్యక్రమంలో యుఎస్ఏతో పాటు పలురాష్ట్రాల, వివిధ రంగాల ప్రముఖులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబు గోగినేని

పోస్టర్ ఆవిష్కరణ

మార్కాపురం : కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సెప్టెంబరు 8, 9 తేదీల్లో రగ్‌పూర్ ఐఐటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వర్క్‌షాపునకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాపులో మొదటి రోజు ప్రతినిధుల చర్చలు, రెండవ రోజు పరీక్ష ఉంటుందన్నారు. ప్రతిభ కనబరచిన వారు ఖరగ్‌పూర్‌లో నిర్వహించే వర్క్‌షాపులో పాల్గొంటారని, మెకానికల్ విభాగాధిపతి కె.శ్రీనివాస్ తెలిపారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



దర్శనమిస్తున్న పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణ శివారులో గల శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారి మూల విరాట్‌ను వివిధ పూలమాలలు, నిమ్మకాయల దండలతో శక్తి స్వరూపిణిగా తీర్చిదిద్దారు. డివిజన్‌లోని అనేక గ్రామాలు, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. కుంకుమ బండ్లు కట్టి బొల్లావులు ఊరేగించారు. నాగదేవతలకు పూజలు చేసి, పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

అధిక పరీక్ష ఫీజుల వసూళ్లపై
చర్యలు తీసుకోవాలి

మార్కాపురం : డిగ్రీ విద్యార్థులకు అక్టోబరు 4 నుంచి జరగబోయే సెమిష్టర్ పరీక్షలకు ప్రైవేటు, ఎయిడెడ్, ప్రభుత్వ కళాశాలల యాజమాన్యాలు అధికంగా ఫీజులు వసూళు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. డిగ్రీ కోర్సులో సెమిష్టర్‌కు రూ. 510, ప్రాక్టికల్స్‌కు అదనంగా ఒక్కొక్క సబ్జెక్ట్‌కు రూ. 60 నాగార్జున యూనివర్శిటీ అధికారులు నిర్ణయించారన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు రూ. 1500 రూ. 2 వేలు, ఎయిడెడ్, ప్రభుత్వ కళాశాలలు రూ. 550 నుంచి రూ. 700 వరకు అక్రమంగా వసూళ్లు చేస్తున్నారన్నారు. దీనిపై యూనివర్శిటీ అధికారులు స్పందించి కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి సంఘాల తరుపున న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా నిమజ్జనోత్సవాలు

- పలు చోట్ల ప్రత్యేక పూజలు, అన్నదానాలు, తీర్థప్రసాదాల పంపిణీ
- బందోబస్తు నిర్వహించిన పోలీసులు

మార్కాపురం : పట్టణంలోని జవహర్ నగర్ కాలనీ సాయి నగర్ సమీపంలోని శ్రీ షిర్డి సాయి సత్సంగ మందిరంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఆదివారం మందిర వ్యవస్థాపకులు ఆర్. రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తర్లుపాడు : తర్లుపాడులో ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో



పొదిలిలో విగ్రహాన్ని నిమజ్జనానికి తరిలిస్తున్న దృశ్యం

ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. రచ్చబండ వద్ద యాదవ్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణ చేశారు. విగ్రహాల వద్ద వివిధ సాంస్కృతిక, భజన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు..

నాయుడుపల్లి, రజక వీధిలో ఏర్పాటు చేసిన వినాయక



మార్కాపురంలో నిమజ్జనానికి బయలుదేరిన గణనాథులు

విగ్రహాలను మూడవ రోజు నిమజ్జనానికి తరలించారు. విగ్రహాల వద్ద పూజలు నిర్వహించి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. యువకులు జై గణేష్ మహరాజ్ అంటూ గులాములు చల్లుకొని నృత్యాలు చేశారు. భక్తులు వార్లు పోసి కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతరం పెద్దారవీడు మండలం గొబ్బూరు చెరువులో నిమజ్జనం చేశారు.

పొదిలి : పట్టణంతో పాటు పలు గ్రామాలకు చెందిన విగ్రహాలను మేళతాళాలు, డప్పులతో గ్రామోత్సవం నిర్వహించారు. యువకులు జై గణేష్ అంటూ నినాదాలు చేస్తూ గులాములు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్ సుబ్బారావు భారీ బందోబస్తు నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని పలు మండపాల్లో పూజలు అందుకున్న గణనాథులకు ఆదివారం వైభవంగా నిమ



కరెన్సీ నోట్ల అలంకరణ మధ్య విఘ్నేశ్వరుడు

జ్జనోత్సవాలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, తీన్‌మార్ తప్పెట్లకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ తరలి వెళ్లారు. రంగులు చల్లుకుంటూ ఉత్సాహభరిత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మార్కాపురం చెరువులో నీరు లేకపోవడంతో పెద్దారవీడు మండలం గొబ్బూరు చెరువులో నిమజ్జనం చేశారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా వక్కలగడ్డ



ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం

మార్కాపురం : పట్టణ ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం అట్టహాసంగా జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా వక్కలగడ్డ మల్లికార్జునరావు, పాదర్తి వెంకట నారాయణ, కోశాధికారిగా బొంతల సుధీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయుడు వీధి నుంచి ఆర్యవైశ్యులు, పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి (అమ్మవారిశాల) ఆలయం వద్దకు చేరుకున్నారు. వీరిని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం, ఏఎంసీ మాజీ చైర్మన్ డివి కృష్ణారెడ్డి, పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. అమ్మవారి శాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వక్కలగడ్డ మల్లికార్జున్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేయడంతోపాటు, సంఘ అభివృద్ధి, ప్రతిష్ఠతకు పాటు పడదామన్నారు.

ఆర్టీసీ పార్శల్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం : ఆర్టీసీ పార్శల్, కొరియర్ సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డీఎం నరసింహులు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్శల్ సర్వీస్‌ను ఆదివారం ఎస్సై బి.శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ గతంలో ఎన్ఎల్ పార్శిల్ సర్వీస్ ద్వారా సేవలు అందించేవారని, ప్రస్తుతంది దాని స్థానంలో ఆర్టీసీ పార్శిల్, కొరియర్ సర్వీస్‌లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై నాయక్, కార్గో పార్శిల్ సర్వీస్ సమన్వయకర్తలు శ్రీనివాసులు, రామిరెడ్డి పాల్గొన్నారు.

కుంభకోణాలే బీఎస్ఎన్ఎల్ నష్టాలకు కారణం

మార్కాపురం : బీఎస్ఎన్ఎల్ సంస్థ వరుస నష్టాలకు గురి కావటానికి స్పెక్ట్రమ్ కుంభకోణాలే కారణమని ఎంప్లాయిస్ యూనియన్ ఏపీ సర్కిల్ కార్యదర్శి పి.అశోక్ బాబు అన్నారు. స్థానిక కొండేపల్లి రోడ్డులోని వెంకటేశ్వర కల్యాణమండపంలో బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ 6వ జిల్లా మహాసభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు జి. నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా అశోక్‌బాబు పాల్గొని ప్రసంగించారు. బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనే కుంభకోణాలు అధికంగా జరగటంతో పెద్ద ఎత్తున నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. సంస్థను కార్పొరేట్ కంపెనీలకు కట్ట బెట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి జె.నమ్రతరావు, బీఎన్ఎల్ జనరల్ మేనేజర్ చంద్రసేన, సర్కిల్ అధ్యక్షుడు కె.ప్రభాకరరావు, సర్కిల్ కోఆర్డినేటర్ ఎం.యాసిన్, గుంటూరు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి

- డీఎస్పీ రామాంజనేయులు

మార్కాపురం : గ్రామీణ వైద్యు లు ప్రజలకు సీజనల్ వ్యాధుల ని వారణపై అవగాహన కల్పించి, రోగాల బారిన పడకుండా చూడాలని డీఎస్పీ ఎన్‌వీ రామాంజనేయు లు అన్నారు. స్థానిక మెడికల్ అ సోసియేషన్ హాల్‌లో ఆదివారం పీఎంపీ అసోసియేషన్ 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రా ష్ట్ర పీఎంపీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అధ్యక్షత వహించగా డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీబీటీ రాజు మాట్లాడుతూ పీఎంపీలను చట్టభద్రత చేస్తూ జీవో విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసులుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎన్.జయసూర్య, సీనియర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, డివిజన్‌లోని పీఎంపీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

మార్కాపురం : మండలంలో ని జమ్మనపల్లికి చెందిన 10 వైసీ పీ కుటుంబాలు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివా సం వద్ద టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా కందుల మాట్లాడు తూ టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికీ అందేలా కృషి చేస్తున్నామన్నారు. పార్టీ విధివి ధానాలకు ఆకర్షితులై ఇతర పార్టీ నాయకులు చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో జమ్మనపల్లి ఉపసర్పంచ్ మేకల ఏసు, మాజీ సర్పంచ్ మోషె, నాగరాజు తదితరులు ఉన్నారు.

వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు

మార్కాపురం టౌన్ : ఉద్యోగాలు ఇప్పిస్తామని తమ కార్యాలయంలో వసూళ్లకు పాల్పడిన వారిపై తప్పక చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట మురళి అన్నారు. ఐ టీడీఏలో పోస్టుల అమ్మకం శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. కార్యాలయంలో వసూలు చేసిన వ్యక్తిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఉ పేక్షిం చమన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

మార్కాపురం టౌన్ : తనపై దాడిచేసి కులంపేరుతో దూషించినట్లు యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ఆదివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం దరిమడుగు గ్రామానికి చెందిన కలవకుంట్ల కమలకుమారి, తర్లుపాడుకు చెందిన కాశయ్య పట్టణంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తున్నారు. కాశయ్య తనపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు, తరచుగా వేధిస్తున్నట్లు కొద్దిరోజుల క్రితం కమలకుమారి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో హాస్పటల్ యాజమాన్యం కాశయ్యను ఉద్యోగం నుంచి తప్పించారు. తన ఉద్యోగం పోవడానికి కారణం కమలకుమారి అంటూ శనివారం రాత్రి దాడిచేసి కులంపేరుతో దూషించనట్టు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సినిమాలు

మార్కాపురం

జగదీశ్వరీ	- జయజానకి నాయక
విజయా	- ఫిదా
శ్రీనివాస	- నేనేరాజు నేనే మంత్రి
రాధాకృష్ణ	- ఆనందోబ్రహ్మ
సాయిబాలాజి	- వివేకం
విశ్వేశ్వర	- అర్జున్‌రెడ్డి

పొదిలి

వెంకటేశ్వర	- లై
హరికృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
రాఘవేంద్ర	- జయ జానకి నాయక



వర్షాలతో పెరిగిన కంది పైరు

కళకళలాడుతున్న పైర్లు

కనిగిరి : వర్షాలు విరివిగా కురవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, సజ్జ, పెసర పైర్లు కళకళలాడుతున్నాయి. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కంది 44 వేల హెక్టార్లలో సాగు చేయగా, కనిగిరి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 11 వేల హెక్టార్లలో సాగుచేశారు. జూన్ చివరి వారం నుండి ఆగస్టు మొదటి వారం వరకు రైతులు కంది సాగు చేస్తుంటారు. గత వారం నుంచి వర్షాలు కురవడంతో కంది పైరు ఏపుగా పెరి గింది. సజ్జ 5 వేల హెక్టార్లలో సాగు చేయగా, ప్రస్తుతం కంకి దశలో ఉంది. వర్షాలతో కంది దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు. పెట్టుబడి లేకపోవడంతో మరో 8 వేల హెక్టార్ల భూమి సాగుకు నోచుకోలేదని రైతులు అంటున్నారు.

అంకిత భావం ఉంటే ప్రత్యేక గుర్తింపు



మోహనరెడ్డిని సన్మానిస్తున్న అతిథులు

కనిగిరి : అంకితభావంతో పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని సర్వశిక్షాభియాన్ సీఎంవో రాజాల కొండారెడ్డి అన్నారు. బోటికర్లపాడు పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డిని గ్రామస్థులు ఆదివారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం అసోసియేషన్ నాయకులు డీ. రామిరెడ్డి, పాతపాడు, గురువాజీపేట హెచ్ఎంలు శ్రీనివాసచారి, మధుసూదన్, జెవీవీ నాయకులు గయాజ్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

సీఎస్‌పురం(పామూరు) సీఎస్‌పురంలో ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. షేక్ షరీఫ్, సంగిశెట్టి శ్రీను స్థానిక పెట్రోల్ బంకు నుంచి సీఎస్‌పురానికి వెళ్తుండగా, పామూరు మండలం తూర్పుకోడిగుడ్లపాడుకు చెందిన డీ. ఏడుకొండలు సీఎస్‌పురం నుంచి పామూరుకు వస్తుండగా అయప్పస్వామి గుడి వద్ద ఆ రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అరివేములకు చెందిన షరీఫ్, సంగిశెట్టి శ్రీనుకు గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏడుకొండలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

సీఎస్‌పురం(పామూరు) : అయ్యలూరివారి పల్లికి చెందిన పీ కుమారి(27) ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శరీరంపై కిరోసిన్ పోసుకొని అఘాయిత్యానికి ప్రయత్నించింది. భర్త వెంకటేశ్వర్లు అవమానించారన్న ఉద్దేశంతో ఆమె ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. 80 శాతం వరకూ శరీరం కాలిపోయింది.

నిమజ్జనోత్సవాలు



కనిగిరిలో వినాయక విగ్రహాల ఊరేగింపు



దూబగుంట వినాయక విగ్రహానికి పూజలు

కనిగిరి : గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 100 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయగా, నియోజకవర్గంలో వెయ్యి విగ్రహాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో సాయిబాబా గుడివీధి సెంటర్, నార్లపాటివారివీధి, బొడ్డుచావిడివీధి, జీపుసెంటర్, కూడిపూడిపల్లి వడ్డేర బజార్‌లో, ఎన్జీవో కాలనీ, శివనగర్ కాలనీ, కొత్తపేట, జవహర్‌లాల్ వీధి హనుమాన్ భజనసంఘం, పాతవూరు, బొడ్డచావడి వీధి, సుదర్శిన థియేటర్ సెంటర్, శంఖవరం, చింతలపాలెం, గార్లపేటరోడ్డు, మాచవరం వివిధ శివారు కాలనీల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. విగ్రహాల వద్ద యువకులు ఉట్టికొట్టే కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం విగ్రహా లను ఊరేగించారు. విగ్రహాలను నాగులచెరువు, ఈదరవాగు, కేటీఆర్ టెక్నోస్కూలు వెనుక వాగులోను నిమజ్జనం చేశారు. కనిగిరి సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ ఉప్పు శ్రీనివాసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పామూరు : వినాయక చవితి సందర్భంగా వినాయక భక్తులకు ఆదివారం అన్నదానం చేశారు. దూబగుంట, ఇనిమెర్ల, బోడవాడ, సట్టుమడుగు, నర్రమారెళ్ళ, ఎల్ఎన్ పురం, కోడిగుంపల, రావిగుంటపల్లి, పొతవరం, తిరగలదిన్నెలో ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు తప్పెడగుల్లు, విచిత్ర వేషధారణలతో విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. అనంతరం మండపాల వద్ద అన్నదానం చేశారు. పట్టణంలో ఎన్జీవోకాలనీ, రవికళామందిర్ సెంటర్, పేటవీధి, తూర్పువీధి, వడ్డేపాలెం ప్రాంతాల్లో భోజన వసతి ఏర్పాటు చేశారు.

దొనకొండ : వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వే కాలనీలో రాములవారి దేవాలయం, భూమనపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల నడమ వాటిని ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

తాళ్లూరులో...

తాళ్లూరు : వినాయక నిమజ్జనోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొద్ది కూరపాడు 2, మాధవరం, శివరాంపురం, తురకపాలెం,వెలుగువారిపాలెం, సోమవరప్పాడు, రామభద్రాపురంలో ఈ కార్యక్రమాలను చేపట్టారు. మూడు రోజులుగా విగ్రహాలకు పూజలు జరిపి అనంతరం వీధుల్లో ఊరేగించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ వి మహేష్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



దొనకొండలో పూజలు చేస్తున్న భక్తులు



తాళ్లూరు పారువేట వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



25 కిలోల లడ్డూను దక్కించుకున్న భక్తుడు

వినాయక లడ్డూ రూ.1.55 లక్షలు

కనిగిరి : వినాయక చవితి పూజలు చాలా దగ్గర పూర్తి కావడంతో వినాయక మండపాలు వద్ద ఏర్పాటు చేసిన లడ్డూలకు నిర్వాహక కమిటీలు వేలం పాటలు నిర్వహించాయి. కొత్తపేటలో ఆదివారం నిర్వహించిన వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నేతాజీ బుక్‌స్టాల్ యజమాని ముక్కు తిరుపతిరెడ్డి 25 కిలోల వినాయక లడ్డూను రూ 1,55,116లకు దక్కించుకున్నారు. స్థానిక కొత్తపల్లిలో ఆర్ వెంకటేశర్లు, మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద కృష్ణ వినాయక లడ్డూను రూ 30 వేలకు సొంతం చేసుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాల వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గార్లపేట రోడ్డులో తినుబండారాల వ్యాపారి కె వెంకట రమేష్ రూ 20,116లకు వినాయక లడ్డూను దక్కించుకున్నారు. ఎన్జీవో కాలనీ, ఇందిరా కాలనీ, పీతవూరు, కొత్తపేట, ఎమ్మార్సీసర్ రోడ్, గార్లపేట రోడ్ తదితర ప్రాంతాల్లో వినాయక లడ్డూ వేలం పాటల్లో రూ 5 వేల నుంచి 20 వేల మంది భక్తులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలకు చైర్మన్ పూజలు

కనిగిరి టౌన్ : సాయిబాబా హాల్ వద్ద, ఇందిరాకాలనీలోని రహీం ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు నగర పంచాయతీ చైర్మన్ షేక్ చినమస్తాన్ దంపతులు ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా చోట్ల నిర్వాహకులు అన్నదానం చేశారు. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు కౌన్సిలర్ దిల్‌షాద్‌బేగం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, కటకం లక్ష్మీ నరసింహం, డిష్ వేణు, ముత్యాల ప్రతాప్, ఇందిరాకాలనీలో పోలిచర్ల రహీం, కౌన్సిలర్ దిల్‌షాద్‌బేగం, కోఅప్షన్ పీర్ల మస్తాన్, కృష్ణా, పీ. వెంకటయ్య, బాలు, రసూల్, గౌస్, రాము తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద స్వామివారి లడ్డునూ డాక్టర్ సుబ్బారెడ్డి వేలంలో రూ. 3500లకు గెలుచుకున్నారు.



ముగ్గుల పోటీ విజేతకు బహుమతి ప్రదానం

నారాయణస్వామి ఆలయంలో పూజలు

కోవిలంపాడు(పామూరు) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసినట్టు ఈవో కెపీవీ ప్రసాద్ తెలిపారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, మహానివేదన, విశేషపూజలు, రథ, పంచ, కుంభ, హరతులు తదితర వాటిని చేపట్టారు. మహిళలు పొంగళ్ళు పెట్టుకొని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.వివిధ ప్రాంతాల భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. నారాయణస్వామి వారి మూలవిరాట్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నారాయణస్వామి వారిని, శ్రీదేవి, భూ దేవి సమేత శ్రీ విష్ణుమూర్తి స్వామివార్ల పల్లకి సేవ,రథోత్సవం జరిగింది. మేళతాళాలు, గోవిందనామస్మరణముల మధ్య వైభవంగా స్వామివారి పల్లకిసేవ నిర్వహించారు. నారాయణస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా ఆలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా దేవస్థానం ఈవో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మహా నివేదనతో వస్తున్న ఈవో కేపీవీ ప్రసాద్

చీరల పంపిణీ

హనుమంతునిపాడు : వీరరామాపురంలో వితంతువులకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. మదర్ థెరిస్సా 107వ జయంతి సందర్భంగా గోనా సుదర్శనం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ కనమర్లపూడి వెంకట నారాయణ, గ్రామపెద్దలు అలా సుబ్బరాయుడు, ఉప్పుటూరి శ్రీను, జీ. పెద కాశయ్య, చినగురవయ్య, షేక్ సిద్దయ్య, కె. శ్యాముల్, గోనా ప్రభాకర్, చిరంజీవులు, చిన నాగయ్య, నాగయ్య, నాసర్ మహమ్మద్ పాల్గొన్నారు.

పోలేరమ్మకు పూజలు

మార్కాపురం వన్‌టౌన్ : అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూ జలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నా రు. అర్చకులు అమ్మవారి మూల విరాట్‌ను వివిధ పూలమాలలు, నిమ్మకాయల దండలతో శక్తి స్వరూపిణిగా తీర్చిదిద్దారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

పెద్ద దోర్నాల: మిర్చి రైతుల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు కందుల కాశిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది మిర్చి పండించిన రైతులు అపారంగా నష్టపోయారని, ఫసల్ బీమా చెల్లించినా పరిహారం అందలేదని, వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

31న జాబ్ మేళా

పెద్ద దోర్నాల: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో భ్రమరాంబ మల్లికార్జున డిగ్రీ కళాశాలలో ఈ నెల 31వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ బట్టు రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

పార్టీ నుంచి తొలగించాం

పెద్ద దోర్నాల: పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న సీపీఐ మండల కార్యదర్శిగా పని చేస్తున్న వెంకటేశ్వరాచారి, రైతు సంఘం నాయకులు తిరుపతిరెడ్డిని పార్టీ నుంచి తొలగించామని సీపీఐ నియోజకవర్గ నాయకులు కేవీ కృష్ణ గౌడ్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీకి చెడ్డ పేరు తెచ్చే విధంగా ప్రవర్తిస్తుండటంతో ఈ నెల 24న ఎర్రగొండపాలెంలో తీర్మానం చేశామని ఆయన తెలిపారు. ఆయనతోపాటు సీనియర్ నాయకులు టీసీహెచ్.చెన్నయ్య, రైతుసంఘం నాయకులు తిరుమలయ్య ఉన్నారు.

ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- **హౌసింగ్ ఇంజనీర్ల పర్యవేక్షణ పెరగాలి**
- **ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు**



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డేవిడ్‌రాజు

ఎర్రగొండపాలెం : పేద ప్రజలు సొంత ఇంటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని, ఎన్టీఆర్ గృహకల్ప పథకానికి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసి పేదలకు పక్కా గృహాలు మంజూరు చేశారని ఎమ్మెల్యే పి.డేవిడ్‌రాజు అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ గృహ నిర్మాణ పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డేవిడ్‌రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 2014 నుంచి ఇప్పటి వరకు 3400 ఎన్టీఆర్ గృహాలు మంజూరయ్యాయన్నారు. అధికారుల అశ్రద్ధ, కరువు కారణాలతో నిర్మాణ పనుల్లో జాప్యం చోటుచేసుకుంటుందని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గం మొత్తం మీద 279 గృహాలు నిర్మాణం పూర్తి అయ్యాయని అధికారులు ఇచ్చిన రిపోర్టుతో ఎమ్మెల్యే అసంతృప్తి చెందారు. మంజూరు అయిన 578 గృహాల నిర్మాణం అసలు మార్కింగ్ కూడా ఇవ్వలేదని సమీక్ష సమావేశంలో గుర్తించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలలో పక్కా గృహాలు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగమని ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అక్టోబర్ 15 నాటికి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డీఈకి సూచించారు. సమావేశంలో ఆర్డీవో పెంచలకిశోర్, జడ్పీటీసీ మంత్రునాయక్, ఎంపీపీ వి.ప్రభాకర్, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ రమాదేవి, ఎంపీడీవోలు హనుమంతరావు, మాణిక్యాలరావు, హౌసింగ్ ఏఈ, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, టీడీపీ మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహారావు

మిలియన్ మార్చ్‌లో అందరూ పాల్గొనాలి

త్రిపురాంతకం: సెప్టెంబరు1న విజయవాడలో నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌లో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బీవీ నరసింహారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్ఎస్‌సీ ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలియన్ మార్చ్‌లో ఉపాధ్యాయులు, సంఘ బాధ్యులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగభూషణం రాష్ట్ర కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి శ్యామ్ రాజ్, ఆవుల వెంకటేశ్వర్లు, పద్మనాభరెడ్డి, లక్ష్మణమూర్తి, రామకృష్ణరాజు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. వెంకటేశ్వరరెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన యూటీఎఫ్ 3 మండలాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్‌సీ అరియర్స్-2017 జనవరి డీఏ వెంటనే చెల్లించాలని తెలుగు, హిందీ, పీడీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్యాం రాజు అధ్యక్ష తన జరిగిన సమావేశంలో అధ్యక్షులు జి. రంగ నాయకులు, నాగేశ్వరరావునాయక్, రాజా రావు, నరసింహారావు, నాగభూషణం, నాగయ్య, టి.వీరాచారి, బాబుల్‌నాయక్, ప్రసాదు, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

అటవీ పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

పెద్ద దోర్నాల : నల్లమల అటవీ ప్రాంత పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలని అడిషినల్ ప్రిన్సిపుల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టు ఏకే జాన్ అన్నారు. కర్నూలు నుంచి రాజధాని వెళ్తూ మండల పరిధిలోని రోళ్ళపెంట వద్ద ఉన్న బేస్‌క్యాంప్‌ను ఏపీసీసీఎఫ్ జాన్, ఎఫ్‌డీ శరవణన్ మండల పరిధిలోని రోళ్లపెంట బేస్ క్యాంపును ఆదివారం పరిశీలించారు. అనంతరం దోర్నాలలోని అటవీ శాఖ కార్యాలయంలో రెస్క్యూ టీమ్, డాగ్ స్క్వాడ్, వెపన్ పనితీరును ఆ శాఖ సిబ్బంది ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ నవ్యాంధ్రలో నల్లమల ప్రాంతం ఎంతో ప్రాముఖ్యత ఉందని స్మగ్లర్ల దాడి నుంచి అటవీ ప్రాంతం కాపాడటంలో అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని ఆయన అన్నారు. ఇక్కడి అటవీ శాఖ సిబ్బంది పనితీరును ఆయన మెచ్చుకున్నారు. కార్యక్రమంలో రేంజి అధికారి సుబ్బారావు, డీఆర్వో ప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



రెస్క్యూ పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎర్రగొండపాలెం : ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆదివారం రోడ్డు పక్కగా నడిచివెళ్తున్న గురిజేపల్లి గ్రామవాసి మంచా జయరావును జీపు తగలడంతో మంచా జయరావు ఎడమకాలికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు కుక్క కాటుకు ఇంజక్షన్ వేసుకోవడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఈ సంఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు హెచ్‌సీ సుబ్బయ్య ఆదివారం రాత్రి తెలిపారు. బాధితునికి ఎర్రగొండపాలెం వైద్యశాలలో చికిత్సలు చేయించినట్లు తెలిపారు.

తండా రైతులకు విద్యుత్ కష్టాలు

వ్యవసాయ బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్‌లు, కనెక్షన్లు మంజూరు చేయని అధికారులు

పుల్లలచెరువు : గత పది సంవత్సరాలుగా సాగులో వున్న తమ కప్పలగుంట రెవెన్యూ భూములకు అటవీ శాఖ భూములని నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లకు రెవెన్యూ అధికారులు సంతకాలు పెట్టకుండా ఇబ్బందులకు గురుచేస్తున్నారని తాండా రైతులు ఆరోపించారు. ఆదివారం పుల్లలచెరువులో తమ గోడును వెల్లబోసుకున్నారు. భూముల్లో పంటలు సాగు చేసుకోనేందుకు బోర్లను తవ్వించుకున్నామని, బోర్లకు విద్యుత్ కనెక్షను కోసం దరఖాస్తులు చేశామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు అయినప్పటికీ అవి అటవీ శాఖ భూములని సాకు చూపుతూ వీఆర్వో సంతకాలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాల నుంచి 115 మంది కప్పలగుంట భూములను సాగు చేసుకుంటున్నామని గతంలో కొందరికి రెవెన్యూ పట్టాలు ఇచ్చారని తెలిపారు. గత సంవత్సరం రెవెన్యూ. అటవీ శాఖ సంయుక్తంగా 40 మందికి పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. తమకు రెవెన్యూ ద్వారా పట్టాలు, పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ విద్యుత్ కనెక్షన్లు మంజూరుకు అధికారులు సంతకాలు పెట్టడంలేదని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



రెవెన్యూ హక్కులను చూపుతున్న రైతులు

ఘనంగా గణపతి నిమజ్జనాలు



దోర్నాలలో గణనాథునికి ఊరేగింపు

పెద్ద దోర్నాల : వినాయక చవితి పర్వదిన వేడుకల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాలలోని ప్రజలు గణపతి నిమజ్జన వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. దోర్నాలలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, తిమ్మాపురం శ్రీ సీతారామస్వామి దేవాలయంలో యూత్ కమిటీ ఆధ్వర్యంలో వెలుగొండ టన్నెల్ వద్ద ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలోని కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు నిర్వహించారు. గణపతి ఉత్సవ విగ్రహాలను రథాలపై ప్రతిష్టించి గ్రామోత్సవం గావించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జై గణేష బోలో గణేష్ అంటూ కర్నూలు జిల్లా సంగమేశ్వరం, శ్రీశైలం కృష్ణానదికి భక్తులు అధిక సంఖ్యలో నిమజ్జనం గావించేందుకు తరలి వెళ్ళారు. కార్యక్రమంలో యక్కలి యోగినారాయణ, సీతారామయ్య, నాగెళ్ళ సత్యనారాయణ, బి. రమేష్, రమణయ్య, తిమ్మాపురంలో డి.లక్ష్మయ్య, భాస్కర్, బండారు కాశయ్య, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఆదివారం నిమజ్జనానికి బయలుదేరాయి. ఈ సందర్భంగా మేళతాళాలు, డప్పు శబ్దాలు ఊరేగింపులతో ఆయా గ్రామాలలో ఉత్సవాలు నిర్వహించారు. ఊరేగింపులకు ముందు లడ్డూ వేలంపాటలు నిర్వహించారు. మేడపి గ్రామంలో 3, త్రిపురాంతకం బ్రహ్మంగారి కాలనీలో చిన్నారులు ఏర్పాటు చేసిన గణనాధులతోపాటు పలు గ్రామాలలో విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

కొనసాగుతున్న ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

కావడంతో దానిపై అధికార యంత్రాంగంలో ఎలాంటి కదలికా కన్పించడం లేదు. సహకార శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి కూడా తన సొంత జిల్లాలో ఉండటం వలన ఈ విషయంపై దృష్టి సారించలేదని తెలిసింది. జిల్లాలోని కొందరు టీడీపీ శాసనసభ్యులు మాత్రం మోహన్‌తో మాట్లాడేందుకు ఆదివారం కూడా ప్రయత్నించి విఫలమయ్యారు. మోహన్ అందుబాటులోకి రాకపోవడంతో ఆయన శ్రేయోభిలాషులైన కొందరు వ్యక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సహకార శాఖ కమిషనర్ (ఆర్‌సీఎస్) వేధింపులకు నిరసనగా తాను రాజీనామా చేస్తున్నట్లు మంత్రులు ఆదినారాయణరెడ్డి, శిద్దా రాఘవరావులకు మోహన్ శనివారం లేఖలు పంపిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న తర్వాత బ్యాంకు డైరెక్టర్‌లు, సింగిల్ విండో అధ్యక్షులు ఈ విషయంపై దృష్టి సారించారు. చైర్మన్ మోహన్ నిర్ణయానికి మద్దతుగా ముందడుగు వేయాలని కొందరు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆయన రాజీనామా నిర్ణయాన్ని తొందరపాటు చర్యగా కొందరు భావిస్తున్నప్పటికీ సమర్థవంతమైన పాలనను అందించి బ్యాంకును లాభాల బాట పట్టించినందున మోహన్‌కు మద్దతుగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఆమేరకు సోమవారం కొందరు డైరెక్టర్‌లు సమావేశమవుతున్నట్లు తెలిసింది. ఆర్‌సీఎస్ వేధింపులకు నిరసనగా ఏం చేయాలన్న విషయంపై చర్చించేందుకు ఇటీవల మోహన్ సింగిల్ విండో అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి వంద మందికి పైగా అధ్యక్షులు హాజరయ్యారు. అందులో పరిస్థితులను వివరిస్తూ మోహన్ కన్నీటిపర్యంతం కావడంతో వారంతా ఆవేదనకు గురైన అనంతరం సర్దిచెప్పారు. అయితే అనూహ్యంగా మోహన్ తీసుకున్న నిర్ణయం పట్ల వారు విస్మయానికి గురయ్యారు. తాజా పరిస్థితిపై ఆరా తీయడం ప్రారంభించారు. సోమ, మంగళవారాల్లో చోటుచేసుకునే పరిణామాలకు అనుగుణంగా వీరు కదలికలు ఉండవచ్చని భావిస్తున్నారు. కాగా, రెండ్రోజులపాటు సెలవులు కావడంతో అధికారులు కూడా ఈ విషయంపై దృష్టి సారించలేదు. ఆర్‌సీఎస్ మురళి మాత్రం తాము వేధింపులకు పాల్పడలేదని చెప్తున్నారు.

తాజాగా జరిగిన విచారణతో తనకు ఎలాంటి సం బంధం లేదని పేర్కొంటున్నట్లు తెలిసింది. అయితే జిల్లా సహకార శాఖలో, ఇతరత్రా సహకార ఉద్యోగుల్లో ఇటు మోహన్, అటు పాలకవర్గ వ్యవహారశైలిని విభేదిస్తున్న అధికారులు, ఉద్యోగులు మాత్రం ఈ పరిణా మాన్ని సానుకూలంగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. విచార ణకు భయపడి రాజీనామా చేయడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. లోపాలు లేకపోతే విచారణను ఎదుర్కోవచ్చు కదా అని వారు రైతుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వారికి పాలకవర్గ సభ్యుల నుంచి ఎలాంటి సహకారం లభించిన దాఖలాలు లేవు. గతంలో సభ్యుల మధ్య ఉన్న విభేదాలు కూడా ఇటీవల కాలంలో సమసిపోయాయి.

మోహన్‌తో మాట్లాడేందుకు మంత్రి, ముగ్గురు ఎమ్మెల్యేల ప్రయత్నం

మోహన్‌తో మాట్లాడేందుకు ఆదివారం ముగ్గురు శాసనసభ్యులు, కొందరు డైరెక్టర్‌లు, సింగిల్ విండో అధ్యక్షులు విశ్వప్రయత్నం చేశారు. అద్దంకి ప్రాంతానికి చెందిన కొందరు మోహన్ కోసం ఆయన ఇంటికి వెళ్లి విచారించారు. మంత్రి శిద్దా రాఘవరావుతోపాటు, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్, రవికుమార్, రామారావు తదితరులు మోహన్‌తో మాట్లాడే ప్రయత్నం చేశారు.

ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మోహన్‌ను తమతో మాట్లాడించాలని సూచించారు. రెండ్రోజులుగా ఫోన్ స్విచాఫ్ చేసుకుని ఉన్న మోహన్ వైఖరి పట్ల వారు కూడా అసహనం వ్యక్తం చేస్తూనే సమర్థవంతమైన పాలన అందించిన ఆయన పూర్తి కాలం కొనసాగాలే చూడాలని అభిప్రాయపడినట్లు తెలిసింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు దామచర్ల జనార్దన్ బ్యాంకు విషయంలో అసలేం జరుగుతున్న విషయంపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాంకు అధికారులతోపాటు, తనకు అందుబాటులోకి వచ్చిన పాలకమండలి సభ్యులు, సింగిల్ విండో అధ్యక్షులతో ఆయన ఈ విషయమై సమాచారం సేకరించుకున్నట్లు తెలిసింది.

మాయా జూదం

(మొదటిపేజీ తరువాయి)


నుంచి నగరంలో ప్రధాన సెంటర్లు, శివారు ప్రాంతాలు, కూలీలు ఉండే ప్రాంతాలకు మోటార్ బైక్‌లపై వెళ్లి బుకింగ్‌లు చేస్తారు. ఇలా మధ్యాహ్నాం పన్నెండు గంటల వరకు తిరుగుతారు. మూడు అంకెలు, రెండు అంకెలు గల నంబర్ల ఖరీదు అరవై రూపాయలు అంటే ఒక్కొక్కరు 60 రూపాయల చొప్పున ఎన్ని నంబర్లు అయినా కొనుగోలు చేయవచ్చు. పన్నెండు గంటల తరువాత ఆన్‌లైన్‌లో ఫలితాలు వెలువడతాయి. వెంటనే అదే ఏజెంటు నంబర్లు కొనుగోలు చేసిన వారి వద్దకు వెళ్లి ఫలితాల వివరాలు తెలిపి వారికి తద్వారా వచ్చిన నగదును చెల్లిస్తారు. అయితే కొనుగోలు చేసిన రెండు ,మూడు అంకెలు నంబర్లతో ఒక అంకె కలిస్తే ఇరవై రూపాయలు , రెండు అయితే నలభై, మూడు అంకెలు ఉంటే అరవై రూపాయలు లెక్కన చెల్లిస్తారు.

ఫ్యాన్సీ నంబర్‌కు ఇరవైరెండు వేలు

ఫ్యాన్సీ నంబర్ కోసం జూదం ఆడేవారు వెంపర్లాడుతూ ఉంటారు. అంటే మూడు తొమ్మిదులు, రెండు తొమ్మిదులు, మూడు ఐదులు, రెండు ఐదులు , మూడు ఒకట్లు, రెండు ఒకట్లు ఇలా ఒకే అంకెతో వచ్చే ఏ నంబరు అయినా ఫ్యాన్సీ నంబరే. ఈ నంబరు కొనుగోలు అరవై రూపాయలు అయినప్పటికీ ఆన్‌లైన్‌లో ఫ్యాన్సీ నంబరు వస్తే అది కొనుగోలు చేసిన వారికి ఇరవై రెండువేలు ఇస్తారు . అందుకోసం ఆశపడిన యువతి, యువకులు రోజుకు రూ. 5 లక్షల నుంచి ఆరు లక్షల వరకు నంబర్లు కొనుగోలు చేస్తున్నారు. ఏకొద్ది మందికో ఫ్యాన్సీ నంబర్ తగులుతుంది. మిగతా వారికి అసలు నంబరే తగలదు. దీంతో రోజూ లక్షల్లో నష్టపోతున్నారు. అయినా ఆశతో ఫ్యాన్సీ నంబరు తగలక పోతుందా అనే మోజులో కాపురాలు గుల్ల చేసుకొంటున్నారు.

పదిరూపాయల వడ్డీకి తెస్తున్న బాధితులు

చేస్తున్న కూలీ పనులు మానివేసి పదిరూపాయల వడ్డీకి డబ్బుతెచ్చి నంబర్ల ఆట ఆడుతున్నారు. దీంతో వారం రోజులలో లక్షరూపాయలు పోగొట్టుకున్నవారు ఉన్నారు. అదేసమయంలో పదిరూపాయలు వడ్డీలు కట్టలేక ఇంట్లో సామాన్లు అమ్ముకొని వీధిన పడిన వారు ఉన్నారు. ఇలా అమాయకుల ఆశలను నంబర్ జూదంగా మార్చి సొమ్ము చేసుకుంటు ఏజెంట్లు జేబులు నింపుకుంటున్నారు. ఈ ముఠాపై పోలీసులు దృష్టి సారించి కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఇందిరమ్మ లబ్ధిదారులకు శుభవార్త

ఒంగోలు నగరం: పక్కా గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అందించే యూనిట్ విలువ సరిపోక నిర్మాణాలను మధ్యలో ఆపేసిన లబ్ధిదారులకు నిజంగా ఇది శుభ వార్తే. నిర్మాణాలను తిరిగి ప్రారంభించి పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం మళ్లీ రూ.25 వేలు అందించనుంది. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నప్పటికి వాటిని పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేస్తోంది. తెలుగు దేశం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు పక్కాగృహాల నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయనే చెప్పాలి. రాష్ట్రానికి కేంద్రం లక్షలాది పక్కా గృహాలను మంజూరు చేసినా ప్రభుత్వం అనుకున్న స్థాయిలో గృహాల గ్రౌండింగ్ పూర్తి కావటం లేదు. పైగా ప్రభుత్వం అందిస్తున్న యూనిట్ విలువ సరిపోక లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇలా ఆగిపోతున్న ఇళ్ల నిర్మాణాలు రాష్ట్రవ్యాప్తంగా అధికంగానే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో లక్షలాది పక్కా గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2006వ సంవత్సరం నుంచి మూడు విడతలుగా అందిరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేసింది. మూడేళ్లలో రాష్ట్రంలో పూరిళ్లు కనిపించకుండా చేసి పేదలందరికీ పక్కాగృహాలను నిర్మించి ఇచ్చేందుకు ఇందిరమ్మ పథకాన్ని అమలు చేసింది. అయితే అప్పట్లో ప్రభుత్వం ఇచ్చే యూనిట్ విలువ సరిపోక అనేక మంది లబ్ధిదారులు అప్పుల పాలయ్యారు. నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేశారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది పక్కా గృహాలను మధ్యలోనే నిలిచిపోయాయి. 2014 లోపు ఇళ్లు మంజూరై ఇప్పటి వరకు ఏ లబ్ధిదారుడైనా పక్కా గృహాల నిర్మాణాలను మధ్యలోనే ఆపేస్తే అలాంటి వారు ఆ నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం కొత్తగా రూ.25 వేలు అందజేస్తోంది. నిర్మాణాలు బేస్ మెంటు లెవల్‌లో ఉన్నా..రూఫ్ లెవల్‌లో ఉన్నా..శ్లాబ్ లెవల్‌లో ఆగిపోయినా అన్ని ఇళ్లకు రూ.25 వేల వంతున అందజేయనున్నారు. ఇలా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాల లెక్కలు గృహ నిర్మాణ సంస్థ వద్ద సిద్ధంగా ఉండటంతో వీరందరికీ రూ.25 వేల వంతున ఆర్థిక సహాయం అందజేయనున్నారు. ఇటీవల కాలంలో పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చకాచకా చర్యలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం గతంలో 2006 నుంచి మంజూరు చేసి ఇంకా పూర్తికాని లబ్ధిదారులకు కూడా రూ.25 వేలు అదనంగా అందజేసి వాటిని పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టింది.

పదివేల మందికి ప్రయోజనం

ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయం వలన జిల్లాలోని లక్ష మంది పక్కా గృహాల లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. వీరు తమ గృహాల నిర్మాణాలను వివిధ స్థాయిల్లో నిలిపివేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గృహాల నిర్మాణాలను నిలిపివేసిన వారే ఇందులో అధికంగా ఉన్నారు. జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులు వీరి వివరాలను సిద్ధం చేశారు. 2014 లోపు మంజూరై అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాల నిర్మాణాల వివరాల ప్రకారం వాటిని పూర్తి చేసుకునేందుకు ప్రస్తుతం రూ.25 వేల వంతున అదనంగా ఆర్థిక సహాయాన్ని అందించనుంది.



క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు

ఉప్పుగుండూరు (నాగులుప్పలపాడు): క్రీడల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జడ్పీ చైర్మన్ ఈదరహరిబాబు అన్నారు. ఆదివారం ఉప్పుగుండూరులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి టెన్నీస్ వాలీబాల్ అండర్ 14,21 జట్లు పోటీలు ఫైనల్స్‌కు చేరి విజేతలుగా నిలిచారు. ఈసందర్భంగా జడ్పీ చైర్మన్ ఈదరహరిబాబు మాట్లాడుతూగ్రామీణ ప్రాంతాల్లో కొత్త క్రీడ అయిన టెన్నీస్ వాలీబాల్‌ను జిల్లాకు పరిచయం చేయడాన్ని నిర్వాహకురాలు అయిన లీలావతి ట్రస్టును అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, దీని ద్వారా ప్రతి క్రీడాకారుడు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. దీనితో పాటు వ్యక్తిగత ప్రతిభ సాధిస్తే ఉన్నతశిఖరాలకు ఎదగవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న ట్రస్టు నిర్వాహకులను కొనియాడారు. ట్రస్టు చైర్మన్ అత్తంటి లీలావతి మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా క్రీడలకు ప్రోత్సాహమిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక కార్యక్రమాలే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆమె తెలిపారు. ఈసందర్భంగా జడ్పీహైస్కూలులో తమ స్వంత నిధులతో ట్రాక్ నిర్మాణం చేపడతామని మున్నంగి వెంకట్రావు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన క్రీడా జట్లకు మెమెంటోలను జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు, ట్రస్టు చైర్మన్ లీలావతి చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం. పెద్దబ్బాయి, ట్రస్టు కన్వీనర్ అత్తంటి ఏషయ్యకుమార్, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు సాదినేని జగన్ మోహనరావు, ఎస్సై ఎ. అజయ్‌బాబు , రాష్ట్ర ఆసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, సాంబశివరావు, ఎంపీటీసీ దానియేలు, నల్లూరి శ్రీను, వెంకటేశ్వర్లు , సుభాస్కరరావు, రత్నాకర్ తదితర పీఈటీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే

సీనియర్ బాలుర విభాగంలో ప్రథమ చిత్తూరు, ద్వితీయ పశ్చిమగోదావరి, తృతీయ విజయనగరం , సీనియర్ బాలికల విభాగంలో ప్రథమ పశ్చిమగోదావరి, ద్వితీయ చిత్తూరు, తృతీయ ప్రకాశం, జూనియర్ విభాగంబాలురలో ప్రథమ విజయనగరం, ద్వితీయ తూర్పుగోదావరి, తృతీయ పశ్చిమగోదావరి, జూనియర్‌బాలికల విభాగంలో ప్రథమ చిత్తూరు, ద్వితీయ అనంతపురం, తృతీయ పశ్చిమగోదావరి జట్లు ఎంపికయ్యాయి.

డెంగ్యూ పంజా




- పెరుగుతున్న పాజిటివ్ కేసులు
- ఈ ఏడాది ఇప్పటికే 162 నమోదు
- విజృంభిస్తున్న మలేరియా, విష జ్వరాలు, గున్యా
- పడకేసిన ప్రభుత్వ వైద్యం
- పట్టించుకోని అధికారులు

ఒంగోలు నగరం : జిల్లాపై డెంగ్యూ పంజా విసురుతోంది. ప్రజలను వణికిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 162 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అందులో ఈ నెలలోనే 30కిపైన కేసులు రాగా, ఒక్క మంగళవారం ఎనిమిది కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు మలేరియా, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈనేపథ్యంలో వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ నిద్రావస్థలో జోగుతోంది. వైద్యులు, సిబ్బంది కొరతతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. దీంతో ప్రజలకు ప్రైవేటు వైద్యమే దిక్కయింది.

జిల్లాలో ప్రస్తుతం వాతావరణం మారింది. వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వ్యాధులు మురుసుకుంటున్నాయి. విషజ్వరాలతో గ్రామాలకు గ్రా మాలే మంచం పడుతున్నాయి. గ్రానైట్ క్వారీలు ఎక్కువగా ఉన్న చీమకుర్తి, జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న గిరిజన, చెంచు గూడేల్లో మలేరియా విజృంభిస్తోంది. అయితే వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి మలేరియా అని నిర్ధారించడం లేదు. వాస్తవానికి గిరిజన, చెంచు గూడేల్లో వ్యాధుల బారిన పడి మరణించిన వారి వివరాలు కూడా ప్రభుత్వ లెక్కల్లోకి ఎక్కటం లేదు. రాష్ట్రంలో చిత్తూరు, అనంతపురం తర్వాత మన జిల్లాలోనే డెంగ్యూ, మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నట్లు ప్రభుత్వమే నిర్ధారించింది.

ఈ పరిస్థితుల్లో వ్యాధులను అదుపు చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ మొద్దు నిద్ర వీడటం లేదు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉండగా ఆదిశగా చర్యలు మృగ్యమయ్యాయి. పత్రికల్లో వచ్చే వార్తల ఆధారంగా రోగాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి చేతులు దులుపుకోవటమే కాని వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటంలో వైద్య, ఆరోగ్యశాఖ పూర్తిగా విఫలమైంది. పల్లెల్లో పారిశుధ్యం పడకేస్తోంది. మున్సిపాలిటీలు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. ఇది వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమవుతోంది. అయినప్పటికీ పారిశుధ్య చర్యల మెరుగునకు తీసుకుంటున్న చర్యలు శూన్యమయ్యాయి.

ఈ ఏడాది 162 డెంగ్యూ కేసులు

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 162 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అందులో ఈ నెలలో 30 కేసులు నమోదు కాగా, మంగళవారం ఒక్క రోజే ఎనిమిది కేసులు తేలాయి. అధికారికంగా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. అయితే అనధికారికంగా వారి దృష్టికి రాని కేసుల సంఖ్య ఇంతకు రెట్టింపు ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఈ నెలలో డెంగ్యూ, విష జ్వరాలతో ఇద్దరు మృతి చెందారు. అద్దంకికి చెందిన యువకుడు ఆవుల రామాంజనేయులు విష జ్వరంతో, అద్దంకి మండలం శంకవరప్పాడుకు చెందిన బిజ్జంపూజిత అనే బాలిక డెంగ్యూతో ప్రాణాలు విడిచారు. గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు మొత్తం 174 డెంగ్యూ కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటికే ఆ సంఖ్య 162కు చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. జిల్లా నుంచి అనేక మంది రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. వీరి వివరాలు వైద్య, ఆరోగ్యశాఖ వద్ద నమోద ఽకావటం లేదు.

వైద్యుల పోస్టులు ఖాళీ

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రస్తుతం 47 వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత కూడా పీడిస్తోంది. వైద్యుల పోస్టులను, సిబ్బంది పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసుకునేందుకు ఇటీవల ప్రభుత్వం అనుమతించినప్పటికీ ఆ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. వ్యాధులు ముసురుతున్న ప్రస్తుత తరుణంలోనైనా పోస్టుల భర్తీని వేగవంతం చేసి రోగులకు సత్వర సేవలు అందించాల్సిన అవసరం ఉంది.


ఒకే ఇంట్లో మంచం పట్టిన ముగ్గురు


జ్వరంతో బాధపడుతున్న భార్యాభర్తలు

మంచంపట్టిన ఈదర

ముండ్లమూరు : మండలంలోని ఈదర గ్రామంలో విషజ్వరాలు విజృంభించాయి. ఇప్పటికే 500 మంది మంచం పట్టారు. వీరిలో కొందరు గున్యా లక్షణాలు కన్పిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో జ్వరపీడితులు వినుకొండ, అద్దంకిలలోని ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు.

ఈదర గ్రామంలో 1200 కుటుంబాలు ఏడువేల వరకూ జనాభా ఉంది. గ్రామంలో 20 రోజుల క్రితం మొదలైన విష జ్వరాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఎక్కువ మంది చలి జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. కొన్ని కుటుంబాల్లో సభ్యులంతా మంచం పట్టారు. గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత కన్పిస్తోంది. ఇదే విషజ్వరాలు ప్రబలడానికి కారణంగా భావిస్తున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కన్నెత్తి చూడలేదు. గ్రామానికి సమీపంలో మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ అక్కడ ఇద్దరి వైద్యులకు ఒక్కరు మాత్రమే పని చేస్తున్నారు. మరోవైపు మందుల కొరత కూడా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రైవేటు వైద్యమే దిక్కయింది. బాధితుల్లో అనేక మంది సమీపంలోని అద్దంకి, గుంటూరు జిల్లాలోని వినుకొండలోని వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరపీడితుల్లో ఎక్కువ మంది రెక్కాడితే కాని డొక్కాడని పేదలు కావడంతో ప్రైవేటు వైద్యశాలల్లో వేలకు వేలు ఖర్చు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ మందలపు వెంకట్రావు రెండ్రోజుల క్రితం వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కేవలం సిబ్బంది మాత్రమే శనివారం గ్రామానికి వచ్చారు. వైద్యులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇంట్లో అందరికీ జ్వరాలే



మా ఇంట్లో నలుగురు ఉన్నాం. అందరం జ్వరంతో బాధపడుతున్నాం. కీళ్ల నొప్పులతో కదలలేకపోతున్నాం. ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స కోసం ఇప్పటికే రూ. 20వేలు ఖర్చు చేశాం. అయినా కీళ్ల నొప్పులు తగ్గలేదు.

- తాడే శ్రీను, ఈదర

వైద్యులు కన్నెత్తి చూడలేదు



గ్రామంలో 500 మందికి పైగా జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతుంటే వైద్యాధికారులు కేవలం సిబ్బందిని పంపి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా వైద్యులు గ్రామాన్ని సందర్శించి మెరుగైన వైద్యం అందించాలి.

- నాగమల్లి లింగయ్య, ఈదర

సత్తాచాటిన అనంతపురం బ్యాట్స్‌మెన్

- తొలి ఇన్నింగ్స్‌లో 368/6

ఒంగోలు కార్పొరేషన్ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని సీఎస్ఆర్ శర్మ కళాశాల గ్రౌండ్స్‌లో ఆదివారం నుంచి కర్నూలుతో మొదలైన అండర్-16 క్రికెట్ మ్యాచ్‌లో అనంతపురం బ్యాట్స్‌మెన్ పరుగుల వరద పారించారు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 368 పరుగులు చేశారు. టాస్ గెలిచిన కర్నూలు ఫీల్డింగ్ ఎంచుకుంది. అనంతపురం బ్యాట్స్‌మెన్ ధాటిగా ఆడారు. ఆ జట్టులో బి. యోగనాథ్ 86 పరుగులు సాధించగా, ఎస్ఎండీ కమల్ 77 (నాటౌట్), ఎం.కె. దత్త రెడ్డి 48, బి. వినయ్ 48, టి. మహేంద్ర 30 పరుగులతో రాణించారు. కర్నూలు బౌలర్లలో కె. సునీల్ శంకర్ 85 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, ఎం. నయిముల్లా, ఎస్. ఫరూక్ ఒక్కో వికెట్ సాధించారు.


కమల్ 77 (నాటౌట్)


యోగనాథ్ 86

నేడు ఆన్‌లైన్ దరఖాస్తులతో హాజరుకావాలి

ఒంగోలు కలెక్టరేట్ : కాపు కార్పొరేషన్‌లో రూ. 2లక్షల లోపు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం ఉదయం పది గంటలకు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఒక ప్రకటనలో కోరారు. కార్పొరేషన్ పరిధిలోని అభ్యర్థులు కార్పొరేషన్ కార్యాలయంలో, మండల పరిధిలోని అభ్యర్థులు ఎంపీడీవో కార్యాలయంలో రేషన్, ఆధార్ కార్డు మూడు ఫొటోతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తుతో హాజరు కావాలని సూచించారు.

ముస్లింల అభ్యున్నతి టీడీపీతోనే

- రూ. 35 లక్షల ఈద్గా పనులు ప్రారంభంలో ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్ : ముస్లిం, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, అందుకు ఎల్లవేళలా కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. స్థానిక కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లోని ఈద్గాలో రూ. 35లక్షలతో చేపట్టిన ప్రహరీ నిర్మాణం, ఫ్లాట్‌ఫాం ఇతర పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఈద్గా ప్రెసిడెంట్ ఆస్ట్రేలియా సిలార్ అధ్యక్షత వహించగా, దామచర్లతోపాటు ఆర్డీవో కె. శ్రీనివాసరావు, నగర కమిషనరు ఎస్. వెంకటకృష్ణ, ఎంఈ డి. సుందరరామిరెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలులోకి తీసుకొచ్చిందన్నారు. నగరంలో ముస్లింల బరియల్ గ్రౌండ్, షాధీఖానా, ఈద్గా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఒంగోలులో 8వేల గృహాలు హౌసింగ్ ఫర్ ఆల్ కింద నిర్మిస్తుండగా, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ ఇల్లు అందజేస్తామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు నీరు విడుదల చేసేందుకు పైపులైను నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు జబ్బార్, కాలేషావలి, అన్వర్, షేక్ కపిల్ బాషా, పఠాన్ హనీఫ్‌ఖాన్, హబీబ్, టిడిపి నాయకులు కొఠారి నాగేశ్వరరావు, దాయినేని ధర్మ, ఆర్ల వెంకటరత్నం పాల్గొన్నారు.



ఈద్గా ప్రహరీ ప్లాట్‌ఫాం పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న దామచర్ల

ఈఓఆర్‌డిలను డిప్యూటీ ఎంపీడీవోలుగా మార్చాలి

ఒంగోలు రూరల్ : ఈఓ ఆర్‌డీలను డిప్యూటీ ఎంపీ డీవోలుగా పేరు మార్పు చేసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఈఓఆర్‌డీల ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బారెడ్డి చెప్పారు. ఒంగోలు మండల పరిషత్ మానవరుల సమావే శపు భవనంలో ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల(3వ జోన్) ఈఓఆర్‌డీల సర్వసభ్య సమావేశం ఆదివారం జరి గింది. సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈఓఆర్‌డీలకు ప్రతి ఆరేళ్లకు ఒకసారి క్యాడర్ మార్పు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ఈఓఆర్‌డీలు జిల్లా పంచాయతీ అధికారుల పరిధిలో పనిచేయాల్సి వస్తుందన్నారు. ఎంపీడీవోలు జిల్లా పరిషత్ సీఈవో పరిధిలో పనిచేయాల్సి ఉందని చెప్పారు. ఈఓఆర్‌డీలపై ఇటు డీపీవో, జడ్పీ సీఈవోలు ఇద్దరు అజమాషీ ఉంటుందన్నారు. దీనివల్ల పనిబారం పెరుగుతోందని చెప్పారు. వీరిని కూడా జడ్పీ పరిధిలోకి తేవడం ఉత్త మమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈఓఆర్‌డీల అధ్యక్షుడు కె.దుర్గాప్రసాదు, 3వ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజశేఖర్, ఎ. బాలచెన్నయ్య, నెల్లూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల ఈఓఆర్‌డీలు పాల్గన్నారు.

జాతీయ నేత్రదాన కరపత్రాల ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్ : జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా సక్షమ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన కరపత్రాలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆవిష్కరించారు. సక్షమ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన కార్నియా అంధత్వ ముక్త భారత్ అభియాన్ ద్వారా నల్లగుడ్డు లోపం వల్ల అంధత్వంతో బాధపడుతున్న వారిని నేత్రదానం వల్ల ఇద్దరికీ కంటి చూపు కలిగించాలనే ఉద్దేశంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు నిర్వాహకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యక్కల తులసీరావు, అయినాబత్తిన ఘనశ్యాం, పవన్ కల్యాణ్ జనసేన అధ్యక్షుడు ఆర్. బుజ్జి, సక్షమ్ అధ్యక్షుడు కె. పూర్ణచంద్రరావు, బట్టు బాలాజీ, వెంకటరావు, కె. రాఘవరావు పాల్గొన్నారు.



హిప్..హిప్..హుర్రే



లక్కీ..లక్కీ..

హ్యాపీ సండే

పెళ్లూరు గ్రామంలో ఆదివారం కార్పొరేషన్ అధికారులు నిర్వహించిన హ్యాపీసండే కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. విద్యార్థులు కుర్చీలాట, స్కిప్పింగ్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్నారు. టగ్గాఫోరు(తాడులాగుట), ఉట్టికొట్టే ఆటల్లో మున్సిపల్ అధికారులు, గ్రామస్థులు తాడులాగారు. విద్యార్థులు డ్యాన్స్ చేసి అందర్నీ ఉత్సాహపరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈ సుందరరామిరెడ్డి, డీఈ అనిల్‌కుమార్, ఏఎస్‌వో కామేశ్వరరావు, అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఎక్సపర్టు భార్గవీదేవి, అర్బన్ ప్లానర్ హరిణీ, నగర టీడీపీ అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, నేతలు దాయని ధర్మ, జాన్‌సైదా, అధికార ప్రతినిధి నండూరి చంద్ర, చిరుమళ్ల శ్రీనివాసరావు, రావెళ్ల వెంకట్రావు, అంచెల చంద్రశేఖర్, నాగం శ్రీనివాసరావు, గట్టుబోయిన కృష్ణ, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆనందంగా నృత్యం చేస్తున్న గ్రామ పెద్దలు



ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కొఠారి నాగేశ్వరరావు

పేదలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్ : నగరంలో పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని సీపీఎం నగర కార్యదర్శి జి.వి. కొండారెడ్డి ఆరోపించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఇళ్ల స్థలాల సాదన కమిటీ, సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు జరిగింది. ఇళ్ల స్థలాల సాధన కమిటీ కన్వీనర్ జి. రమేష్, నాయకులు అత్తంటి శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, హుస్సేన్, శ్రీరామశ్రీనివాసులు, కె. శ్రీనివాసులు, భాను పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అమ్మ సేవాసదన్‌కార్యకర్తలు

కొత్తపట్నం(ఒంగోలునగరం): అమ్మ సేవాసదన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని అల్లూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కలు పెంచండి పర్యావరణాన్ని కాపాడంటూ అంటూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అల్లూరు బజార్లలో దాదాపు వంద మొక్కలు నాటటంతో పాటు వాటికి ట్రీ గార్డులనూ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మసేవాసదన్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు కానుగల సురేష్, సభ్యులు తాటిపర్తి సుబ్బారెడ్డి, కలికాయ ప్రసన్నాంజనేయులు, మామిడాల వెంకటేశ్వర్లు, ఆళ్ల సుధాకరరెడ్డి, దగ్గుబాటి రామారావు, గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, దగ్గుపాటి శివజ్యోతి, ఆరుమూరి హరిబాబు, నున్నా జానకిరామ్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కారమే ప్రధాన అజెండా

ఒంగోలు కలెక్టరేట్ : నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణయ్య కోరారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నాయీ బ్రాహ్మణ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, విద్యార్థులకు పోటీ పరీక్షలు, బోధన, వసతి సదుపాయాలు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరించాలని తీర్మానించారు. అనంతరం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా గుడిపాటి విజయభాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వల్లూరి దుర్గా ప్రసాద్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

శాకాహారం ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలు పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇస్లాంపేట, కరుణాకాలనీలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పిరమిడ్ సేవాదళ్ కన్వీనర్ నన్నూరి శ్రీనివాసరావు, వాసు, సునీల్, కాశీ విశ్వనాద్, బదిరి, పద్మ, చంద్ర, లీల, వాసంతి పాల్గొన్నారు.

ప్రరసం ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవం

ఒంగోలు కల్చరల్ : ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఈ నెల 29వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఒంగోలు నారాయణ పబ్లిక్ స్కూలులో తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘ ప్రధాన కార్యదర్శి కుర్రా ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం స్థానిక నాగార్జున డిగ్రీ కాలేజీ విద్యార్థులకు తెలుగు భాషకు గిడుగు చేసిన కృషి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్న మార్కాపురానికి చెందిన కొండెపోగు డేవిడ్ లివింగ్ స్టన్, త్రిపురాంతకానికి చెందిన మద్దిరాల శ్రీనివాసులు, చీరాలకు చెందిన కె.శ్రీనివాసగౌడ్‌లను గిడుగు సాహితీ పురస్కారాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. కవులు రచయితలు సాహిత్యాభిమానులు 29న జరిగే సభలో పాల్గొనాలని కోరారు.

మానవత్వానికి ప్రతిరూపం మదర్ థెరిస్సా

ఒంగోలు కల్చరల్ : మానవత్వానికి నిలువెత్తు రూపం మదర్ థెరిస్సా అని ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. థెరిస్సా 118వ జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి ఆయన ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. థెరిస్సా విగ్రహ కమిటీ అధ్యక్షుడు సుద్దపల్లి శశిబాబు, ఫాదర్ రమేష్, ఫాదర్ సంతోష్, పాస్టర్చ్‌లు జి.శంకర్, డేవిడ్‌రాజు, ఏసుదాసు, మత్తానియేలు, కోటేశ్వరరావు, కమలావెస్లీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, పక్కన గరటయ్య, సుజాత

నేడు సబ్సిడీ రుణాల కోసం ఇంటర్వ్యూలు

బల్లికురవ: ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్ కింద మంజూరైన సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపికకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. 2017-18 సంవత్సరాలకు 241 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఎస్సీలకు 104, మైనార్టీలకు 9, బీసీలకు 50, కాపులకు 70, ఎస్టీలకు 8 యూనిట్లు మంజూరయ్యాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆన్‌లైన్ ఫారంతో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని ఎంపీడీవో పేర్కొన్నారు.

కోలాహలంగా గణేషుడి నిమజ్జనం


అద్దంకిలో జరిగిన నిమజ్జనోత్సవంలో పాల్గొన్న ఎన్ఎస్‌పీ ఈఈ శ్రీనివాసులు


ఈర్లకొండ నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథుడు


అద్దంకి ఎన్టీఆర్‌నగర్‌లో వినాయకుడి ఊరేగింపు

అద్దంకిటౌన్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండపాల్లో కొలువు దీరిన గణనాథులు మూడవ రోజు నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఈక్రమంలో అద్దంకి పట్టణంలోని పలు కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. స్థానిక ఎన్ఎస్‌పీకాలనీలో ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని డప్పు వాయిద్యాల నడుమ పాత గాంధీ బొమ్మ సెంటర్ నుంచి గుండ్లకమ్మకు తరలించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ ఈఈ శ్రీనివాసులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లో ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం కన్నుల పండుగగా సాగింది. రాధాకృష్ణుల మధ్య ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలు నిమజ్జనానికి తరలిరావడంతో పట్టణంలో సందడి వాతావరణం ఏర్పడింది. గుండ్లకమ్మ వద్ద భక్తుల రాకతో కోలాహలం నెలకొంది.

బల్లికురవ: బల్లకురవ మండలంలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలనుఆదివారం అంగరంగ వైభవంగా నిమజ్జనాలకు తరలించారు. ఈర్లకొండ వద్ద ఉన్న శ్రీనివాసగ్రానైట్ క్వారీ, బల్లికురవ, అంబడిపూడి గ్రామాల్లో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన వి గ్రహాలను ఊరేగింపుగా మంగళ వాయిద్యాలతో నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్‌ఐ లక్ష్మణరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం 14 విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మేదరమెట్ల సాయిబాబా దేవాలయం సమీపంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని ఊరేగించారు. మేదరమెట్ల పోలీసుస్టేషన్ పరిధిలో 7, కొరిశపాడు స్టేషన్ పరిధిలో 7 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువకులు ఉత్సాహంగా గులాములు చల్లుకుంటూ జై గణేష్ అంటూ నినాదాలు చేశారు. ప్రసాదాలు పంచారు.

ఘనంగా కొలుపులు


ఊరేగింపుగా వెళ్తున్న కాకానిపాలెం వాసులు

అద్దంకి: అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంవాసులు ఆధ్వర్యంలో చేపట్టిన పోలేరమ్మ కొలుపులు ఆదివారంతో ముగిశాయి. శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజులు పాటు కొనసాగి ఆదివారం అన్ని ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించి పోలేరమ్మ దేవాలయం వద్ద పొంగళ్లు పెట్టుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

అద్దంకి: ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ఇంకొల్లు ప్లాట్ ఫారాల సమీపంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొరియర్ అండ్ కార్గో సర్వీసు కార్యాలయాన్ని ఎమ్మెల్యే రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు ప్లాట్ ఫారాలు, సిసి ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు. గ్యారేజీలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి మరో రూ.50 లక్షల నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ప్రయాణికుల ఆదరణ పొంది ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రామ్మోహన్‌రావు, రాంబాబు, కరి పరమేష్, సందిరెడ్డి రమేష్, గోరంట్ల శివాజి, నర్రా నాగేశ్వరరావు, చాగంటి రాజేంద్ర, శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి, ఇస్తర్ల వెంకటరావు పాల్గొన్నారు.


కార్గో సర్వీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

మొబైల్ మరుగుదొడ్లు..!

అద్దంకి: సామూహిక మరుగుదొడ్లు అంటే ఏదో ఒక ప్రాంతంలో శాశ్వతంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాకాకుండా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చుకునే మరుగుదొడ్లు అందుబాటులో ఉంటే ఎంత బాగుండో అని కొందరు ఆశిస్తుంటారు. ఈ నేపధ్యంలోనే ప్రభుత్వం కొన్ని పట్టణాలలో విశాలమైన స్థలాలు లేని చోట కొద్ది స్థలంలోనే మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. చిత్తూరు నగరంలో ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ నుంచి రెండు ట్రాలీలపై మొబైల్ మరుగుదొడ్లను ఆదివారం అద్దంకిలో గుండా తీసుకు వెళ్తుండటంతో పలువురు ఆసక్తిగా గమనించారు. అద్దంకి పట్టణంలో స్థలం అందుబాటులో లేక పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు జరగలేదు. ఈ నేపధ్యంలో ట్రాలీపై తీసుకు వెళ్తున్న మొబైల్ టాయిలెట్స్‌ను గమనించిన పలువురు ఇలాంటివి పట్టణంలో కూడా ఏర్పాటు చేస్తే బాగుండు అంటూ చర్చించుకున్నారు..!


ట్రాలీపై తరలిస్తున్న మొబైల్ మరుగుదొడ్లు

నవరత్న పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించాలి

● ఒంగోలు ఎంపీ వైవీ.సుబ్బారెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ వైవీ.సుబ్బారెడ్డి

అద్దంకి: వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగేలా నవరత్నాల పథకాలు అమలు జరుగుతుందని ఒంగోలు ఎంపీ వైవీ. సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం అద్దంకిలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి నవరత్న పథకాల సభ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ వైవీ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అమలు కాని హామీలను గుప్పించి ప్రజలను మోసగించి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ టీడీపీలోకి వెళ్లి పోయినా కార్యకర్తలు వైసీపీ వెంటే నిలవడం అభినందనీయమన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున బాచిన చెంచుగరటయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గరటయ్య మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకుండానే కొరిశపాడు పోలిరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించేందుకు సిద్ధం కావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు అమృతపాణి, బాచిన చెంచుప్రసాద్, బాచిన కృష్ణ చైతన్య, సుధాకర్‌రెడ్డి, జజ్జర ఆనందరావు, అట్లా చిన్న వెంకటరెడ్డి, కేవీ.రమణారెడ్డి, చుండూరి రవి, వెంకటేశ్వరరావు, జ్యోతి హనుమంతరావు, స్వయంపు హనుమంతరావు, చింతల పేరయ్య, రామిరెడ్డి ఆదిరెడ్డి, గూడా శ్రీనివాసరెడ్డి, సోము పరమేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా శింగరకొండలో రూ.5 లక్షల ఎంపీ నిధులతో టీటీడీ కళ్యాణ మండపం వరకు నిర్మించిన సీసీరోడ్డును ఎంపీ వైవీ.సుబ్బారెడ్డి ప్రారంభించారు. ముందుగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా పద్యశాసన, సృజన వార్షికోత్సవాలు


రామబ్రహ్మంను సత్కరిస్తున్న సృజన బృందం

అద్దంకిటౌన్: ప్రాచీన సాహిత్యం చదవడం ద్వారా ఎన్నో సామాజిక విషయాలను తెలుసుకోవచ్చని ప్రఖ్యాత కవి, అవధాని, సాహితీ విమర్శకులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అన్నారు. ఆదివారం అద్దంకి గీతా మందిర్‌లో సృజన వార్షికోత్సవం, పండరంగని అద్దంకి పద్యశాసన ప్రతికృతి ఆవిష్కరణ వార్షికోత్సవ సభ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగాయి. సృజన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు, సన్నిధానం నరసింహశర్మ నిర్వహణలో కవి సమ్మేళనం జరిగింది. కె.అనిల్‌కుమార్, నూరీలు ఆల్గొన్నారు. సాయంత్రం నారాయణం బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) సమర్పిత సృజన సాహిత్య పురస్కార సభ జరిగింది. సాహిత్య సమావేశాలకు ఆర్థికంగా సహకరిస్తున్న వీరవల్లి రుద్రయ్యను ప్రశంసించారు. అనంతరం బేతవోలు రామబ్రహ్మంకు సృజన సాహిత్య పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. జిల్లా రచయిత సంఘం గౌరవాధ్యక్షులు బి.హనుమారెడ్డి, అద్దంకి శ్రీనివాసరావు, గాడేపల్లి దివాకర్‌దత్తు, మౌలాలి గురుస్వామి, జ్యోతిచంద్రమౌళి, డీవీఎం సత్యనారాయణ, కె.అనంతరామకృష్ణ, జ్యోతిష్మతి పాల్గొన్నారు.

మేదరమెట్లలో వైసీపీ కార్యాలయం ప్రారంభం

మేదరమెట్ల: మేదరమెట్లలో నూతనంగా నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని ఒంగోలు ఎంపీ వైవీ.సుబ్బారెడ్డి ఆదివారం ప్రారంభించారు. బైపాసు నుంచి మోటారు సైకిళ్ల ర్యాలీతో సుబ్బారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ గరటయ్యలను ర్యాలీగా స్వాగతం పలికారు. వైఎస్.రాజశేఖరరెడ్డి, వైవీ.సుబ్బారెడ్డి తండ్రి యర్రం చిన్నపోలిరెడ్డిల విగ్రహాలను ఆవిష్కరించారు. సర్పంచ్ పేరం నాగలక్ష్మి, మన్నే మధుసూదనరావు, పల్లెర్ల శ్రీనివాసరెడ్డి, యర్రం రత్నారెడ్డి పాల్గొన్నారు.

బీరువా వితరణ

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానానికి ఒంగోలుకు చెందిన వారు ఆది వారంబీరువాను అందజేశారు. నాగబోయిన భాస్కరరావు, వెంకట శేషమ్మల కుమారుడు శ్రీధర్‌బాబు, సతీష్‌బాబు సహకారంతో ఈ బీరువాను సమకూర్చారు. తమ్మన్న శ్రీనివాసరావు, రావిపాటి విష్ణువర్ధన్, కిరణ్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అద్దంకి

కళామందిర్ - జయ జానికీ నాయక
శ్రీరామ - అర్జున్‌రెడ్డి
వీఎంఎస్- వివేకం
మినీవీఎంఎస్ - నేనేరాజు-నేనేమంత్రి

మేదరమెట్ల

నారాయణ
చిత్రాలయ - లై

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు


చీరాలలో విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్న చిన్నారులు


వాడరేవులో నిమజ్జనానికి తరలుతున్న 300కాలనీ గణనాథుడు

చీరాలఅర్బన్ : చీరాలలో వినాయకచవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. చవితి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం భారీ సంఖ్యలో గణనాథుల విగ్రహాలను ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. స్థానిక కూరగాయల మార్కెట్ వెనుక నవత ట్రాన్స్‌పోర్ట్ ఎదురు చిన్నారులు ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గులాలు చల్లుకుంటూ బాజాసంచా కాలుస్తూ కొట్లబజారు, జాండ్రపేట, కొత్తపేట, ఈపూరుపాలెం, 300కాలనీ, తోటవారిపాలెం తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో విఘ్నేశ్వరుని విగ్రహాలను యువకులు నృత్యాలు చేస్తూ వాడరేవులోని నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. వాడవాడలా నిమజ్జన ఊరేగింపులు, విఘ్నేశ్వరుని పందిర్లలో ప్రత్యేక పూజలు, ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

టీడీపీని బలోపేతం చేయడమే లక్ష్యం

● మాజీ మంత్రి డాక్టర్ పాలేటి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పాలేటి రామారావు

చీరాలఅర్బన్: క్షేత్రస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయటమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు పిలుపునిచ్చారు. చీరాల పట్టణం పాపరాజుతోట ఎస్‌జె.రంగనాయకులు, బావనమ్మగార్ల కళ్యాణమండపంలో టీడీపీ కార్యకర్తల సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా పాలేటి మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు ప్రజలందరికీ అందేలా చూడటంతో పాటు కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలన్నారు. బూత్‌కమిటీ ప్రతినిధులుగా ఎన్నికైన వారు తమ బూత్‌ల పరిధిలో ఓటర్ల సంఖ్యను సరిచూసుకోవాలని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబుపై ప్రజల్లో ఉన్న విశేష ఆదరాభిమానాల్ని మరింత పెంచేందుకు ప్రతికార్యకర్త సైనికునిలా కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎవరైనా వారిని గెలిపించటమే ధ్యేయంగా కృషి చేయాలని ఆయన చెప్పారు. సమావేశంలో ఎంపీపీ గవిని శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టా గంగయ్య, కో ఆప్షన్‌సభ్యుడు షేక్ మస్తాన్, బట్టా లీలానందప్రసాద్, కౌతవరపు జనార్దన్, కటకం శ్రీనివాసరావు, పిక్కి నారాయణ, గవిని నారాయణ, బొడ్డు సురేంద్రబాబు, బొయిన కేశవులు, పాకల వెంకట్రావు, కాసాని రాము, పులి వెంకటేశ్వర్లు, జ్ఞానేశ్వరరావు, టీడీపీ వాసు, చంద్ర, తిరుపతిరాయుడు, తాతా సీతారామస్వామి, డేటా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

3న అవధూతస్వామి ఆరాధన మహోత్సవం

చీరాలఅర్బన్ : చీరాల పట్టణంలోని ఫైర్ ఆఫీస్ రైల్వేగేట్ దాటిన తర్వాత గాంధీనగర్‌లో శ్రీవారి సమాధి మందిరం వద్ద శ్రీ అవధూతస్వామివారి 45వ ఆరాధనమహోత్సవం సెప్టెంబర్ 3వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ, భక్త సమాజ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాడరేవు లలితానంద ఆశ్రమాధిపతి స్వామి రామానందసరస్వతి వారి పర్యవేక్షణలో జరిగే ఆరాధన మహోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు హాజరు కావాలని వారు కోరారు.

చీరాలలో సినిమాలు

థియేటర్	సినిమా
మోహన్	జయ జానకి నాయకా
సంగం	అర్జున్‌రెడ్డి
సాయిప్యాలెస్	వివేకం
శాంతి	నేనే రాజు-నేనే మంత్రి

మూఢనమ్మకాలను నిర్మూలించాలి

● ఎఫ్ఐఆర్ఏ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ నరేంద్రనాయక్



మాట్లాడుతున్న నరేంద్రనాయక్

చీరాలఅర్బన్ : ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలను, మూఢవిశ్వాసాలను నిర్మూలించటమే లక్ష్యంగా హేతువాద సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని అఖిలభారత హేతువాద సంఘాల సమాఖ్య (ఎఫ్ఐఆర్ఏ) జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ నరేంద్ర నాయక్ అన్నారు. కొత్తపేట వివేకా విద్యాలయంలోని ఎంఎన్‌రాయ్ భవన్‌లో ఆదివారం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రేషనలిస్ట్ అసోసియేషన్ (ఎఫ్ఐఆర్ఏ)కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల హేతువాద సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హేతువాద సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలనా చట్టాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలన్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో జరిగిన హింసాకాండకు ఆయా ప్రభుత్వాలే బాధ్యత వహించాలని ఆయన చెప్పారు. పలు అంశాలపై, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. సమావేశంలో తమిళనాడు, కేరళ హేతువాద సంఘాల రాష్ట్రాల అధ్యక్షులు అలిగిరి స్వామి, లాల్ సలాం, అంధశ్రద్ధ నిర్మూలనాసమితి, దబోల్కర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు అవినాష్‌పాటిల్, ఆయా రాష్ట్రాల హేతువాద సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు మాతృభాషా దినోత్సవం

చీరాలఅర్బన్ : మాతృభాషాదినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 29న గిడుగు రామ్మూర్తి జయంతి సభను బాలికోన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలుగు మాతృభాషాసమాఖ్య ప్రతినిధి అన్నం రాజుసుబ్బారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. చీరాల మున్సిపల్ కార్యాలయంలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలాంకరణ జరుగుతుందన్నారు. అనంతరం జయంతి సభలో పురపాలకసంఘ పాఠశాలల్లో పనిచేసే తెలుగు ఉపాధ్యాయులకు చిరు సన్మానం ఉంటుందని, మాతృభాషాభిమానులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

చీరాలఅర్బన్ : ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా పార్శిళ్లు సురక్షితంగా త్వరితగతిన గమ్య స్థానాలకు చేరతాయని, అందువల్ల ఈ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు కోరారు. చీరాల ఆర్టీసీ డిపోమేనేజర్ డి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఆదివారం కార్గో సర్వీస్ కార్యాలయాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినబొంబాయిగా పేరొందిన చీరాలలో అధికంగా ఉన్న వస్త్ర వ్యాపారులు ప్రత్యేకించి ఆర్టీసీ కార్గో పార్శిల్ సర్వీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌తో పాటు సహాయమేనేజర్ శ్యామల, కార్గో సర్వీస్ ప్రతినిధి శ్రీనివాసరావు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

కొత్తపేట(చీరాల): కొత్తపేట ఆర్టీసీ కాలనీలోని షిర్డిసాయిబాబా మందిరంలో ఆదివారం చీరాల శ్రీకామాక్షికేర్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎముకలు, కీళ్లవైద్యనిపుణులు చలువాది వెంకటేశ్వరరావు, డాక్టర్ శివరామయ్య, పిల్లల వైద్యనిపుణులు అంజలి, డాక్టర్ శ్రీనివాసరాజుల బృందం రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిరం కమిటీసభ్యులు నారాయణరావు మాట్లాడుతూ తమ కాలనీలో అవసరమైనవారికి వైద్యపరీక్షలు నిర్వహించేందుకు అంగీకరించిన శ్రీకామాక్షికేర్ హాస్పటల్ ఎండీ తాడివలస దేవరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 60మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మందిరం కమిటీ అధ్యక్షుడు బాబూరావు, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

చీరాల : ఒంగోలు కలెక్టరేట్ వద్ద సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఎస్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర కౌన్సిలర్ వి.ప్రభాకర్‌రావు, రమణ, భానుచంద్రమూర్తి తదితరులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ హాజరై ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు.

మహిళా వికాసంపై అవగాహన


మాట్లాడుతున్న నాగరాజ్యలక్ష్మి

వేటపాలెం: వేటపాలెంలోని రోటరీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం ప్రొబస్‌క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాభారతంలో మహిళా వికాసంపై విశ్రాంత ప్రిన్సిపాల్ వి.నాగరాజ్యలక్ష్మి వివరించారు. దమయంతి సహనమూర్తి, ఆదర్శ మహిళ అని ఆమె చెప్పారు. శకుంతల దైవాంశ సంభూతురాలని, సహనంతో ముందుకు సాగి మహిళలకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. ఈ సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు దంతం వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షుడు మొగలి గోపాలకృష్ణయ్య, సెక్రటరీ బండ్ల భాస్కర్, జాయింట్ సెక్రటరీ వీవీ.సుబ్బారావు, ట్రెజరర్ సజ్జా కోటిలింగం, సత్రం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తిమ్మసముద్రం వాసులకు కరెంటు కష్టాలు

● పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు


గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న కరెంట్ తీగలు

చీరాల: తిమ్మసముద్రంవాసులకు కరెంటు కష్టాలు తప్పటం లేదు. రాష్ట్రంలో 24గంటలు విద్యుత్‌సరఫరా ఈ గ్రామంలో అమలు కావటం లేదు. సుమారు 4దశాబ్దాల క్రితం గ్రామానికి విద్యుత్‌సరఫరా వచ్చినప్పటి నుంచి అవే లైన్లు కొనసాగుతున్నాయి. ఆ తరువాత ఊరు విస్తరణ, వినియోగం పెరిగింది. అయితే విద్యుత్ లైన్లను మార్చ లేదు. దీంతో గత కొన్ని సంవత్సరాలుగా వర్షం, ఈదురుగాలులు వచ్చిన సమయంలో విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకుని మంటలు వస్తున్నాయి. బల్బులు మాడిపోతున్నాయి. దీంతో దాదాపు ఎక్కువ రోజులు వీధి దీపాలు వెలగని పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై గ్రామసర్పంచ్ కరణం రమేష్‌బాబు ఎన్ని సార్లు అర్జీలు అందజేసినా విద్యుత్‌శాఖ నుంచి ఎలాంటిస్పందన లేదు. లోవోల్టేజీ, హై ఓల్టేజీతో గృహోపకరణాలు మాడిపోతున్నాయి. కొద్దిరోజుల క్రితం గ్రామంలోని అన్ని వీధి స్తంభాలకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు. ఇటీవల వీచిన గాలులకు విద్యుత్‌తీగల రాపిడి జరగటంతో సుమారు 200వీధి దీపాలు మాడిపోయాయి. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన గ్రామంలో కొత్త లైన్లు ఏర్పాటు చేసి మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక

కనిగిరి : జిల్లా స్త్రీ, పురుషుల ఖోఖో జట్ల ఎంపిక ఈనెల 28న పంగులూరులోని మాగుంటు సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ కళాశాలలో ఎంపిక చేయనున్నట్టు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు కె.భాస్కరరావు, బీ. కాశీవిశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు కృష్ణా జిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే 51వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 18 ఏళ్లు దాటిన వారై ఉండాలని సూచించారు.

అందని అప్పులు-రైతుకు తిప్పలు

వ్యవసాయ పెట్టుబడికి నిధుల కొరత-పట్టించుకోని జిల్లా యంత్రాంగం



కనిగిరి సహకార బ్యాంకు

కనిగిరి : వ్యవసాయ సాగుకు అవసరమైన పెట్టుబడి లేకపోవడంతో రైతులు సతమతమవుతున్నారు. వ్యవసాయ సీజన్‌లో ఏటా పంట రుణాలు ఇచ్చే వివిధ బ్యాంకులు, సహకార సంఘాలు ఈ ఏడాది సహకరించకపోవడంతో రైతులు విలవిల్లాడిపోతున్నారు. చేతుల్లో డబ్బు లేక...బ్యాంకులు అప్పులు ఇవ్వకపోవడంతో వారు తల్లడిల్లిపోతున్నారు. పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయం ఏటా జూదంలా మారింది. కరువు పరిస్థితులు నెలకొనడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించడం, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు నిలువునా నష్టపోతున్నారు. ఆగస్టులో కనిగిరిలో సగటున 100 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 2.34 లక్షల హెక్టార్లు కాగా, లక్ష హెక్టార్ల లోపు మాత్రమే సాగు అయ్యింది. కనిగిరి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 24,035 హెక్టార్లు కాగా, 16,663 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు సాగు చేశారు. కంది, సజ్జ, జొన్న, నువ్వు, అపరాలను రైతులు సాగు చేశారు. కాగా, గత ఏడాది వాణిజ్య బ్యాంకులు పంట రుణాలు ఇవ్వగా, సహకార సొసైటీలు రబీలో అందజేశాయి. ఈ ఏడాది కనిగిరిలో ఒక బ్యాంకు మినహా మిగిలిన వాణిజ్య బ్యాంకులు, సహకార సొసైటీలు రైతులకు పంట రుణాల జోలికి వెళ్లడం లేదు. సహకార బ్యాంకు పరిధిలోని ఆరుమండలాలల్లోని సొసైటీలు ఏటా ఖరీఫ్‌లో సుమారు రూ 4 కోట్ల రుణాలు ఇవ్వవలసి ఉంది.

వాణిజ్య బ్యాంకులు మరో రూ 6 కోట్లు వరకూ రుణాలు ఇస్తుండగా, ఈ ఏడాది ఆ స్పీడ్ లేకపోవడంతో కౌలు రైతులు పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. జిల్లాలో కౌలు రైతులు లక్ష మంది ఉండగా, 16 వందలు మంది రైతులకు మాత్రమే పంట రుణాలు ఇచ్చారు. కనిగిరి ప్రాంతంలో కౌలు రైతులు 10 వేల మంది ఉండగా 50 మంది లోపు మాత్రమే రుణాలు అందుకున్నారు. వ్యవసాయ సాగుకు అవసరమైన పెట్టుబడులు లేకపోవడంతో చిన్నా, సన్నకారులు రైతులు నలిగిపోతున్నారు. వ్యవసాయ రుణాలు పంపిణీ చురుగ్గా సాగితే వ్యవసాయ సాగు మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.

కనికరించని బ్యాంకర్లు

- కొండా వెంకటేశ్వర్లు, రైతు, గోవిందవారిపాలెం



పెట్టుబడి లేక అల్లాడిపోతున్నాం. గిట్టుబాటు ధర లేకపోవడంతో గత ఏడాది పండిన కందులు విక్రయానికి నోచుకోవడం లేదు.ఇళ్లల్లోనే నిల్వలు పేరుకుపోతున్నాయి. తిరిగి కంది సాగు సీజన్ రావడంతో సాగు చేయాలా? వద్దా? అన్న సందేహంలో చిక్కుకున్నాం. పాత కందులు కొనుగోలు లేక పోగా, రైతులకు పంట రుణాలు ఇవ్వక పెట్టుబడులు అల్లాడిపోతున్నారు. వరుణ దేవుడు కరుణించినా బ్యాంకు అధికారులు కనికరించడం లేదు.

ఖరీఫ్ సాగు చేసేదెలా?

- కొండంరాజు, రైతు, కోటతిప్పల



వర్షాలు పడడంతో భూములు పదునెక్కాయి. వ్యవసాయ సాగుకు ప్రభుత్వం పంట రుణాలు మంజూరు చేయకపోవడంతో ఖరీఫ్ సాగు చేసేదెలా తెలియక తల్లడిల్లిపోతున్నాం. మినుము, అలసంద సాగుకు వేళ అయినా, బ్యాంకర్లు మాత్రం రుణాలు ఇవ్వడానికి కొర్రీలు వేస్తున్నారు. రైతు సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు నోరు మెదపకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. రైతునే పట్టించుకోక పోవడంతో ఇంకా ఎవర్ని పట్టించుకుంటారు?

బైకు బోల్తా : ఇద్దరికి గాయాలు

పీసీపల్లి : ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన పెద అలవలపాడు గంగ సమీపంలో ఆదివారం జరిగింది. వడ్డెపాలేనికి చెందిన బాలకొండయ్య, వెంకటయ్య గంగ గుడి వద్దకు వెళ్లాడు. అక్కడికి చేరుకునే సరికి మహిళ అడ్డురావడంతో బైకు అదుపు తప్పింది. దీంతో వారద్దరూ గాయపడగా, 108 ద్వారా కనిగిరి వైద్యశాలకు తరలించారు.

గుంటుపల్లిలో ముగ్గుల పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన నాగలక్ష్మి ముగ్గు

పీసీపల్లి : వినాయకచవితి సందర్భంగా గుంటుపల్లిలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వినాయక మండపాల కమిటీ నిర్వాహకులు ఈ పోటీలను చేపట్టారు. ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులను బి. నాగలక్ష్మి, బి. గాయత్రి, ఎం. స్రవంతి కైవసం చేసుకున్నారు.

తలకొండపాడులో గణపతి లడ్డూ వేలం

పీసీపల్లి : తలకొండపాడు గణేష్ లడ్డూను ఆదివారం వేలం వేయగా, ఓ భక్తుడు రూ.64వేలకు దానిని దక్కించు కున్నాడు. మండలంలో కమిటీ సభ్యులు స్థానిక చెరువుల్లో వినాయక విగ్రహాన్ని దానిని నిమజ్జనం చేశారు. తలకొండపాడు పడమటిబజారులో వినాయక స్వామి 5 కేజీల లడ్డును వేలం పాట నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన చెన్నుపాటి బ్రహ్మయ్య రూ. 64వేలకు దానిని దక్కించుకున్నాడు. అలాగే చీరుకూరివారిపల్లిలోని ఆరున్నర కేజీల లడ్డును అదే గ్రామానికి చెందిన నెలకుర్తి రమణయ్య రూ. 40వేలకు దక్కించుకున్నాడు.వినాయక లడ్డు పొలాల్లో జల్లుగుంటే అధిక దిగుబడులు సాధించ వచ్చునన్న ఉద్దేశంతో రైతులు పోటీపడి వేలం పాట ద్వారా దానిని దక్కించుకుంటున్నారు. నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సినిమాలు

కనిగిరి

శ్రీనివాస : జయ జానకి నాయక



ఫర్నిచర్ షాపును ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ దారపనేని

ముస్లింలు మరింత అభివృద్ధి చెందాలి

పామూరు : ముస్లింలు వ్యాపార రంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సూచించారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ ఫర్నిచర్ అండ్ ఎలక్ట్రానిక్ షోరూమ్‌ను ఆదివారం ఏఎంసీ చైర్మన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పామూరులో పట్టణంలో షోరూమ్ ఏర్పాటు చేసిన కె. ఖాజావలిని ఆయన అభినందించారు. మైనార్టీల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కార్యక్రమంలో బులియన్ మార్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ రాజా, వార్డు మాజీ సభ్యుడు ఓగూరి నరసింహరావు, ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు, వైస్‌ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సర్పంచ్ డీవీ మనోహర్, ఎంపీటీసీ సభ్యులు యూ. హరిబాబు, షేక్ రషీద్, కోఅప్షన్ షేక్ ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న జీపీ రామారావు

కనిగిరి : వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం నిదులు కేటాయించాలని, ప్రాజెక్టు పూర్తయితేనే జిల్లా సస్య శ్యామలం అవుతుందని నియోజకవర్గం వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జీపీ రామారావు అన్నారు. స్థానిక కాశిరెడ్డినగర్‌లో ఆదివారం ఎం. కొండయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి సయ్యద్ జిలాని మాట్లాడుతూ పట్టణంలో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. టీడీపీ కాంట్రాక్టర్లకు బిల్లులు అవుతున్నాయి తప్ప నీటి సమస్య తీరడం లేదన్నారు. సమావేశంలో షేక్ గులాం హుస్సేన్, పోలయ్య,నాగమ్మ, శ్రీలక్ష్మి, శ్రీనివాసులు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా అందజేత

పామూరు : అంకాలమ్మ వీధికి చెందిన ఇండ్లా పెద్దయ్య, కరెంట్ ఆఫీసు కాలనీకి చెందిన షేక్ మస్తాన్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. చంద్రన్న బీమా పథకంలో వారి పేర్లు నమోదు కావడంతో ప్రభుత్వం తొలి విడతగా మంజూరు చేసిన రూ.5వేలు చొప్పున పెద్దన్న భార్య జయమ్మ, మస్తాన్ భార్య రషీదాకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యూ. హరిబాబు, సీపీఎం నేతలు ఎస్డీ హనీఫ్, ఏఎంసీ డైరెక్టర్ ఎన్.సాంబయ్య, మండల సమైక్య అధ్యక్షురాలు ఏ.సుభాషిణి, బీమా మిత్ర సుజాత పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి

పామూరు : మదర్ థెరిస్సా జయంతి వేడుకలను స్థానిక కేజీబీవీ పాఠశాలలో స్వయం కృషి సేవాసంస్థ ప్రతినిధులు ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఇతరుల పట్ల ప్రేమా అనురాగం, కరుణ కలిగివుండాలని, సేవకు స్ఫూర్తి మదర్ థెరిస్సా అని అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ చెప్పాడు. కార్యక్రమంలో ఎస్వో ఆర్. శిరీషా, సయ్యద్ జిలాని, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళులు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు ఎస్డీ హనీఫ్

నిరుద్యోగులపై నిర్లక్ష్యం

పామూరు : నిరుద్యోగుల సంక్షేమాన్ని టీడీపీ ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎస్డీ హనీఫ్ ఆక్షేపించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బాబు వస్తే జాబు గ్యారంటీ అను నినాదంతో నిరుద్యోగుల ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చి తీరా మోసం చేశారన్నారు. కార్యక్రమంలో షేక్ మీరావలి, ఉసా వెంకటేశ్వర్లు, అల్లాబక్ష్, ఎం. వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి,చాంద్‌బాషా, మహబూబ్‌పీరా, మండ్లా మంగమ్మ, ఉసా రాజ్యం, ఎస్‌డి షమ్మీ పాల్గొన్నారు.

రాజంపల్లిలో వినాయక లడ్డూ వేలం

రాజంపల్లి(దర్శి) : రాజంపల్లిలో వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా స్వామివారి లడ్డూకు ఆదివారం వేలంపాట నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఫణిదపు చిన్నవెంకటరామయ్య దానిని రూ.1.50 లక్షలకు దక్కించుకున్నారు. రాజంపల్లిలో మూడురోజులపాటు ఉత్సవాలను నిర్వహించి ఆదివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులు లడ్డూకోసం పోటీ పడ్డారు. లడ్డూ ధర రూ.1.50 పలకడంతో నిర్వాహకులు సందడి చేశారు. దర్శి పట్టణంలోని ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డూపాట రూ.18వేలు పలికింది. పరుచూరి సుబ్బయ్య దానిని దక్కించుకున్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు

31 లోపు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

దొనకొండ : చందవరం పంచాయతీ పరిధిలో ఇళ్ల లబ్ధిదారులు ఈ నెల 31లోపు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే రద్దు చేస్తామని ఎంపీపీ నాగులపాటి గాలెమ్మ,శివకొటేశ్వరరావు చెప్పారు. గ్రామ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీపీ మాట్లాడారు. అర్హులందరికీ టీడీపీ ప్రభుత్వం దశలవారీగా పథకాలను మంజూరు చేస్తోందన్నారు. వర్క్ఇన్‌స్పెక్టర్ ఏసుబాబురెడ్డి మాట్లాడుతూ చందవరంలో పీఎంజీవై పథకం కింద మొత్తం 39 మంది లబ్ధిదారులు ఉన్నారని, ఒకొక్కరికి రూ.2లక్షలు మంజూరవుతుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు యగ్గోని యల్లారెడ్డి పాల్గొన్నారు.

దళిత సమస్యలపై నిర్లక్ష్యం

తాళ్లూరు : దళిత సమస్యలపై పోలీసులు నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని దళిత హక్కుల పరిరక్షణకమిటీ జిల్లా అధ్యక్షుడు నీలంనాగేంద్రం కోరారు. చింతలపాలెం, నాగంబొట్లపాలెం గ్రామాలను ఆయన సందర్శించారు. చింతలపాలెంలో దళితులు సాగుచేసుకుంటున్న 16 ఎకరాల భూమిలో 4 ఎకరాలను అగ్రకులానికి చెందిన వారు సాగు చేసుకుంటున్నా, పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దళిత హక్కులకు భంగం కల్గిస్తున్న వారిపట్ల మెతకవైఖరి అవలంబిస్తున్నారని ఆక్షేపించారు. నాగంబొట్లపాలెంలో దళితవాడకు చెందిన గర్నెపూడి అశోక్ మృతి చెందగా పోలీసులు హత్యకేసుగా నమోదు చేసినప్పటికీ, నిందితులను గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా పోలీసులు దళితులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళితనేతలు కొండమూరి ప్రకాష్, మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, దళిత చైతన్యపరిశోధకులు ఆదినారాయణ పాల్గొన్నారు.

దళితులు ఐక్యతతో వ్యవహరించాలి

తాళ్లూరు : దళితులంతా ఐక్యతతో వ్యవహరించాలని దళిత హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు నీలంనాగేంద్రం పిలుపు నిచ్చారు. ఆదివారం తాళ్లూరు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 1994లో చంద్ర బాబు నాయుడు ఎమ్మార్పీఎస్‌ను ప్రోత్సహించి మందా కృష్ణను పెంచి పోషించారన్నారు. సమా వేశంలో కొండమూరి ప్రకాష్, దారా అంజయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దర్శి సినిమాలు

వెంకటేశ్వర : ఫిదా
శ్రీనివాస : లై
శివశంకర్ : జయ జానికి నాయక
భాస్కర్ : నేనే రాజు నేనే మంత్రి

అడుగంటిన ఎన్‌ఏపీ చెరువు

పది రోజుల్లో నిలిచిపోనున్న మంచినీటి సరఫరా : 112 గ్రామాల ప్రజలకు ఇక్కట్లు



అడుగంటిన దర్శి ఎన్‌ఏపీ చెరువు



పనిచేయని ఫిల్టర్ బెడ్లు

దర్శి : దర్శి ఎన్‌ఏపీ చెరువు అడుగంటిపోయింది. చెరువు అడుగు భాగాన నిల్వ ఉన్న నీరు కేవలం పదిరోజులకు మాత్రమే సరిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో 112 గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోనున్నదని పలువురు ఆందోళన చెందుతున్నారు. దర్శి ఎన్‌ఏపీ నీటి పథకం పరిధిలోని దర్శి, ముండ్లమూరు, పొదిలి మండలాల ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎన్‌ఏపీ చెరువులో నీరు అడుగంటినా, తాగునీటి అవసరాలకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదు. సాగర్ జలాలతో మంచినీటి చెరువులు నింపాలని పలువురు సూచిస్తున్నారు. ప్రస్తుతం దర్శి ఎన్‌ఏపీ చెరువులో 150 మిలియన్ లీటర్ల నీరు మాత్రమే ఉంది. అడుగుభాగాన ఉన్న నీరు బురదగా ఉంది. ఆ నీరు తాగునీటి అవసరాలకు ఉపయోగపడదని పలువురు భావిస్తున్నారు. రోజుకు 10 మిలియన్ లీటర్ల నీటిని వివిధ గ్రామాలకు అందించాల్సి ఉంది. 10 రోజుల తర్వాత చెరువు ఎండిపోతే 112 గ్రామాల ప్రజలకు మంచినీటి తిప్పలు తప్పవనిపిస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను తాగునీటి సమస్యపై వివరణ కోరగా నీటి సమస్యపై ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదించామని చెప్పారు. ఏదిఏమైనా నీటిఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

నేటి నుంచి పశువులకు టీకాలు

దొనకొండ : మండలంలోని వివిధ గ్రామాల్లోని పశువులకు సోమవారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తామని మండల పశువైద్యధికారి ఎం మణిశేఖర్ తెలిపారు. గ్రామాల్లో నిర్వహించనున్న శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ఆహార సలహా సంఘం సమావేశం

దొనకొండ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 4గంటలకు మండల ఆహార సలహా సంఘం సమావేశం కందుకూరు ఆర్డీవో మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ కావేటి వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానిక మండలంలోని ఆహార సలహా సంఘ సభ్యులతోపాటు మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రేషన్ డీలర్లు హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.

అధ్వానంగా దర్శి రహదారి

దొనకొండ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దొనకొండ-దర్శి ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో వాహన చోదకులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. గంగదేవిపల్లె గ్రామ సమీపంలోని మల్లెల వాగు చప్టాపై వర్షం నీరు ప్రవహించడంతో రహదారికి ఇరువైపుల మట్టి కొట్టుకుపోయింది. దీంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.



ప్రమాదకరంగా తయారైన దర్శి రహదారి

పీవీ పాలెంలో దెబ్బతిన్న కాజ్‌వే

రక్షణ గోడలు శిథిలం • వాహనాల రాకపోకలకు ఇక్కట్లు



వీరాయపాలెం రోడ్డులో దెబ్బతిన్న కాజ్‌వే

కురిచేడు : పడమర వీరాయ పాలెం గ్రామానికి వెళ్ళే దారిలో కాజ్‌వే దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు చాలావరకూ దెబ్బతింది. రోడ్డుతో పాటుగా కాజ్‌వే కింది భాగంలో ఉన్న మట్టి కూడా కొట్టుకుపోవడంతో కాజ్‌వే సిమెంట్ భాగం విరిగిపోయింది. వాహనాలు వెళ్లాలంటే ప్రమాదకరంగా తయారైంది. పడమర వీరాయపాలెం నుంచి వినుకొండ వెళ్లాలంటే ఈ రోడ్డు మీదగానే వెళ్లాలి. రాత్రిపూట ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాజ్‌వే సిమెంట్ లైనింగ్ సైతం దెబ్బతింది. అక్కడక్కడా పగుళ్లు వచ్చాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. రక్షణ గోడలు సైతం దెబ్బతిన్నాయి. వెంటనే మరమ్మతులుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నిమజ్జనోత్సవంలో భక్త జనం

గణ నాథుడికి కోటి వందనాలు

దర్శి : దర్శి మండలంలో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వినాయక చవితి సందర్భంగా గత శుక్రవారం నెలకొల్పిన విగ్రహాలకు ప్రతి రోజూ భక్తులు పూజలు చేస్తున్నారు. మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆరంభమైన నిమజ్జనాలు : వినాయక విగ్రహలను ఆదివారం పలువురు నిమజ్జనాలు చేశారు. ఈ ఏడాది సాగర్ కాల్వలకు నీరు విడుదల చేయకపోవడంతో గుండ్లకమ్మనదిలో, ముసీ నదిలో విగ్రహలను నిమజ్జనం చేస్తున్నారు. మరి కొందరు చెరువుల్లో నిమజ్జనం చేస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు స్ఫూర్తిదాయకం

దర్శి : స్వచ్ఛంద సంస్థలు నిస్వార్థంతో సేవలు అందించడం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేర్కొన్నారు. స్థానిక పీజీఎన్ తాలూకా క్లబ్‌లోని కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన దర్శి లైన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. నూతన కార్యవర్గం భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినేని మోహన్‌రావు మాట్లాడుతూ చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తామన్నారు. దర్శిలో చిన్నారుల పార్క్ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తే రూ.4లక్షల విలువైన ఆటవస్తువులను సమకూర్చుతామన్నారు. దర్శి లైన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, కార్యదర్శిగా బూదాటి ఆంజనేయులు, కోశాధికారి జి శ్రీనివాసరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. దర్శి ఏఎంసీ చెర్మన్ సూరె చిన్నసుబ్బారావు, దర్శి సర్పంచ్ జీసీ గురవయ్య, లైన్స్ క్లబ్ జీఎల్‌టీ కో ఆర్డినేటర్ పి విజయ్‌కుమార్‌రెడ్డి, క్యాబినేట్ సెక్రటరీ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, రీజనల్ చైర్మన్ కె.రమేష్, జోనల్ చైర్మన్ నాగేశ్వరరావు, సంఘసేవకుడు జీవీ రత్నం పాల్గొన్నారు.



లైన్స్‌క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

నేడు ఫుడ్ కమిటీ సమావేశం

సింగరాయకొండ : తహసీల్దారు కార్యాలయంలో కందుకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన సోమవారం సాయంత్రం మండల స్థాయి ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కామేశ్వరావు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నుంచి మండల బాధ్యులు అధికారులు, చౌకదుకాణ డీలర్లు తప్పక హాజరుకావాలన్నారు.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

శ్రీ పోలేరమ్మతల్లికి మొక్కులు

జరుగుమల్లి : భక్తుల కొంగుబంగారంగా నిలచిన శ్రీ పొలేరమ్మతల్లి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మెక్కులు తీర్చారు. కోర్కెలు తీరాక భక్తులు పోలేరమ్మకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్లు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక ఇతర జిల్లాలకు చెందిన భక్తులు పోలేరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.

యమపాశాలు

- కర్రలపైనే విద్యుత్ తీగలు
- నిలువునా పోతున్న ప్రాణాలు
- అన్నదాతకు నిబంధనల సంకెళ్లు

మర్రిపూడి :విద్యుత్ కనెక్షన్ మంజూరులో ఆన్‌లైన్ విధానం అన్నదాతల పాలిట శాపంగా మారింది. విద్యుత్ కనెక్షన్ కోసం అన్నదాతలు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనలు విద్యుత్ వినియోగదారులకు అశనిపాతంగా మారింది. ఆన్‌లైన్ విధానం వల్ల విద్యుత్ కనెక్షన్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో కొందరు అన్నదాతలు పంటలను దక్కించుకోవాలనే ఉద్దేశంతో అక్రమంగా విద్యుత్ కనెక్షన్లలను వాడుకుంటున్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే వరకు ఆగలేక కొన్ని గ్రామాల్లో పార్లాంగ్ దూరం నుంచి కర్రల సహాయంతో సొంతంగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఇటీవల విద్యుత్ ప్రమాదాలు తరుచుగా చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు మండలంలో 500 మందికి పైగా రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. క్రమపద్ధతి ప్రకారం అంచనాలు తయారు చేసి కనెక్షన్లు మంజూరు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామని ఏఈ మోహన్‌రెడ్డి చెప్పారు. అయితే పలు గ్రామాల్లో రైతులు కనెక్షన్లు వచ్చే వరకు ఆగకుండా సొంతంగా విద్యుత్ కనెక్షన్లను లాక్కోవడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా మూగజీవాలు విద్యుత్ తీగలకు బలై మృత్యువాత పడుతున్నాయి. ఈ నెలలో విద్యుత్ ప్రమాదాలు కారణంగా మండలంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మర్రిపూడి చెందిన నరసయ్య అనే దళిత రైతు వరినారుమడికి నీరు పెట్టేందుకు వెళ్ళి విద్యుత్ ఘాతంతో అక్కడిక్కడే మృతి చెందాడు. తిరిగి వారం తిరగకుండానే నరసాపురం గ్రామానికి చెందిన తల్లపునేని నరేష్ అనే యువరైతు విద్యుత్ ప్రమాదంతో మృత్యువాత పడ్డాడు. 2 నెలల క్రితం కూచిపూడి సెంటర్‌లో విద్యుత్ ప్రమాదాలు జరిగి గేదె మృతి చెందింది. ఇదే నెలలో మర్రిపూడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట షాక్‌కు మరో గేదె మృతిచెందిన సంఘటన విద్యుత్ ప్రమాదాల తీవ్రతను తేటతెల్లం చేస్తుంది. నిబంధనల పేరుతో విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయడంలో జాప్యం చేయడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కర్రల సహాయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లపై సమగ్ర సర్వే చేసి స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసి అదనపుగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ ప్రమాదాలను నివారించాలి.



షాక్ గురై మృతిచెందిన నరసయ్య (ఫైల్‌ఫొటో)



తాటి మన్నుపై విద్యుత్ తీగలు



మాట్లాడుతున్న హనుమారెడ్డి

అగ్రిగోల్డ్ బాధితుల కోసం న్యాయ పోరాటం

కొండపి: అగ్రిగోల్డ్ ఏజంట్లు, కస్టమర్లకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిందేనని అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్లు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బి. హనుమారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం కొండపిలో జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకుడు బెల్లం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హనుమారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం చేయలేదని విమర్శించారు. ఆత్మహత్యలకు పాల్పడ్డ పలువురు అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయలేదని ఆయన విమర్శించారు. ఉద్యమాలకు బాధితులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో హనుమంతరావు, గురవయ్య, బాధితులు పాల్గొన్నారు.

రావూరి కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరం ముందు బారులు తీరిన వృద్ధులు

టంగుటూరు: స్థానిక రావూరి వినీలా మెమోరియల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం చెల్లెమ్మతోటలోని బ్రహ్మంగారి గుడి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. కంటి వైద్య పరీక్షలకు హాజరైన 235 మందికి కంటి పరీక్షలు జరిగాయి

కంటి పరీక్షలు చేసిన వైద్యులు పరీక్షలు చేయించుకున్న వారిలో 150 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు.వెంటనే వీరందరినీ ప్రత్యేక వాహనంలో గుంటూరులోని శంకర కంటి ఆసుపత్రికి తరలించారు.వీరికి కంటి ఆపరేషన్లు చేయించి తిరిగి సోమవారం టంగుటూరు తీసుకొస్తారు.

వైద్య పరీక్షలు చేసిన వారిలో శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు తేజస్విని, సైదులు, చంద్రశేఖర్ ఉన్నారు. కార్యక్రమంలో రావూరి వినీలా మెమోరియల్ ఫౌండేషన్ అధినేత రావూరి తిరుమల రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

అధ్వానంగా పాలేటిపాడు, వావిలేటిపాడు అంతర్గత రహదారులు

జరుగుమల్లి : పాలేటిపాడు, వావిలేటిపాడు గ్రామంలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ప్రతి ఏటా ప్రభుత్వం పంచాయతీల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న వాటి వినియోగంలో పాలకుల అశ్రద్ధ కనిపిస్తుంది. వర్షాలు కురిస్తే ఈ రహదారులపై నడిచేందుకు కూడా వీలులేదని ఆయా గ్రామాల ప్రజలు కాలనీ వాసులు వాపోతున్నారు. వర్షాలకు రహదారులు చిత్తడి చిత్తడిగా మారడంతో పాటు వర్షపు నీరు రహదారులపై ఉన్న గుంతలలో నిల్వ ఉండి దుర్వాసన వస్తున్నాయని వివరించారు. ఈ మురుగు నీటితో పాటు దోమల బెడద అధికగా పాలకులుకు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు వివరిస్తున్నారు.గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి రొడ్లపరిస్థితి దయనీయంగా మారింది. పాలకులు దృష్టి రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పాలేటిపాడులో బురద మయంగా రామాలయం వీధి

పాకల తీరంలో నిమజ్జనాల సందడి



తీరానికి తరలుతున్న గణనాథులు

సింగరాయకొండ రూరల్: మండలంలోని వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదిదేవుని ఆరాధించిన భక్తులంతా ఆదివారం మూడవ రోజు ప్రతిమలను పాకల సముద్రంలో 200లకు పైగా ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చెరువులు, నదులలో తగినంత వర్షాలు లేకపోవడంతో నీరు లేక కనిగిరి, కందుకూరు, కొండపి తదితర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున మండలంలోని పాకల తీరంలో నిమజ్జనం చేశారు. పట్టణంలో మొదటగా మేళతాళాలు, భాజాభజంత్రీలు, మైక్‌సౌండ్‌ల నడుమ భారీ ఎత్తున ఊరేగింపు చేపట్టారు. పిల్లలు, మహిళలు, యువకులు సందడితో ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే నెలకొంది. తీరంలో సీఐ భీమానాయక్, ఎస్ఐ హజరత్తయ్య ఎస్పీ ఆదేశాల మేరకు నిమజ్జనానికి భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. గణేష్ కమిటీలు మరియు యువకులు ఎవరైనా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే మత్తుపానియాలు సేవించి నిమజ్జనాలు చేయకూడదని పోలీసులు దగ్గరుండి వినాయక నిమజ్జన కార్యక్రమంలో పర్యవేక్షించారు.

సింగరాయకొండ: వినాయకచవితి సందర్భంగా గత రెండురోజులుగా వాడవాడలా పూజలందుకుంటున్న గణనాధులు చాలా వరకు మూడోవ రోజైన ఆదివారం మధ్యాహ్నం నుంచే నిమ్మజ్జనానికి బయలుదేరి వెళ్లాయి.ఈ సందర్భంగా బాణా మేళాతాళాలతో పాకల సముద్ర తీరానికి వెళ్లాయి. మండలం నుంచే కాక చుట్టు పక్క మండలాలైన జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు, కందుకూరు మండలాల నుంచి గణనాధులు నిమజ్జనానికి తీరానికి తరలివచ్చాయి. దీంతో తీరంలో సందడి వాతావరణం నెలకొంది.

లంబోదరుడికి ఘనంగా పూజలు

కొండపి: వినాయక విగ్రహాల వద్ద పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు మూడో రోజు ఆదివారం ఘనంగా జరుగుతున్నాయి. కొండపిలోని కమ్మపాలెంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద చుండూరి కామయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. రాత్రికి వినాయకుడిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. యువకులు బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ నినదించారు. బాణాసంచా, తపెట్లు, మేళతాళాలతో వినాయకుడిని ఊరేగించారు. ఊరేగింపులో గ్రామస్తులు వినాయకుడికి వార్లుపోసి టెంకాయలు కొట్టారు. సోమవారం సముద్రంలో వినాయకుడిని నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు 1530 మందికి ఇంటర్వ్యూలు

గుడ్లూరు: ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ రుణాలు పొందేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 1530 మంది దరఖాస్తుదారులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపిడిఓ ।నివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు బ్యాంకు మేనేజర్లతోటి సబ్సిడీ రుణాలు మంజూరు చేసే వివిధ కార్పోరేషన్ల ప్రతినిధులు హాజరౌతారని ఎంపిడిఓ తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఎంపికైన లబ్దిదారులకు సబ్సిడీ మంజూరైన ఇంత వరకు రుణాలు అందజేయలేదని కొందరు లబ్దిదారులు విమర్శిస్తున్నారు.

నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు

ఉలవపాడు(కందుకూరు): గణేష్ నవరాత్రులలో భాగంగా మూడవ రోజు శుక్రవారం వినాయకుని విగ్రహాలను గ్రామాలలో మండలంలోని పలు గ్రామాలలో పురవీధులలో ఊరేగించి అనంతరం మండలంలోని సముద్రతీర ప్రాంతమైన కరేడు, రామాయపట్నం తదితర చోట్ల గణేష్ నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. తీరంలో దాదాపు 20 విగ్రహాల వరకు నిమజ్జనానికి వచ్చాయి.పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ గణేష్ మహరాజ్‌కి జై అంటూ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మండలం నుంచే ఇతర మండలాల నుంచి కూడా వినాయకుని విగ్రహాలను సముద్రప్రాంతానికి భారీగా తీసుకొని రావడంతో సముద్రతీరం వద్ద సందడి నెలకొంది.

గుడ్లూరు: మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన ముర్తింపేట, రావూరు, కర్లపాలెం, ఆవులవారిపాలెం, మొండివారిపాలెం, తెట్టు, గుడ్లూరు ఎస్సీ కాలనీకు చెందిన మొత్తం 14 వినాయక విగ్రహాలను నిర్వాహకులు ఆదివారం స్థానిక రామాయపట్నం సముద్రంలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా వినాయక విగ్రహాలను కోలాహలంగా ఊరేగిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాల నడుమ సాగరతీరానికి వినాయక విగ్రహాలు భారీ ఎత్తున తరలి వెళ్ళాయి.

లింగసముద్రం: మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఆదివారం పలు గ్రామాలలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వీఆర్‌కోట, లింగసముద్రం పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన వారు వినాయక విగ్రహాలను లింగసముద్రంలోని కొత్త చెరువు, రాళ్లపాడు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. లింగసముద్రంలోని ఆర్యవైశ్యులు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఒక్క రోజే మండలంలో సుమారు 20 విగ్రహాల వరకు నిమజ్జనం చేశారు.



కరేడులో నిమజ్జనానికి తరలి వెళ్తున్న దృశ్యం



లింగసముద్రంలో ఉట్టికొడుతున్న యువకులు



లింగసముద్రంలో నిమజ్జనానికి వెళ్తున్న వినాయక విగ్రహాలు



వలేటివారిపాలెంలో బోర్ల కింద చేపట్టిన వరినారుమడులు

ముమ్మరంగా వరి నారుమడులు

వలేటివారిపాలెం: మండలంలోని అంకభూపాలపురం, రామచంద్రాపురం, లింగపాలెం, వలేటివారిపాలెం, ఉప్పలపాడు, వీరన్నపాలెం, పెద్దఅమ్మపాలెం, పోలినేనిచెరువు, గరుకుపాలెం, అయ్యవారిపల్లె, కాకర్లపాలెం, చుండి తదితర గ్రామాలలోని వ్యవసాయ బోర్ల కింద ముమ్మరంగా వరినార్లు పోస్తున్నారు. ఇటీవల అప్పుడప్పుడు కురిసిన ఓ మోస్తారు వర్షాలకు భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీళ్ళు వస్తున్నాయి. దీంతో వరినారు మడులకు అదును దాటిపోతుందనే ఉద్దేశంతో ఆయా గ్రామాలలో వరినార్లు పోస్తున్నారు. అదునులో వరినారుమళ్ళు పోస్తే తెగుళ్ళు కూడా ఆశించవని రైతులు చెబుతున్నారు. వర్షాలు కురిసి భూగర్భ జాలాలు పెరిగి బోర్లలో నీళ్ళు పుష్కలంగా వస్తే అదునులో వరినాట్లు వేసుకోవచ్చుననే ఉద్దేశంతో రైతులు వరినారు మడులకు సమాయత్తమవుతున్నారు. ఆయా గ్రామాలలోని కొంతమంది రైతులు 20 రోజులు ముందుగానే వరినార్లు పోశారు. వారందరూ వరినాట్లు వేస్తున్నారు. అయితే వాగులు, వంకలు, చెరువుల కింద రైతులు వర్షంపై నమ్మకం లేక వరినార్లు పోయడం లేదు.



అంకభూపాలపురంలో అలంకారప్రాయంగా పంచాయతీ కార్యాలయం

వినియోగం లేక నిరుపయోగంగా పంచాయతీ కార్యాలయం

అంకభూపాలపురం(వలేటివారిపాలెం): మండలంలోని అంకభూపాల పురంలోని పంచాయతీ కార్యాలయం వినియోగం లేక నిరుపయోగంగా మారింది. పంచాయతీ కార్యకలాపాల నిమిత్తం 2006వ సంవత్సరంలో సుమారు 2లక్షలతో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. అప్పటి నుండి పంచాయతీ కార్యాలయం భవనం వినియోగం లేక నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతుంది. పంచాయతీ భవనాన్ని గ్రామంలో కొంతమంది తమ సొంతానికి వినియోగించుకుంటున్నారు. పంచాయతీ కార్యాలయంలో ఏ ఒక్కరోజైనా పంచాయతీ సభ్యులు సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం వృధా అయింది. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో పంచాయతీ కార్యాలయం నిరుపయోగంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పంచాయతీ కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జన్మభూమి కమిటీ సభ్యుల తీర్మానం లేకుండానే నీరు-ప్రగతి పనులు

వలేటివారిపాలెం: మండలంలోని చిన్నఅమ్మపాలెం పంచాయతీ బంగారక్కపాలెంలో ఆ పంచాయతీ జన్మభూమి కమిటీ సభ్యుల తీర్మానం లేకుండానే నీరు-ప్రగతి పథకంలో సుమారు 30 లక్షల రూపాయలతో మూడు చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నారని ఆ పంచాయతీ జన్మభూమి కమిటీ సభ్యులైన సర్పంచ్ వరికూటి సంజీవరెడ్డి, డ్వాక్రా మహిళలు భైరబోయినలక్ష్మి, జయంపు అంకమ్మలు ఒక ప్రకటనలో తెలియజేశారు. పంచాయతీలో జన్మభూమి కమిటీ సభ్యులు సమావేశం ఏర్పాటు చేయలేదని, సమావేశమే ఏర్పాటు చేయకుండా తీర్మానం ఎవరిచ్చారని ప్రశ్నిస్తున్నారు. తమ సంతకాలను ఫోర్జరీ చేసి నీరు-ప్రగతి పథకంలో చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నారని తెలిపారు. దీనిపై సంబంధిత శాఖాధికారులపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మిలీనియం మార్చ్‌ని జయప్రదం చేయండి

కందుకూరు: కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సిపిఎస్) ద్వారా 2004 సెప్టెంబరు 1 నుండి నియమితులైన ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేనందున సిపిఎస్ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు , ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి వై. హృదయరాజు డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బొప్పరాజు గురవయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరైన హృదయరాజు ఆదివారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహిస్తున్న మిలీనియం మార్చ్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేలాదిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పివి సుబ్బారావు, నాయకులు ఎం.రాఘవరావు, కెవిజి కీర్తి, బి.అశోక్ కుమార్, ఆంజనేయులు, వెంకట చలపతిరావు, కృష్ణ మోహన్, ప్రభాకరరావు, లక్ష్మీనారాయణ, హనుమంతరావు, ఐ.వి.సుబ్రహ్మణ్యం, మధు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి వ్యాక్సిన్ వివరాలు

వలేటివారిపాలెం: మండలంలోని వలేటివారిపాలెం, పోకూరు పశువైద్యశాలల పరిధిలోని గ్రామాలలో గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్ వివరాలు ఇలా ఉన్నాయి. 28న వలేటివారిపాలెం, 29,30,31న పోకూరు, పోలినేనిపాలెం, సెప్టెంబర్1,2న శాఖవరం, జమీన్ ఉప్పలపాడు, 3,4 కొండసముద్రం,అమ్మపాలెం, 5,6న శామీరపాలెం, చుండి, 7,8,9న నేకునాంపురం, పోలినేనిచెరువు, 10,11,12న బడేవారిపాలెం,అంకభూపాలపురం, 13,14,15న కాకుటూరు, లింగపాలెం, 16,17న నూకవరం, అయ్యవారిపల్లి, 18,19న శింగమనేనిపల్లి, 21,22న నలదలపూరు, 23న కొండారెడ్డిపాలెం, 24,25న కళవళ్ళ గ్రామాలలో గాలికుంటు వ్యాధికి వ్యాక్సిన్ వేయనున్నట్లు ఏడిఏ బ్రహ్మయ్య తెలిపారు.ఈ అవకాశాన్ని పశుపోషకులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

పెదపవనిలో నిత్యం ట్రాఫిక్ సమస్య

లింగసముద్రం: మండలంలోని పెదపవని గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుకిరువైపులా మార్జిన్లు ఆక్రమణలకు గురవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్‌లోని రోడ్లపైనే ఆటోలు, ఇతర వాహనాలు నిలిపి ఉంచుతుండడంతో ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు మార్జిన్లు ఆక్రమించి బంకులు కూడా ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య ప్రతినిత్యం వెంటాడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

కందుకూరు : ఏపీటీఎఫ్ కందుకూరు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.గురునాథశర్మ, ఉపాధ్యక్షుడు తలారి సుబ్బారావు తదితరుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌డి మునీర్ బాషా, గౌరవాధ్యక్షునిగా జి.వి.కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా డి.శశికుమార్, ఎస్‌కెఎం హబీబ్, ఎస్‌కె ఆషా, కార్యదర్శులుగా ఎం.వి.మాల్యాద్రి, కె.శామ్యూల్, ఎస్‌కె జిలానిబాషా, కెఎం దేవమణి, జిల్లా కౌన్సిలర్లుగా టి.మల్లికార్జున్, కె.వి.ప్రసాద్, ఆరిబోయిన వెంకటేశ్వర్లు, వి.కమలాకర్, ఎస్.శ్రీనివాసాచారి, సిహెచ్ శ్యామలాకుమారి, ఆడిట్ కమిటీకి సిహెచ్ శ్యాం ప్రసాద్, పి.ప్రసాదరావు, జె.నిర్మలకుమారి, మరో 20 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ ఉద్యమసారథి సింగరాజు రామకృష్ణయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మిలీనియం మార్చ్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ, ఉద్యోగులు తరలిరావాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గురునాథశర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు తలారి సుబ్బారావు, రాష్ట్ర కౌన్సిలర్లు ఆర్.హరిబాబు, కేశినేని వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పి.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

● సినిమాలు

కందుకూరు

రాజ్	- ఫిదా
యువరాజ్	- ఆనందోబ్రహ్మ
ప్రశాంతి	- వీఐపీ-2
కోటేశ్వర	- నేనే రాజు నేనే మంత్రి
రాఘవ స్క్రీన్-1	- వివేకం
రాఘవ స్క్రీన్-2	- అర్జున్‌రెడ్డి

నేడు రుణాలకు ఇంటర్వ్యూలు

వలేటివారిపాలెం : 2017-18వ ఆర్థిక సంవత్స రానికి ఎస్సీ,ఎస్టీ, బీసి కార్పొరేషన్‌ల నుంచి రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న లబ్ధిదారులకు వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో విజయ్‌శేఖర్ తెలిపారు. మండలానికి ఎస్సీలకు 117 యూనిట్లు, ఎస్టీలకు 2, బీసీలకు 50, కాపులకు 15, ముస్లిం మైనార్టీలకు 2 యూనిట్లు మంజూరయ్యాయి. ఆ యూనిట్లకు 455 మంది ఎస్సీలు, 24 మంది ఎస్టీలు, 343 మంది బీసిలు, 23 మంది కాపులు, 9 మంది ముస్లిం మైనార్టీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 854 మంది లబ్దిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సంబంధిత ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలియజేశారు.

కందుకూరు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధి కోసం యాక్షన్ ఫ్లాన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్.శ్రీనివాసన్ ఒక ప్రకటనలో తెలిపారు. 24, 25 తేదీలలో జరిగిన ఇంటర్వ్యూలకు హాజరుకాని వారంతా సోమవారం హాజరు కావచ్చునని ఆయన తెలిపారు. అనంతరం అవకాశం ఉండబోదని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు సోమవారం జరిగే ఇంటర్వ్యూలను సద్వి నియోగం చేసుకోవాలన్నారు.

టంగుటూరు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎం పీడీవో హనుమంతురావు ఆదివారం చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ 2017-018 సమగ్ర కార్యాచరణ పథకం ద్వారా మండలం నుంచి సబ్సిడీ రుణాలకు లబ్దిదారుల ఎంపిక కొనసాగుతుంది. ఇప్పటికే ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ల లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ ముగిసింది. మిగిలిఉన్న ఎస్సీ లబ్దిదారుల ఎంపిక సోమవారం ఉదయం 11 గంటల నుంచి కొనసాగుతుంది. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సుమారు 1400 మంది దరఖాస్తుదారులున్నారు. రుణాల టార్గెట్ 200గా అధికారులు ప్రకటించారు. అర్జీ దారులంతా నిర్ణీత సమయానికి ఎంపికకు హాజరవ్వాలని, బ్యాంకుల అధికారులు, మండల పరిషత్ సిబ్బంది లబ్ధి దారుల ఎంపిక నిర్వహిస్తారన్నారని ఎం పీడీవో చెప్పారు.

అది ఫేక్ ప్రచారం

టంగుటూరు: ఎస్సీ,ఎస్టీ కేసుల్లో ఇక నుంచి అరెస్టులు ఉండవంటూ వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతుంది. ఈప్రచారం నమ్మవద్దని, ఇది బోగస్ ప్రచారమని దళిత రైట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు ఆది వారం కొట్టి పారేశారు.

శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం

కందుకూరు: గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని కందుకూరులో శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు పండితులు, వివిధ కళాశాలల అధ్యాపకులతో పాటు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై తెలుగుభాష గొప్పతనాన్ని కొనియాడారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగుని ఎంచుకుని గత పబ్లిక్ పరీక్షలలో 90శాతంకు పైగా మార్కులతో ఉత్తీర్ణులైన 50 మంది విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పొన్నూరి వెంకట శ్రీనివాసులు తన ఉపన్యాస చతురతతో ఛలోక్తులతో తెలుగు భాషలోని మాధుర్యాన్ని పంచుతూ సభికులను అలరింపజేశారు. నేటి తరం విద్యార్థులు ఆంగ్లభాష మోజులో మాతృభాషలో కనీ స పరిజ్ఞానాన్ని కూడా పొందలేక చదవటం, రాయటంలో తప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవక్త బాల సాహితీవేత్త జి. శివకుమార్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. నేటి విద్యార్థులు ఇంగ్లీషుపై ఎంత పట్టు సాధించినా మాతృభాషపై పరిజ్ఞానం అవసరమన్నారు. ఈ సందర్భంగా తె లుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న కవులు, పండితులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రతిభ విద్యా సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం డి.అనూరాధ, ఎవీఆర్ మూర్తి, ఎస్‌కె జిలానీ బాషా, ఎం. కమలకుమార్, అబ్బూరి వెంకటేశ్వర్లు, టిఆర్ఆర్ కళాశాల తెలుగు ఉపన్యాసకులు ధనలక్ష్మి, వివి శేషయ్య, టి. ఆది శేషు, జీవీ శేషగిరిరావు, యేసుదాస్, సుధీర్, అమీర్‌బాషా, ఆదినారాయణ, అమిరి శెట్టి వెంకటేశ్వర్లు, శ్రీవారి సేవా సమితి నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

శ్రీ చైతన్య విద్యా సంస్థలలో ప్రత్యేక పూజలు

కందుకూరు : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ చైతన్య విద్యాసంస్థలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుని విగ్రహాన్ని విద్యాసంస్థల ఆవరణలో ఏర్పాటు చేసి మూడు బ్రాంచిలలో పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి ఆదివారం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రవీంద్రబాబు, జిలానీబాషా, క్రాంతి, ఏవోలు సురేష్‌నాయుడు, షేక్షావలి, రహీం, రీజనల్ అధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభించిన డీఎస్పీ

కందుకూరు: ఆర్టీసీ డిపోలో కార్గో సేవలను డీఎస్పీ కె.ప్రకాశరావు ఆదివారం ప్రారంభించారు. ఎఎన్ఎల్ పార్శిల్ సర్వీస్‌తో ఆర్టీసీ ఒప్పంద కాలపరిమితి పూర్తవటంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సంస్థ కార్గో సేవలను నిర్వహించతలపెట్టగా కందుకూరు డిపోలో డీఎం శ్రీనివాసశర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ఈ సేవలను ప్రారంభించారు. డీఎం శ్రీనివాసశర్మ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


శ్రీనివాసరావును సత్కరిస్తున్న విద్యార్థులు

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

పొన్నలూరు: ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృ భాషా దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ పొందిన అనంతబొట్ల శ్రీనివాసరావును గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా సన్మానగ్రహీత శ్రీనివాసరావు మాట్లాడుతూ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల పూర్వవిద్యార్థులు తనను గుర్తుపెట్టుకొని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఏవీ సుబ్బారావు, చలం చర్ల సుబ్బారావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

పీసీపల్లి : ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన పెద అలవలపాడు గంగ సమీపంలో ఆదివారం జరిగింది. వడ్డేపాలేనికి చెందిన బాలకొండయ్య, వెంకటయ్య గంగ గుడి వద్దకు వెళ్లాడు. అక్కడికి చేరుకునే సరికి మహిళ అడ్డు రావడంతో బైకు అదుపు తప్పింది.

జోరుగా నంద్యాల గెలుపుపై బెట్టింగులు

కొండపి: నంద్యాల ఉప ఎన్నిక ఫలితంపై కొండపిలో జోరుగా బెట్టింగులు నడిచాయి. కాయ్ రాజా కాయ్ అంటూ మధ్యవర్తులు ఇరు పక్షాలను కలిపి కమీషన్ వ్యాపారం సాగించారు. తొలి నుంచి నంద్యాల ఫలితంపై టీడీపీ రెండు రెట్లు ఇవ్వడానికి సిద్ధ పడ్డారు. వైసీపీ పక్షాన ఎంత పందెం కడితే అంతకు డబుల్ టీడీపీ వారు ఇచ్చారు. దాదాపు కొండపిలో అరకోటికి పైగా పందేలు నడిచాయి. కందుకూరు ప్రాంతం నుంచి వచ్చి కొండపిలో ఆదివారంనాడు పందేలు పెట్టారు. మిగతా ప్రాంతాల్లో సరికిసరి సమానంగా పందెం నడవగా, కొండపిలో టీడీపీ అభిమానులు డబుల్ ఇచ్చారని తెలిసింది. సోమవారం ఫలి తంతో బెట్టింగ్ బ్యాచ్‌లో డీలా పడే దెవరో, ఎగిరిగంతేసే దెవరో తేలనుంది.

నంద్యాల ఫలితాలపై ఉత్కంఠ

టంగుటూరు: నంద్యాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై దేశ వ్యాపితంగా కొనసాగుతున్న ఉత్కంఠత టంగుటూరులోనూ ఉంది. టీడీపీ నాయకులు గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేస్తుండగా, వైఎస్సార్‌సీపీ అభిమానులూ విజయం తప్పక తమనే వరిస్తుందని భావిస్తున్నారు. నంద్యాలతో టంగుటూరు ప్రాంతానికి వ్యాపార సంబంధాలున్నాయి. పొగాకు వ్యాపరపరంగా నంద్యాలతో ఇక్కడి పొగాకు వ్యాపారంతో సంబంధం ఉన్న అనేక మందికి గత అనుబంధం ఉంది. గతంలో నంద్యాల ప్రాంతంలో పొగాకు కొనుగోలుకు ఇక్కడి నుంచి కొందరు వ్యాపారులు వెళ్లివస్తుండేవారు. అందుకే వీరికి నంద్యాల రైతులు, ముఖ్యులతో పరిచయాలున్నాయి. ఎన్నికల ముందు నుంచీ రెండు పార్టీల నాయకులు నంద్యాలలోని తమకు తెలిసిన వారికి ఫోన్లు చేసి సమాచారం తెలుసుకుంటుఉన్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఫలితాలపై చర్చ తీవ్రమైంది. గెలుపుపై అంచనాకు వచ్చినా పరిస్థితి ఎటుమారుతుందోనని అనుమానంగా ఉన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈసారి అధికారికంగా ప్రధానమైన ఎగ్జిట్‌పోల్ సర్వేలేవీ వెలువడలేదు. ఒకట్రెండు సర్వేలు బయటకు వచ్చినా వాటిని ఎవ్వరూ అంతగా విశ్వసించడం లేదు. సోమవారం నంద్యాల ఓట్ల లెక్కింపు ఉన్నందున టీవీలో వీక్షించేందుకు అనేక మంది వారి సొంత పనులను సైతం వాయిదా వేసుకుంటున్నారు.ఉదయం 8గం.లకే లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుంది. మధ్యహానికల్లా ఫలితం వెల్లడి కావచ్చని అధికారుల ప్రకటనలు వెలువడుతున్నాయి.

ఉపాధ్యాయులకు సన్మానం

పొన్నలూరు: మండలంలోని ముండ్లమూరివారిపాలెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బొప్పరాజు పెదగురవయ్య పదవీ విరమణ సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు బి.మాధవరావు మాట్లాడుతూ పాఠశాలకు ఒక్క నిమిషం కూడా ఆలస్యంగా వచ్చిన దాఖలా లేని వ్యక్తి గురవయ్య అని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు మాట్లాడుతూ సొంతఊరులోని పాఠశాలలో ఇలా సన్మానం చేయించుకోవడం చాలా అదృష్టమని అన్నారు.

కార్యక్రమానికి ఆంధ్రా-తెలంగాణలో ఉన్న తమ పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై గురువుగారి గురించి, వారి సే వలను గురించి పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్లూరి పున్నమ్మ, నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి క్రిష్ణయ్య, జిల్లా వాసవీసేవాదళ్ కోశాధికారి చక్కా వెంకటకేశవరావు, ద్రోణాదుల సుబ్రమణ్యం, సంతనూతలపాడు ఎంపీడీవో కోవూరి మాలకొండయ్య, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు జీవీబీ కీర్తి, ప్రధాన కార్యదర్శి డి.అశోక్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.


గురువయ్య దంపతులకు సత్కారం

విజృంభించిన జ్వరాలు

గుడ్లూరు: ఇటీవల కురిసిన కొద్ది పాటి వర్షానికి వాతావరణంలో మార్పు చోటుచేసు కొని గ్రామాలలో జ్వరాలు విజృంభించాయి. వాననీటి నిల్వల వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకరిద్దరికి జ్వరాలు సోకడంతో ప్రవేటు ఆసుపత్రులకు పరుగులు తీ స్తున్నారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో జ్వరాల పీడితులు ఎక్కువగా ఉన్నారు. గ్రా మాలలో సైడు కాలువల్లో పేరుకుపోయిన మురుగు నీటిలో బ్లీచింగ్ చల్లకపోవడంతో దోమల ఉత్పత్తి అధికమై ప్రజలను కుట్టి రో గాలకు కారణమౌతున్నాయి. దోమల నివారణకు వైద్యఆరోగ్యశాఖ వారుకానీ, పంచాయతీ వారుగానీ తగిన చర్యలు తీసు కోవడం లేదని గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు.

స్థానిక ప్రభుత్వ వైద్యఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్ష కేంద్రంలో బాధితులు లేకపోవడంతో ఏ రకం జ్వరాలు వచ్చాయో నిర్ధారణ కాకపోవడంతో దీంతో పేద రోగులు సైతం ప్రవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

ఇదే అవకాశంగా తీసుకున్న ప్రవేటు ఆసు పత్రులు, ఆర్ఎంపి వైద్యులు అధిక ఫీజులు గుంజుతున్నారు. కొందరు ఆర్ఎంపీ డాక్టర్లు మందులు కూడా ఇచ్చేసి రెండు చేతులా సంపాదిస్తున్నారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ వారు జ్వరాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ, బీసి కాలనీలకు చెం దిన ప్రజలు కోరుకుంటున్నారు.

రేపు జిల్లాస్థాయి డ్యాన్స్ పోటీలు

పర్చూరు : వినాయక చవితి సందర్భంగా పర్చూరులోని తూర్పు వారి వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద ఈనెల 29న డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్టు గణేష్ ఉత్సవ కమిటీ నిర్వహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.50116, రెండో బహుమతి రూ.3116, మూడో బహుమతి రూ.2116 అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకున్నవారు తమ పేర్లను ముందుగా నిర్వహకులకు తెలియజేయాలన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

● డప్పువాయిద్యాలతో దద్దరిల్లిన బొమ్మల సెంటర్

పర్చూరు : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి చీరాల వాడరేవుకు తరలించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను డప్పువాయిద్యాలు, మందుగుండు సామాగ్రి కాలుస్తూ ఊరేగించారు. ఆయా గ్రామాల నుంచి విగ్రహాలు ఒక్కసారిగా బొమ్మల సెంటర్‌కు చేరడంతో భక్తులతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. పర్చూరులోని రామాలయం వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో చిన్నారులు ఏర్పాటు చేసిన విగ్రహం భక్తులను ఆకర్షించింది. టీనగర్‌లోనూ చిన్నారులు నెలకొల్పిన విగ్రహాన్ని గ్రామంలో భారీగా ఊరేగింపు చేసి, నిమజ్జనానికి తరలించారు. అద్దంకమ్మ మాన్యంలో గణేష్ యూత్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద భక్తులు ప్రతి రోజూ విశేష పూజలతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పర్చూరు, బోడవాడ, జాగరమూడి, కొల్లావారిపాలెం గ్రామాల నుంచి విగ్రహాలను వాడరేవుకు నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనానికి మహిళలు, చిన్నారులు, వృద్ధుల సైతం వాహనాల్లో భారీగా తరలివెళ్లారు.

ఇంకొల్లు : ఇంకొల్లులోని మెయిన్ రోడ్డులో బాలభక్త సమాజం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య యువకులు ఏర్పాటుచేసిన విగ్రహానికి నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను సీహెచ్ జయబాబు 10,516 రూపాయలకు వేలం పాటలో దక్కించుకున్నారు. మండలంలోని వంకాయలపాడులో నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన మహిళలు కోలాటం అలరించింది.


పర్చూరు రామాలయం వద్ద చిన్నారులు ఏర్పాటు చేసిన విగ్రహం

అలరించిన ముగ్గుల పోటీలు

పర్చూరు : గణేష్ ఉత్సవాల్లో భాగంగా పర్చూరులోని మద్యబజార్లో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వహకులు వినాయక విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. మహిళలు భారీగా తరలి రావడంతో మండప ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి లగడపాటి మంగాదేవి కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతిని కాసా అరుణకుమారి పొందారు. న్యాయనిర్ణేయతలుగా కారుమూరి సీతారామయ్య, కృష్ణంశెట్టి రాజ్యలక్ష్మి వ్యవహరించారు.


అద్దంకమ్మ మాన్యంలో ఆకట్టుకుంటున్న విఘ్నేశ్వరుడు

నేడు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ఇంకొల్లు : ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఇంచార్జి ఎంపీడీవో స్వరూపరాణి తెలిపారు. అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డులు, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం

ఇంకొల్లు: జె.పంగులూరు మండలం రెవెన్యూ కార్యాలయంలో సర్వేయరుగా పనిచేస్తున్న బండి సురేష్‌బాబు తనయుడు నందకిషోరు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కడవకుదురు రోడ్డులో నివశిస్తు న్న పేదలకు అన్నం ప్యాకెట్లు పంపిణీ చే శారు. ప్రతీ సంవత్సరం ఇలా సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని దాతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాపు సంఘ నాయకుడు పొన్నగంటి జానకీరామారావు తదితరులు పాల్గొన్నారు.


బురదమయమైన రోడ్డు

అధ్వానంగా కొణిదెన-నాగరాజుపల్లి లింకు రోడ్డు

● రాకపోకలకు ఇబ్బందులు

బల్లికురవ : మండలంలోని కొణిదెన, నాగరాజుపల్లి లింకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీని గుండా రెండు గ్రామాల రైతులు, గ్రానైట్ వ్యాపారులు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. మోకాటి లోతు గోతులు, ఇరు వైపులా తుమ్మ చెట్లు దట్టంగా పెరగడంతో రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. రోజూ వ్యవసాయ పనులకు వెళ్లలేక అవస్థలు పడుతున్నామని కూలీ లు వాపోతున్నారు. సమస్యను ఇప్పటికే పలుమార్లు అధికార్ల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అధ్వాన రోడ్డులో ప్రతి రోజు ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాగాణిలా ఉంది..



రోడ్డు మగాణిలా ఉంది. దీనిపై ప్రయాణం అంటేనే భయమేస్తుంది. కూలి పనులకి వెళ్లడం కష్టంగా ఉంది. బురదలో నడవడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు పడితే బురదమయమై చిత్తడిగా మారుతోంది. త్వరగా రోడ్డును అభివృద్ధి చేసి మా అవస్థలను తీర్చాలి.

- బండి మాణిక్యం, వ్యవసాయ కూలి, కొణిదెన

త్వరితగతిన అభివృద్ధి చేయాలి..



వర్షం కురిస్తే రోడ్డుపై వెళ్లడం చాలా కష్టంగా ఉంది. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఇదే దగ్గర దారి. నడిచేటప్పుడు బురదలో కాలు జారుతుందేమోనని భయంగా ఉంటోంది. అధికారులు, పాలకులు దృష్టిపెట్టి రోడ్డును త్వరితగతిన అభివృద్ధి చేయాలి.

- బండి అనిత, వ్యవసాయ కూలి, కొణిదెన

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

వేటపాలెం : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. ట్రాన్స్‌ఫారాలు చెట్ట మధ్యఉండడంతో పాటు, విద్యుత్ స్తంభాలకు పాదులు అల్లుకున్నాయి. దీని వల్ల ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దేశాయిపేట పంచాయతీ సాయిబాబా దేవస్థానం రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌కి తీగలు అల్లుకున్నాయి. అలాగే రావూరిపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముందు ట్రాన్స్‌ప్మార్ వద్ద పాదులు మొలిచాయి. ఉన్నతాధికారులు స్పందించి తక్షణం చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొరవడిన పారిశుధ్యం

సైడ్‌డ్రైన్‌లు లేక ఇక్కట్లు

రోడ్డు పైనే వాడుక నీరు



కాలువలో నిలిచిన మురుగు


రోడ్డు పక్కనే ఉన్న ఎరువు దిబ్బ


నిల్వ ఉన్న మురుగులో దోమ లార్వా

వెంకటాపురం (అద్దంకిరూరల్) : మండలంలోని వెంకటాపురం గ్రామం ఎస్సీ కాలనీలో పారిశుధ్యం కొరవడింది. సైడ్‌డ్రైన్‌లు లేక కాలనీ వాసులు ఇక్కట్లు పడుతున్నారు. వాడుక నీరు పోయే మార్గం లేక ఎక్కడికక్కడే నిలిచి పోవడంతో నివాస ప్రాంతాలు దుర్గంధభరితంగా మారాయని కాలనీ వాసులు వాపోతున్నారు. కొంతమంది రోడ్డు పక్కనే పేడ దిబ్బలను పోయడంతో కాలుష్యం అధికమవుతోంది. రోడ్లపై చేరిన మురుగు నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల దోమల ఉధృతి పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదముందని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

దోమలు పెరిగాయి..



చెత్తాచెదారం, మురుగు నీరు నిలిచి పోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. నిల్వ ఉన్న మురుగునీరు దోమలకు నిలయంగా మారింది. దోమల కాటుతో రాత్రిళ్లు నిద్ర పట్టడంలేదు.

- చందోలు వెంకటసుబ్బయ్య

త్వరలో సైడ్‌డ్రైన్‌ల నిర్మాణం..



గ్రామ సర్పంచ్‌తో చర్చించి 14వ ఆర్థిక సంఘం, ఎన్ఆర్ఈజీఎస్ మ్యాచింగ్ నిధులతో త్వరలో కాలనీలో సైడ్‌డ్రైన్‌ల నిర్మాణం చేపడతాం. ఇంకుడు గుంతల నిర్వహణ ఉపాధి హామీ సిబ్బందికి అప్పగింజాం.

- రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి

విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ

అద్దంకిటౌన్ : మార్షల్ ఆర్ట్స్ అసోషియేషన్ ద్వారా రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీని ఏర్పాటు చేసి మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు మార్షల్ ఆర్ట్స్ అసోషియేషన్ ఫౌండర్ వి.రవి తెలిపారు. ఆదివారం స్థానిక బంగ్లారోడ్డులోని భాష్యం స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ మార్షల్ ఆర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏపీలోని జిల్లాల నుంచి వచ్చిన సీనియర్ బ్లాక్ బెల్ట్ మాస్టర్స్‌తో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా మార్షల్ ఆర్ట్స్ అసోషియేషన్‌ను ఏర్పాటు చేసి జిల్లాల వారీగా అధ్యక్ష కార్యదర్శులను ఎంపిక చేస్తామన్నారు.


పలు జిల్లాల సెక్రటరీలుగా ఎన్నికైన వారితో ఫౌండర్ రవి

పరిహారం అందజేస్తాం

ఉప్పుగుండూరు (నాగులుప్పలపాడు): జాతీయ రహదారి 216 రోడ్డువిస్తరణలో భూములుకోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేస్తామని మండల సర్వేయర్ భాస్కరరావు తెలిపారు. పరిహారం చెల్లించకుండా రోడ్డు పనులు చేయడంపై ఉప్పుగుండూరు రైతులు అభ్యంతరం చెప్పడంతో ఆప్రాంతంలో రోడ్డు పనులు నిలిచాయి. ఆదివారం సర్వే బృందం ఉప్పుగుండూరులో పరిహారం అందని రైతుల భూములను పరిశీలించి రికార్డులలో తప్పులు దొర్లినందునే పరిహారం ఆగిందని, తప్పులు సరిచేయించి త్వరలో పరిహారం అందజేస్తామని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నాగరాజు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి బెల్లం వేణుగోపాల్, రైతులు బాలినేని సుబ్బారావు,

ఉచిత వైద్యశిబిరం అభినందనీయం

మద్దిపాడు : నల్లూరి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ రామారావు అన్నారు. ఆదివారం పెదకొత్తపల్లి, లింగంగుంటలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 213 మంది రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెదకొత్తపల్లి మాజీ సర్పంచ్ బుచ్చయ్య చౌదరి, పీఆర్‌వో శ్రీనివాస్, ఫార్మసిస్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒంగోలుకు తాగునీరు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

మద్దిపాడు : గుండ్లకమ్మ రిజర్వాయర్ ద్వారా ఒంగోలుకు తాగునీరు అందించడమే తమ లక్ష్యమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆన్నారు. ఆదివారం గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒంగోలు ప్రజలకు తాగునీరు తక్షణం అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. తొలుత ఏడుగుండ్లపాడు చెరువుకు నీరు పుష్కలంగా అందించి తద్వారా తాగునీరు ఇస్తామన్నారు. గుండ్లకమ్మకు నీరు రావడం మంచి పరిణామమని అన్నారు. అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.. ప్రభుత్వం తాగునీటికి తొలిప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఒంగోలు ప్రజలు తాగునీరు లేక తీవ్ర అవస్థలకు గరికావడం ఎంతో బాధాకరమన్నారు. గుండ్లకమ్మకు నీరు పుష్కలంగా వచ్చేందుకు ప్రాజెక్టు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, మున్సిపల్‌శాఖ ఇంజనీర్లు అప్రమత్తంగా ఉండి తాగునీరు అందించాలని కోరారు. తాగునీటి కోసం ఎన్ని లక్షలయినా వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఒంగోలు ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడాల్సిన అవసరం లేదన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఒంగోలు ఆర్‌డీఓ కె. శ్రీనివాసరావు, ప్రాజెక్టుడీఈ సంగీత, పాలకేంద్రం చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంతి బాబు , గుండ్లాపల్లిసర్పంచ్ రఘురామయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్లు ముత్తనపల్లి రామలింగయ్య, చుండూరి రఘురామ్, నాగన్నపాలెం టీడీపీ నాయకులు కాకర్ల విజయ్, రావి ప్రసాదు, మార్నెని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలుకు తాగునీటిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, ఆర్డీవో శ్రీనివాసరావు, కమిషనర్ వెంకటకృష్ణ తదితరులు





కేరళలో యుగంధర్ తీసిన ఎడ్ల పందేల ఫొటో (ఇన్‌సెట్లో) పురస్కారం అందుకుంటూ..

యుగంధర్‌కు ప్రతిభా పురస్కారం

నాగులుప్పలపాడు: ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాదులోని జవహర్‌లాల్‌నెహ్రూ యూనివర్శిటీ నిర్వహించిన పోటీలలో నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన ఫొట్రోగ్రాఫర్ కె.యుగంధర్ ప్రతిభా పురస్కారాన్ని పొందారు. ఆదివారం యూనివర్శిటీ ఫొటోగ్రఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.మధుకర్ నుంచి ఆయన పురస్కారం అందుకున్నారు. ఈనెల 19 నుంచి యూనివర్సిటీ నెహ్రూఆర్ట్స్ గ్యాలరీలో ప్రదర్శన నిర్వహించింది. అందులో యుగంధర్ తీసిన కేరళలో జరిగిన ఎడ్ల పోటీల ఫొటో ఎంపికైంది. అలాగే జి.ఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ నిజామాబాద్‌వారు నిర్వహించిన పోటీలలో కూడా విజేతగా యుగంధర్ నిలిచారు. తండ్రి కె.వి.రామిరెడ్డి నుంచి ఫొటోగ్రఫీని వారసత్వంగా పొందిన యుగంధర్ పలు దిన, వార ,మాస పత్రికలకు ఫొటోగ్రాఫర్‌గా పనిచేశారు. అనేక వర్క్‌షాపులతో పాటు కేరళ, కర్నాటక, తమిళనాడు ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్‌లోని ఆరకు, పాపికొండలు, భద్రాచలం ప్రాంతాలలోని గిరిజనుల జీవన శైలి చిత్రాలను చిత్రీకరించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డులను పొందారు. 2014 నుంచి ఒంగోలులోని రూడ్‌సెట్ సెంటర్‌లో ఫొటోగ్రఫీ విభాగంలో ఉపాధ్యాయుడిగా ఆయన పనిచేస్తున్నారు. పురస్కారం సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లు ఆయనకు అభినందనలు తెలిపారు.



నివాళులర్పిస్తున్న సివిల్‌సప్లయిస్ రాష్ట్ర డైరెక్టర్ మన్నం శ్రీధర్

టీడీపీ చీమకుర్తి మండల అధ్యక్షుడికి మాతృవియోగం

చీమకుర్తి : టీడీపీ మండల అధ్యక్షుడు, ఏలూరివారిపాలెం సర్పంచ్ గోగినేని చంద్రశేఖరరావుకు తల్లి గోగినేని మహాలక్ష్మమ్మ (95) ఏలూరి వారిపాలెం ఆమె స్వగృహంలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. సివిల్ సప్లైయిస్‌కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మన్నం శ్రీధర్‌బాబు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. చంద్రశేఖరరావుకు సానుభూతి తెలిపారు. ఇంకా చైర్మన్ కౌత్రపు రాఘవరావు, పట్టణపార్టీ అధ్యక్షుడు రావిపాటి రాంబాబు, రామినేని యోగయ్య, గొల్లపూడి వెంకట్రావు, సీపీఎం నాయకులు పమిడి వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షుడుగుడిపూడి ప్రసాదు, టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

మద్దిపాడు: సబ్సిడీ రుణాలకు సంబంధించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్. కృష్ణ ఆదివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీ , కాపు కార్పొరేషన్ కింద రుణాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న వారు తప్పక హాజరు కావాలన్నారు.

వేడుకగా గణేష్ నిమజ్జనం



చీమకుర్తిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

నీరులేక భక్తుల అవస్థలు

చీమకుర్తి : గణేష్ నిమజ్జన వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. మండపాల్లో కొలువుదీరిన గణనాథులను ఊరేగింపుగా భక్తులు నిమజ్జనానికి తరలించారు. మేళతాళాలతో రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా నిర్వహించారు. కాగా ఈఏడాది నిమజ్జనానికినీరు కరువైంది. చెరువులు, జలాశయాలు వట్టిపోయాయి. గత ఏడాది ఇదే సమయంలో సాగర్ జలాలు ఓబీసీద్వారా ప్రవహించాయి. దీంతో భక్తులందరూ సులువుగా నిమజ్జనం చేశారు. ఈసారి రామతీర్థం రిజర్వాయర్‌లో సైతం జలాలు అడుగంటాయి. విధిలేని పరిస్థితుల్లో పట్టణానికి సుదూరంగా సముద్రానికి వెళ్లలేక రిజరాయర్‌లోనే ఉన్న కొద్ది నీటి లోనే నిమజ్జనం చేసి మమ అనిపించారు. మట్టివిగ్రహాలకు ట్యాంకర్ల ద్వారా జలాలను తీసుకువచ్చి నిమజ్జనం చేస్తుండడం విశేషం

మద్దిరాలపాడులో..

మద్దిరాలపాడు (నాగులుప్పలపాడు): మద్దిరాలపాడులో ఆదివారం వినాయక నిమ్మజ్జనం ఘనంగా జరిగాయి. ఎన్ఆర్ఐ నెప్పల సుబ్బారాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని గుండ్లకమ్మలో నిమ్మజ్జనం చేశారు.



మద్దిరాలపాడులో పూజల్లో పాల్గొన్న ఎన్ఆర్ఐ నెప్పల సుబ్బరాయుడు

మద్దిపాడులో..

మద్దిపాడు : మద్దిపాడు లారీ యూనియన్ ఆఫీసు వద్ద వినాయకుడి ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్లారు. మద్దిపాడులోని ఘడియపూడి కాలనీలో వినాయక నిమజ్జన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమీపంలోని గుండ్లకమ్మనదిలో స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ యూత్ ఫోర్స్ కమిటీ సభ్యులు కనపర్తి సునీల్, అప్పల రమేష్, కురిచేటి అంజనరావు, బొల్లా రవికుమార్, అప్పల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఘడియపూడి కాలనీలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న గ్రామస్థులు

పరిహారం అందజేస్తాం

ఉప్పుగుండూరు (నాగులుప్పలపాడు): జాతీయ రహదారి 216 రోడ్డువిస్తరణలో భూములుకోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేస్తామని మండల సర్వేయర్ భాస్కరరావు తెలిపారు. పరిహారం చెల్లించకుండా రోడ్డు పనులు చేయడంపై ఉప్పుగుండూరు రైతులు అభ్యంతరం చెప్పడంతో ఆప్రాంతంలో రోడ్డు పనులు నిలిచాయి. ఆదివారం సర్వే బృందం ఉప్పుగుండూరులో పరిహారం అందని రైతుల భూములను పరిశీలించి రికార్డులలో తప్పులు దొర్లినందునే పరిహారం ఆగిందని, తప్పులు సరిచేయించి త్వరలో పరిహారం అందజేస్తామని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నాగరాజు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి బెల్లం వేణుగోపాల్, రైతులు బాలినేని సుబ్బారావు, బెల్లంశ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళాకారిణి శ్రీదేవి ఆకస్మిక మృతి

చీమకుర్తి: సంగీత కళాకారిణి పట్టణంలో తొలిసారిగా ప్రయివేటు స్కూలు నెలకొల్పిన మద్దాళి శ్రీదేవి (60) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. బ్రహ్మణ కార్పొరేషన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మద్దాళి మాధవరావు శ్రీదేవి మృతదేహాన్ని సందర్శించారు. కార్పొరేషన్ ద్వారా మట్టి ఖర్చుల కింద పదివేలు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు , పట్టణవాసులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రత్యామ్నాయ పంటలే మేలు

మద్దిపాడు : రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయాధికారిణి జి. స్వర్ణలత తెలిపారు. ఆయా పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తున్నామన్నారు. విత్తనాలు తీసుకున్న వారు దుర్వినియోగం చేయకూడదని తప్పనిసరిగా విత్తుకుంటామని హామీ పత్రం సమర్పించాలని తెలిపారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

మద్దిపాడు: మండలంలోని గ్రామాల్లో వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై రాజేష్ అన్నారు. ఆదివారం వినాయక విగ్రహాల వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. రాత్రి సమయాల్లో విగ్రహాల వద్ద కమిటీ సభ్యులు ఉండాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎక్కడైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోంటామని ఎస్సై హెచ్చరించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

మద్దిపాడు : పశువులకు గాలికుంటు వ్యాధినివారణకు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారిణి డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు ఉచితంగా వేయనున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో టీకాలు వేస్తే పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారించవచ్చనని తెలిపారు. వచ్చేనెల 29వరకు వ్యాక్సిన్ కార్యక్రమం ఉంటుందన్నారు.



కాకతీయనగర్‌లో పూజలు చేస్తున్న విఘ్నేశ్వర కమిటీ సభ్యులు

ఓం లంబోదరయానమః



గోల్డ్ మర్చంట్స్‌అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ఎంపీ వైవీ



పులివెంకటరెడ్డి కాలనీలో వినాయక పూజల్లో భక్తులు



దక్షిణం బజారులో ప్రతిష్ఠించిన చోటే మట్టి వినాయక నిమజ్జనం

ఒంగోలు కల్చరల్ : గణపతి నవరాత్రుల సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి మండపాల్లో ఆదివారం ప్రముఖులు పూజలు చేశారు. గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీరోడ్‌లో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుని మండపంలో పార్లమెంటు సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు తాతా ప్రసాద్, వేమూరి సూర్యనారాయణ తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు బాచిన చెంచుగరటయ్య, వైసీపీ నేతలు గొర్రెపాటి శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు గంగాడ సుజాత తదితరులు పాల్గొన్నారు. అటు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ ఆదివారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో వినాయక పూజలలో పాల్గొన్నారు. ఒంగోలు బాపూజీ గోసంరక్షణ శాల వద్దగల విఘ్నేశ్వర ఆలయంలో ఆయన పూజలను నిర్వహించారు. అనంతరం కొణిజేడు బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పర్వతారోహణలో సాయిబాబా విద్యార్థులు



ఒంగోలు కలెక్టరేట్ : భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోడానికి కావాల్సిన మానసిక, శారీరక సన్నద్ధతను విద్యార్థులకు అందించడానికి సాయిబాబా సెంట్రల్ స్కూలు 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆదివారం పర్వతారోహణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కరస్పాండెంట్ మేజర్ సురేష్‌బాబు తెలిపారు. పర్వతారోహణలో మెళకువలు, ఇబ్బందులు, ప్రమాదాల నివారణలో ముందు జాగ్రత్తలు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. మర్లపాడు, యర్రజర్ల, కొణిజేడు కొండలపై నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి ఎన్‌సిసి విద్యార్థులతో సహా 172 మంది పాల్గొన్నారని ప్రిన్సిపాల్ కల్నల్ సీవీ రమణయ్య తెలిపారు.

నేడు మాగుంట రాక



ఒంగోలు కలెక్టరేట్ : టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సోమ, మంగళవారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలతో మాట్లాడతారు. రాత్రికి గాంధీరోడ్డులో గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు నగరంలో జరిగే కార్యక్రమాల్లో మాగుంట పాల్గొంటారు.

కొప్పోలులో వినాయక లడ్డు రూ.17,500

ఒంగోలు రూరల్ : ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలోని తోర్పు బజారు వినాయక విగ్రహం వద్ద లడ్డుకు ఆదివారం నిర్వహించిన వేలంలో రూ.17,500 పాలకేంద్రం అధ్యక్షుడు కాట్రగడ్డ నాగేశ్వరరావు కొనుగోలు చేశారు. అనంతరం లడ్డును భక్తులకు పంపిణీ చేశారు. ఆ తర్వాత విగ్రహాన్ని కొత్తపట్నం సముద్రంలో నిమజ్జనానికి తరలించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వలేటివారిపాలెంలో అభిషేకం

వలేటివారిపాలెంలో వినాయక విగ్రహానికి 108 కలశాలతో అష్టోత్రశత కలశాభిషేకం పురోహితులు నారాయణ కళ్యాణం చక్రవర్తి నారాయణం వేణుగోపాల్ లు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



వేలంలో కొనుగోలు చేసిన లడ్డుతో నాగేశ్వరరావు

మంచి ఆలోచన విధానంతోనే జనసేన

- పవన్ అభిమానులకు ఎప్పుడు అండగా ఉంటా

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కలెక్టరేట్ : మంచి ఆలోచన విధానంతోనే సినీహీరో పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కొనియాడారు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని జనసేన సేవాదళ్ సమన్వయకర్త రావూరి బుజ్జి ఆధ్వర్యంలో స్థానిక ఎంఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని దామచర్ల ప్రారంభించారు. ఈసం దర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌కు మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు వచ్చే నెల 2న జరగనుండటంతో జిల్లా వ్యాప్తంగా పవన్ అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జనసేన కార్యకర్తలకు తాను ఎప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అభిమానులు రక్తదాన శిబిరంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జనసేన సేవాదళ్ సమన్వయకర్త రావూరి బుజ్జి మాట్లాడుతూ వారం రోజుల పాటు పవన్ కళ్యాణ్ అభిమానుల ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పవన్ కళ్యాన్ జన్మదినం రోజైన సెప్టెంబరు 2వ తేదీన విస్తృత స్థాయిలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, చుందు శ్రీనివాసులు, రహీమ్, మందా సురేష్, అనుదీప్, రవి, ఖాదర్‌బాష, రాజు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, మంత్రి శ్రీను, ఘనశ్యాం, బుజ్జి తదితరులు

సినిమాగైడ్

థియేటర్	సినిమా
సత్యం	అర్జున్‌రెడ్డి
రత్నమహల్	ఆనందోబ్రహ్మ
గోపి	జయజానకి నాయక
సాయిసరోజ్	లై
తులసీరాం	ఫిదా
జయరాం	నక్షత్రం

గోరంట్ల సినిమాస్ స్క్రీన్స్‌లలో----
గౌతమ్‌నంద, ఆన్‌బెలి, నేనే రాజు నేనేమంత్రి, ఆనందోబ్రహ్మ, అర్జున్‌రెడ్డి

ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన దామచర్ల

ఒంగోలు రూరల్ : ప్రతి పేదకూ తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉంటోందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. ఒంగోలు మండలం యరజర్ల గ్రామ పంచాయతీ మంగళాద్రిపురంలో ఆదివారం రాత్రి ఆయన 84 మంది పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థలాలు పొందిన వారికి గృహనిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో పూర్తి స్థాయిలో సిమెంటు రోడ్లు ,డ్రైనేజి ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. యరజర్ల గ్రామం నుంచి మంగళాద్రిపురం వరకు రూ.50లక్షలతో రోడ్డు కొంత దూరం, మరికొంత దూరం తారు రోడ్డుకు నిధులు విడుదల చేయించినట్లు చెప్పారు. ఆర్డీవో కమ్మ శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళాద్రిపురం - యరజర్ల కొండ పరిధిలో ఉన్నదన్నారు. ఈకొండ పరిధిలోని భూమిని కన్వక్షన్ చేసి పేదలకు నివేశన స్థలాలు ఇచ్చామని చెప్పారు. ఈ స్థలాలను ఎవరికి తనఖాలు పెట్టడం, అమ్మకాలు చేయడం చేయవవద్దని సూచించారు. ఈ సందర్భంగా వందమందికి పైగా మంగళాద్రిపురం వాసులు తెలుగుదేశంలో చేరారు. ఎమ్మెల్యే దామచర్ల వారందర్నీ స్వాగతించి పచ్చకండువాలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వి.ఎస్. శశికుమార్ , గ్రామ సర్పంచ్ దివి అరుణ, ఒంగోలు మండల టీడీపీ అధ్యక్షుడు కామేపల్లి శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మక్కెన శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గుండపనేని శ్రీనివాసరావు, గ్రామనాయకులు కంకణాల వెంకట్రావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి కోటయ్య, బ్రహయ్య, వీఆర్వో ప్రవీణ్ గ్రామస్థులు పాల్గొన్నారు.